ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నేటి మీ కపిల్‌చిట్స్‌తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 307 పేజీలు: 10+4 వెల: 6.50

## హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంప్ పేరు!

**ఫ్యూచర్ సిటీ ప్రధాన రహదారికి రతన్ టాటా పేరు**

**పలురోడ్లకు అంతర్జాతీయ టెక్ కంపెనీల పేర్లు కూడా..**

**సమ్మిట్ సందర్భంగా సిఎం రేవంత్ నిర్ణయం**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్7:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లో పలు రోడ్లకు ప్రముఖుల పేర్లు పెట్టేందుకు వినూత్న ప్రతిపాదనతో ముందుకు వచ్చారు. ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హైదరాబాద్‌కు మరింతగా గ్లోబల్ మ్యాప్‌లో చోటు కల్పించేలా సీఎం సంకల్పించారు,అందుకు అనుగుణంగా ప్రపంచ >>2




## 610 కోట్లు రిఫండ్

**95% విమాన సర్వీసులు పునరుద్ధరణ**

**కుదుట పడుతున్న ఇండిగో**

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంపై కేంద్ర పౌర విమానయాన శాఖ కఠిన చర్యలు కార్యరూపంలోకి వచ్చాయి. రద్దయిన లేదా తీవ్రంగా ఆలస్యమైన విమానాలకు సంబంధించి ప్రయాణికులకు చెల్లించాల్సిన రిఫండ్‌లను ఆదివారం రాత్రి8 గంటలలోపుపూర్తి చేయాలని >>2

# గ్లోబల్ సమ్మిట్‌కు అంతా రెడీ




**హాజరు కానున్న 44 పైగా దేశాల ప్రతినిధులు**

**ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ కంపెనీల నుంచి హాజరవుతున్న సిఇఒలు, డైరెక్టర్లు**

**ప్రారంభ వేడుకకే దాదాపు 2వేలమంది విదేశీ అతిథులు**

**భారీగా పెట్టుబడులకు ఆహ్వానం, ప్రభుత్వ సహకారంపై చర్చ**




## నేటి మధ్యాహ్నం సదస్సు ప్రారంభించనున్న గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 7:** తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా 2 రోజులగ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్దమైంది. ఇందు కోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా >>2

## తెలంగాణ రైజింగ్‌కు తిరుగులేదు..

**రెండేళ్లు పూర్తి సందర్భంగా సిఎం రేవంత్**

నిన్నటి వరకు ఒక లెక్క..
గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క 2

## జిల్లాల్లో రేపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్7:** తెలంగాణలోని జిల్లాల్లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు ముహూర్తం ఖరారు చేసారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈనెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఈమేరకు సీఎస్ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసారు. ఇందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే సోమవారం నుంచి జరగబోయే గ్లోబల్ సమ్మిట్ లో కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసారు.

## 415 సర్పంచ్‌లు ఏకగ్రీవం




**రెండో విడత పంచాయతి ఎన్నికలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్7:** రాష్ట్రంలో రెండోవిడత పంచాయతీ ఎన్నికల్లో 415 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 44 గ్రామాలు, నల్గొండ, నిజామాబాద్‌లలో ఒక్కో జిల్లాలో 38 గ్రామ పంచాతీయల్లో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మొత్తం 9,331 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. రెండో దశలో 4,332 గ్రామ పంచాయతీల సర్పంచి స్థానాలకు, 38,322 వార్డు స్థానాలకు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2 వరకు నామినేషన్లు స్వీకరించారు. >>2

## నులిపెడుతున్న చలి

**ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలలో కనిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు**



**హైదరాబాద్, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** తెలంగాణలో చలి తీవ్రత మరింత పెరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలలో ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయిలో సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి, ఇదే సమయంలో హైదరాబాద్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పరిస్థితి కాస్త మెరుగ్గా వుంది. రాబోయే వారంరోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే అవకాశం వుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో చలి తీవ్రత ఎక్కువయ్యింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి చలిగాలుల తీవ్రత పెరగడం, రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, చెరువుల్లో నీరు సమృద్ధిగా వుండడం, పచ్చదనం పెరిగిన కారణంగా వరుసగా ఐదవ ఏడాది కూడా డిసెంబరు నెలలో చలి తీవ్రత బాగా పెరిగింది. సాధారణంగా డిసెంబరు నెలలో రాష్ట్రంలో చలి తీవ్రత ఎక్కువగా వుంటుంది. జనవరి నెలాఖరు వరకు ఈ పరిస్థితి వుంటుంది. ఈ ఏడాది చలి కాలం కొంత ఆ లస్యంగా నవంబరు రెండవ వారం తరువాత మొదలైనా చలిగాలుత తీవ్రత ఎక్కువగానే వుండడం విశేషం. అక్టోబరు నెల వరకు ఓవైపు >>2



# 610 కోట్లు రిఫండ్

>>విధించిన డెడ్‌లైన్ ప్రకారం ఇండిగో యాజమాన్యం ఇప్పటి వరకు సుమారు రూ. 610 కోట్లను ప్రయాణికులకు రిఫండ్ చేసినట్లు మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. విమానాల రద్దు కారణంగా తమ ప్రయాణాలను రీషెడ్యూల్ చేసుకునే వారి నుంచి ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రయాణికులకు తక్షణమే సహాయం అందించేందుకు, రిఫండ్, రీబుకింగ్ సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించేందుకు ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ప్రభుత్వ జోక్యంతో ఇండిగో పనితీరు క్రమంగా మెరుగుపడుతోందని, విమానాల షెడ్యూల్స్ సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. శుక్రవారం 706 విమానాలు నడపగా, శనివారానికి ఆ సంఖ్య 1,565కు పెరిగింది. ఆదివారం 1,650కి చేరుకున్నాయని వెల్లడించింది. ఇతర దేశీయ విమానయాన సంస్థల కార్యకలాపాలు సజావుగా పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని తెలిపింది. ఇండిగో విమానాల రద్దుతో పెరిగిన డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని టికెట్ ధరలు అమాంతం పెరగడంతో, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ధరలపై పరిమితి విధించింది. ఈ చర్యతో ప్రభావిత మార్గాల్లో ఛార్జీలు అదుపులోకి వచ్చాయని పేర్కొంది. అదేవిధంగా, ప్రయాణికుల నుంచి వేరుపడిన లగేజీని 48 గంటల్లోగా గుర్తించి అందజేయాలని ఆదేశించగా, శనివారం నాటికి 3,000 బ్యాగులను ఇండిగో డెలివరీ చేసింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా ప్రధాన విమానాశ్రయాల్లో పరిస్థితులు సాధారణంగా ఉన్నాయని, కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్లు ధృవీకరించారు. ప్రభుత్వ వేగవంతమైన చర్యలతో దేశవ్యాప్తంగా విమానయాన కార్యకలాపాలు వేగంగా స్థిరపడుతున్నాయని, పూర్తిస్థాయిలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

**ఇండిగోబోర్డు ప్రత్యేక కమిటీ సమీక్ష**

దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో కార్యకలాపాలు తీవ్ర గందరగోళంలో పడ్డాయి. పెద్ద ఎత్తున విమానాలు ఆలస్యం కావడం, కొన్ని సర్వీసులు రద్దు కావడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభంపై తక్షణమే స్పందించిన ఇండిగో యాజమాన్యం, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఒక ఉన్నత స్థాయి సంక్షోభ నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇండిగో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ప్రస్తుత సంక్షోభం, దాని తీవ్రతపై యాజమాన్య బృందం బోర్డు సభ్యులకు సమగ్రంగా వివరించింది.

అనంతరం బోర్డు సభ్యులు ప్రత్యేకంగా సమావేశమై, వేగంగా మారుతున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీలో ఇండిగో చైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా, బోర్డు డైరెక్టర్లు గ్రెగ్ సరెట్స్కి, మైక్ విటేకర్, అమితాబ్ కాంత్, సీఈఓ పీటర్ ఎల్బర్స్ సభ్యులుగా ఉన్నారు. కార్యకలాపాలను తిరిగి గాడిన పెట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై యాజమాన్యం నుంచి ఈ బృందం ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తోందని ఇండిగో తెలిపింది. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించి, సర్వీసులను సాధారణ స్థితికి తీసుకురావడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొంది. ఇబ్బందులు పడిన ప్రయాణికులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఇండిగో హామీ ఇచ్చింది. విమానాలు రద్దయిన వారికి పూర్తి రిఫండ్ ఇవ్వడంతో పాటు, ప్రయాణ తేదీ మార్పు, రద్దు ఛార్జీల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది.

# నులిపెడుతున్న చలి

>> భారీ వర్షాలు మరోవైపు ఉక్కపోత వాతావరణంలో ఇబ్బందులకు గురైన ప్రజలు చలికాలం మొదలయ్యాక ఉపశమనం పొందడం తెలిసిందే. అయితే వారం రోజులుగా చలి తీవ్రత పలు ప్రాంతాలలో ఒక్కసారిగా పెరిగి ప్రజలను వణికిస్తోంది. చలి తీవ్రత పెరగడం వల్ల చాలాచోట్ల ప్రజలు చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉదయం ఎనిమిది గంటల వరకు చలి ప్రభావం కనిపిస్తోంది. ఇదే సమయంలో పొగమంచు రహదారుల ను కమ్మేస్తుండడంతో వాహనదారులు రహదారులపై ఏమీ కనిపించక పోవడంతో ఇబ్బందులకు లోనవుతున్నారు. దీని కారణంగా కొన్నిచోట్ల రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదిలాబాద్‌లో శనివారం రాత్రి ఎనిమిది డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదవగా కుము రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 9.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. నిర్మల్‌లో 10.5 డిగ్రీలుగా వుండగా రాజన్న సిరిసిల్లాలో 10.9, జగి త్యాల, సంగారెడ్డిలలో 11.1 డిగ్రీలుగా వుంది. కామారెడ్డిలో 11.2, సిద్దిపేటలో 11.3, నిజామాబాద్‌లో 11.3, మంచిర్యాలలో 11.4, మెదక్‌లో 11.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్‌లో 11.8, పెద్దపల్లిలో 11.8, ములుగులో 12 డిగ్రీలు, హనుమకొండలో 12.1, భూపాల పల్లిలో 12.1, కరీంనగర్ 12.2, రంగారెడ్డి జిల్లాలో 12.2, జనగాంలో 12.4, వరంగల్‌లో 12.5, మేడ్చల్ 12.9, కొత్తగూడెంలో 13.1, మహబూబాబాద్‌లో 13.1, భువనగిరిలో 13.2, హైదరాబాద్‌లో 13.8, నారాయణ్‌పేట్‌లో 14.3, సూర్యాపేట్ లో 14.3, ఖమ్మంలో 14.5, నల్గొం డలో 15.1, మహబూబ్‌నగర్‌లో 15.2, నాగర్‌కర్నూలులో 15.3, వనపర్తిలో 17.4, జోగుళాంబ గద్వాల్‌లో 17.8 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయా య్యి. రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు ఇదే పరిస్థితులు వుంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# 415 సర్పంచ్‌లు ఏకగ్రీవం

>> అందులో శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగా, 4,236 సర్పంచ్ స్థానాలకు 415 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. అలాగే 38,322 వార్డు స్థానాలకు 8,304 స్థానాలు ఏకగ్రీవంగా అయ్యాయి. సర్పంచ్ స్థానాలకు మొత్తం 13,128 మంది అభ్యర్థులు పోటీలు నిలువగా, వార్డు స్థానాలకు 78,158 మంది పోటీలో ఉన్నారు. రెండో విడతలో సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన వారిలో 7,584 మంది తమ ఉపసంహరించుకోగా, వార్డు స్థానాలకు పోటీ చేసిన వారిలో 10,427 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈనెల 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగనున్నది. అదేరోజు ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచి ఎన్నిక ఉంటుంది.

## ఎంపిలో 10 మంది మావోయిస్టులు లొంగుబాటు

**భోపాల్, డిసెంబరు 7:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎదుట 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బాలాఘాట్ జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కన్హా- భోరండియో(కెబి) డివిజన్‌కు చెందిన నలుగురు మహిళలతో సహా 10 మంది మావోయిస్టులు సిఎం ఎదుట తమ ఆయుధాలు సమర్పించి లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో స్పెషల్ ఎంఎంసి జోన్ కార్యదర్శి, మోస్ట్‌వాంటెడ్ కమాండర్ సురేందర్ అలియాస్ కబీర్ కూడా ఉన్నారు. ఇటీవల ఓ మహిళా మావోయిస్టు నేత లొంగిపోయిన నెల రోజుల్లోనే ఇంతమంది ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి లొంగిపోవడం ఇదే ప్రథమం. 2023 ఆగస్టులో తీసుకొచ్చిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం నూతన పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని సిఎం మోహన్ యాదవ్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల పేరిట దాదాపు రూ.77 లక్షల మేర రివార్డు ఉందని బాలాఘాట్ రేంజ్ ఐజీ తెలిపారు.

## హైదరాబాద్‌లో రోడ్డుకు
# ట్రంప్ పేరు!

>> ప్రఖ్యాత వ్యక్తులు, కంపెనీల పేర్లను హైదరాబాద్‌లో ప్రధాన రహదారులకు పెట్టాలని నిర్ణయించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వద్ద రావిర్యాలను నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేసే 100 మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టాలని నిర్ణయించింది. రావిర్యాల ఇంటర్‌చేంజ్‌కు ఇప్పటికే టాటా ఇంటర్‌చేంజ్ అని పేరు పెట్టారు.

**యూఎస్ కాన్సులేట్ రోడ్డుకు డోనాల్డ్ ట్రంప్ ఎవెన్యూగా నామకరణం**

అలాగే ప్రపంచంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ అని నామకరణం చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ నిర్ణయంపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి ప్రభుత్వం లేఖ రాయనుంది.

**మరిన్ని ప్రధాన రహదారులకు గ్లోబల్ దిగ్గజ కంపెనీల పేర్లు**

ఢిల్లీలో ఇటీవల జరిగిన యూఎస్‌ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరమ్ (యుఎస్‌ఐఎస్ పిఎఫ్) వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ప్రకారం, హైదరాబాద్‌లోని ముఖ్య రహదారులకు ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల పేర్లు పెట్టాలన్న దృష్టిలో భాగంగా మరిన్ని ప్రతిపాదనలు ఉన్నాయి. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సేవలను గుర్తిస్తూ ఒక ముఖ్య రహదారిని గూగుల్ స్ట్రీట్ అని ప్రకటించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను కూడా పరిశీలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితవ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు పెట్టడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వటంతో పాటు, హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సీఎం భావిస్తున్నారు. అలాగే ఆ రోడ్లపై ప్రయాణించివారికి కూడా స్ఫూర్తిమంతంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదన చేశారు.

## వారం - వర్జ్యం

08-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
చవితి సా.4.10
పుష్యమి రా.2.56, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : మ.3.25-5.02
దు.ము.12.33-1.08, 2) మ.3.27-3.22
శుభసమయం : ఉ.10.00-11.00,
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఇవి ఆర్థికంగా లభించక పోయినా మానసిక తృప్తి నిస్తాయి.

**వృషభం:** దూరపు బంధువుల నుంచి అందిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ధనలాభం.

**మిథునం:**నిరాశ, నిస్పృహల మధ్యకాలం వెళ్లదీస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది.దూర ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కర్కాటకం:**జీవిత భాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వాహనసౌఖ్యం.ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.

**సింహం:** సన్నిహితులతో స్వల్ప అభిప్రాయ భేదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్త వహించండి. ఉద్యోగులకు బదిలీలు.

**కన్య:** తియ్యని మాటలతో మోసగించే వ్యక్తులు తారస పడతారు. అప్రత్తతతో ఉండండి. జీవిత భాగస్వామితో స్పర్ధలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోండి.

**తుల :** అనుకున్నదే తడవుగా పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ధన లాభం.

**వృశ్చికం:**కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆరోగ్య విషయంలో మెలకువ అవసరం.గృహం కొనుగోలు యత్నాలు చేస్తారు.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో కలసి ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బంది కలిగిస్తుంది. ప్రయాణాలు జాగ్రత్త.

**మకరం:**దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం సంతోషం కలిగిస్తుంది. శుభ కార్యాలలో పాల్గొంటారు. ధనలాభం.

**కుంభం:**దైవబలం ఉంటే అసాధ్యం లేదని నమ్మి భగవంతునిపై భారం వేస్తారు. ఉద్యోగ యత్నాలు.వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలంగాణ రైజింగ్‌కు తిరుగులేదు..

## రెండేళ్లు పూర్తి సందర్భంగా సీఎం రేవంత్
## నిన్నటి వరకు ఒక లెక్క.. గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క
## భారత దేశ గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణను మార్చడానికి సర్వం సిద్ధం




ఆదివారం ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 7:** రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఈనెల 7వ తేదీకి సరిగ్గా రెండేళ్లు పూర్తవుతోంది. ఇదే సమయంలో.. ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 8వ తేదీన ప్రారంభకానుంది.నిన్నటి వరకు ఒక లెక్క.. గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరోలెక్క అని సీఎం రేవంత్ వెల్లడించారు. నిన్న,నేడు,రేపు.. మీ ఆశీర్వాదమే నా ఆయుధం, మీ ప్రేమాభిమానాలే నాకుసర్వం, మీ సహకారమే నాకుసమస్తం. తెలంగాణ నాకుతోడుగా ఉన్నంత వరకు..ఈ గొంతులో ఊపిరి ఉన్నంత వరకు తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా ఆదివారం స్పందించారు. జాతి కోసం.. జనహితం కోసం.. గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలన్నారు. గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం నాకు ఆ ధైర్యం ఇచ్చి.. తమ ఓటుతో గెలుపు సంకల్పాన్ని ఇచ్చి.. నిండు మనసుతో ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ రెండేళ్ల ప్రస్థానంలో అనునిత్యం అహర్నిశలూ అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు శ్రమించానని చెప్పారు. గత పాలన శిథిలాల కింద కొన ఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశామన్నారు. రుణభారంతో వెన్ను విరిగిన రైతున్నకు రుణమాఫీతో వెన్నుదన్నుగా నిలిచామని స్పష్టం చేశారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్దతు ఇచ్చి ఆదానీ,అంబానీల లెక్క వ్యాపార రంగంలో నిలిపామన్నారు. బలహీనవర్గాల వందేళ్ల ఆకాంక్షలను కులగణనతో కొత్త మలుపు తిప్పామని ధీమా వ్యక్తం చేశారు. వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమాన్ని సార్థకత చేశామని గుర్తు చేశారు. చదువొక్కటే బతుకు తెరువుకు బ్రహ్మాస్త్రం అని నమ్మి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశామన్నారు. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టామని వివరించారు. స్వేచ్ఛ సామాజిక న్యాయం, సమానత్వం మూల సిద్ధాంతంగా ముందుకు సాగుతన్నామన్నారు. జయ జయహే తెలంగాణ అన్న ప్రజాకవి అందేశ్రీ గేయానికి జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపు ఇచ్చామన్నారు.సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500కే గ్యాస్, సన్న దాన్యానికి రూ.500 బోనస్,కోటీ మంది ఆడబిడ్డలకు కోటీశ్వర్లును చేసే గొప్ప పథకాలన్నీ ఈ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు అని పేర్కొన్నారు. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు మేం ప్రాణం పోశాం, ప్రపంచ వేదికపై తెలంగాణ రైజింగ్ రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం, భారత దేశ గ్రోత్ ఇంజన్‌గా తెలంగాణను మార్చడానికి సర్వం సిద్ధం చేశామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. నిన్నటి వరకు ఒకలెక్క.. గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క అని సీఎం రేవంత్ వెల్లడించారు. నిన్న,నేడు,రేపు.. మీ ఆశీర్వాదమే నా ఆయుధం, మీ ప్రేమాభిమానాలే నాకు సర్వం, మీ సహకారమే నాకు సమస్తం. తెలంగాణ నాకు తోడుగా ఉన్నంత వరకు.. ఈగొంతులో ఊపిరి ఉన్నంత వరకు తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదన్నారు. ఈ సందర్భంగా అందరికీ ప్రజా పాలన రెండేళ్ల విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.2023 నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దాంతో పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ఫుల్ స్టాప్ పడింది. దీంతో అదే ఏడాది డిసెంబర్ 7వ తేదీన ఇఎంగా రేవంత్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది 7వ తేదీతో ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి అయింది. ఈనెల 8వ తేదీ(సోమవారం) నుంచి 2 రోజుల పాటు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనుంది. ఈ సందర్భంగా నిన్నటి వరకు ఒక లెక్క.. గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరోలెక్క అని సీఎం రేవంత్ తర ట్విటర్ ఖాతా ద్వారా వెల్లడించారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు అంతా రెడీ

>> ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలివస్తున్నారు.నేటి మధ్యాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్ ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. సమ్మిట్ లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియాటెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వంవైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. వచ్చిన అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధంచేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీ తో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, 3డి ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్ లో ఎల్‌ఈడీ స్క్రీన్స్ తో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డోల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజుల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్ లో పొందుపరుస్తారు. అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్ ను కూడా అతిథులకు అందించనున్నారు.



గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో ఆదివారం రాత్రి విద్యుద్దీపకాంతుల్లో వెలిగిపోతున్న సచివాలయం

# గ్లోబల్ సమ్మిట్‌కు ముస్తాబైన హైదరాబాద్

## త్రీడీ ప్రొజెక్టర్, ప్రత్యేక ఆకర్షణగా సచివాలయం


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్7:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌ను పురస్కరించుకుని హైదరాబాద్ సంప్రదాయ, సాంకేతిక హంగులతో ముస్తాబైంది. చార్మినార్, సచివాలయం వద్ద త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్, హుస్సేన్ సాగర్‌లో వాటర్ థీమ్ ఏర్పాటు చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వేదిక వరకు భారీ ఎల్‌ఈడీ తెరలు పెట్టారు. హైదరాబాద్ నలుమూలలా సమిట్ లోగోలతో 1,500 జెండాలు రెపరెపలాడనున్నాయి.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రభుత్వం హైదరాబాద్‌ను అందంగా ముస్తాబు చేసింది. బిఆర్ ఆంబేడ్కర్ తెలంగాణ సచివాలయం వద్ద త్రీడీ ప్రొజెక్టర్ మ్యాపింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రాష్ట్ర అభివృద్ధి,భవిష్యత్ లక్ష్యాలను ప్రదర్శించడానికి రూపొందించారు. ఓవైపు అత్యాధునిక టెక్నాలజీ హంగులు, మరోవైపు తెలంగాణ ప్రత్యేక ఆకర్షణల మేళవింపులతో ఏర్పాట్లు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రముఖ ప్రదేశాలు, చెరువులు,రహదారులు, సమిట్ వేదిక ఇలా అన్నిచోట్లా హైటెక్ ప్రొజెక్షన్లు, డిజిటల్ రూపంలో ప్రదర్శనలు, ఆధునిక విజువల్ ఎఫెక్టులతో ప్రత్యేకంగా పెట్టుబడుల పండగ వాతావరణం సృష్టిస్తున్నారు. చార్మినార్, కాచిగూడ రైల్వే స్టేషన్ భవనంపై ప్రత్యేక లైటింగ్ ప్రొజెక్షన్ ఏర్పాటు చేసి, నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చూపించనున్నారు. సచివాలయం వద్ద త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్‌తో రాష్ట్ర అభివృద్ధి తీరును, భవిష్యత్ లక్ష్యాలను ఆకర్షణీయంగా చూపించేలా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ రైజింగ్2047 లక్ష్యాలు అందరికీ అర్థమయ్యే రీతిలో డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు దుర్గం చెరువులో ప్రత్యేక ఆకర్షణగా గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రొజెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ లోగోను ఇన్‌లిట్ టెక్నిక్‌తో ప్రదర్శించారు. హుస్సేన్‌సాగర్‌లో వాటర్ ప్రొజెక్షన్ ద్వారా భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువత-రైతు ప్రధాన కార్యక్రమాలు, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం వంటి ముఖ్య అంశాలను ప్రదర్శించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమిట్ వేదిక వరకు వెళ్లే రోడ్డుపై భారీ డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఈ స్క్రీన్లపై భారత్ ఫ్యూచర్ సిటీకి ఎలా చేరుకోవాలి? ఎంత దూరం? వంటి వివరాలు పొందుపరిచారు. హైదరాబాద్‌లో 10 వేర్వేరు ప్రదేశాల్లో ప్రత్యేక సమాచార స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ సమ్మిట్‌కు సంబంధించిన వివరాలు, ఫ్యూచర్ సిటీ ప్రణాళిక, డిజిటల్ స్క్రీన్లపై విజువల్స్, సమ్మిట్ బ్రోచర్లు అందుబాటులో ఉంచారు. వాలంటీర్లు ప్రజలకు సమిట్ డైలీ షెడ్యూల్‌ను వివరించి అవగాహన కల్పించేలా ఏర్పాట్లు జరిగాయి. ఫ్యూచర్ సిటీలో డిజిటల్ తెరలతో నిర్మించిన టన్నెల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 50 మీటర్ల పొడవుతో త్రీడీ డిజైన్లతో ఇంటరాక్టివ్ డిస్‌ప్లే రూపంలో ముస్తాబైన సొరంగం గుండానే సమిట్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.రెండు రోజుల సదస్సులో వివిధఅంశాలపై 27ప్రత్యేక సెషన్లుజరగనున్నాయి. దేశ విదేశాల నుంచి ప్రముఖులు తరలిరానున్నారు. సదస్సులో తెలంగాణ భవిష్యత్ రూపకల్పనపై కీలక చర్చలు జరగనున్నాయి. ఈ నెల 9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్నారు. డాక్యుమెంట్ తయారీ తుదిదశకు చేరుకుందని తెలుస్తోంది.

## రేపు ఘనంగా విజయ్ దివస్
# జరుపుకోవాలి..
## బిఆర్ఎస్ నేతలతో కెటిఆర్ టెలికాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్7:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కీలక మలుపు తిరిగిన డిసెంబర్ 9వ తేదీని విజయ్ దివస్‌గా ఘనంగా నిర్వహించుకోవాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 9 చరిత్రలో నిలిచిపోయే రోజని, కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజని కేటీఆర్ గుర్తుచేశారు.

నవంబర్ 29న దీక్షా దివస్‌ను విజయవంతం చేసినట్లుగానే కేసీఆర్ 11 రోజుల దీక్ష ఫలించిన డిసెంబర్ 9ని విజయం సాధించిన రోజుగా 'విజయ్ దివస్' పేరుతో పండుగలా జరుపుకోవాలన్నారు. డిసెంబర్ 9న 60 సంవత్సరాల తెలంగాణ ఆకాంక్షకు.. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో ఒక రూపం వచ్చిందని కేటీఆర్ తెలిపారు. అంతటి ఘనమైన చారిత్రక ఘట్టాన్ని మరోసారి స్మరించుకుంటూ, ఆనాడు కేసీఆర్ తెలంగాణ కోసం చేసిన త్యాగాన్ని గుర్తుచేస్తూ, ప్రత్యేక రాష్ట్ర ప్రకటన సిద్ధించిన రోజును సంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అందరూ బిజీగా ఉన్నందున, గ్రామాల్లో కాకుండా కేవలం నియోజకవర్గ కేంద్రాల్లో మాత్రమే ఈ కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 9న చేపట్టాల్సిన కార్యక్రమాలను సూచించారు. నియోజకవర్గ కేంద్రాల్లోని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని చెప్పారు. పార్టీ కార్యాలయాల వద్ద లేకపోతే ప్రధాన కూడళ్లలో విజయానికి సూచికగా పింక్ బెలూన్లను గాలిలోకి ఎగురవేయాలన్నారు. కార్యక్రమం అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, కేసీఆర్ దీక్ష, తెలంగాణ పోరాటం, విద్యార్థుల త్యాగాలను ప్రజలకు, భవిష్యత్ తరాలకు గుర్తు చేయాలన్నారు. కేసీఆర్ దీక్ష ఫలవంతమైన నిమ్స్ ఆసుపత్రిలో, గాంధీ ఆసుపత్రిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. నగర నాయకత్వం ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మరో రెండు రోజులు సమయం ఉన్నందున జిల్లా అధ్యక్షులు చొరవ తీసుకొని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా సమన్వయం చేసుకోవాలని కేటీఆర్ సూచించారు.



# ఆఫ్రికన్ దేశం బెనిన్‌లో సైనిక తిరుగుబాటు!

**పోర్టోనోవో (బెనిన్), డిసెంబరు 7:** పశ్చిమాఫ్రికాలోని అనేక దేశాల్లో తిరుగుబాట్లు సర్వసాధారణం అయ్యాయి. ఇపుడు ఈజాబితాలో మరో ఆఫ్రికన్‌దేశం బెనిన్‌కూడాచేరింది. ఆదివారం దేశ సైనికుల బృందం అకస్మాత్తుగా అధికారిక టివిఛానెల్‌లోప్రత్యక్షం అయి ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మిలిటరీ కమిటీ ఫర్ రీఫౌండేషన్ అని ఆ సైనిక బృందం తమనుతాము చెప్పుకుంటూ దేశ అధ్యక్షుడిని, అన్ని రాజ్యాంగ సంస్థలను తొలగిస్తున్నట్లుప్రకటించింది. సైన్యం దేశానికి కొత్త అధిపతిగా లెఫ్టినెంట్ కల్నల్ పాస్కల్ టిగ్రిని నియమించింది. 1960లో ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి బెనిన్ అనేక తిరుగుబాట్లను చవిచూసింది. వాస్తవానికి ఈ దేశంలో 1991నుంచి రాజకీయ స్థిరత్వం నెలకొంది. అధ్యక్షుడు ప్యాట్రిన్ టాలోన్ 2016 నుంచి అదికారంలో ఉన్నారు. ఆయన వచ్చే ఏడాది ఏప్రిల్‌లోపదవీవిరమణచేస్తారు. ప్రస్తుతం ఆయన వారసుడు మాజీ ఆర్థికమంత్రి రొమువాల్డ్ వడాగ్ని ఎన్నికల్లో ముందంజలో ఉన్నారు. ప్రతిపక్ష అభ్యర్థి రెనాడ్ ఆగ్బోజో తగినంత మద్దతు లేకపోవడంతో ఎన్నికల సంఘం ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది. గతనెలలోనే పార్లమెంటు అధ్యక్షపదవీకాలాన్ని ఐదునుంచి ఏడు సంవత్సరాలకు పొడిగించింది. అయితే బెనిన్‌లో జరిగిన తాజా తిరుగు బాటురాజకీయాల్లో ఒక ప్రధాన మలుపు అని రాజకీయ విశ్లేషకుల అంచనా. గతవారం కూడా గినియా బిస్సావులో సైనిక అధికార మార్పిడి జరిగింది.

# మీర్‌చౌక్ ఎసిపిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

### విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** పాతబస్తీలోని మీర్‌చౌక్ ఎసిపి శ్యాంసుందర్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారని తెలిసింది. పాతబస్తీలోని నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన ఓ వివాహితకు ఆమె ఇంటి పక్కనే వున్న వారితో కార్ పార్కింగ్ విష యమై కొంతకాలంగా వివాదం వుంది. తన ఇంటిముందు కారును ఆపి, ఇబ్బందులకు గురిచేస్తున్న పొరుగింటి వారిపై సదరు మహిళ మీర్‌చౌక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని ఆమె ఏకంగా ఎసిపి శ్యాంసుందర్‌ను కలిసి న్యాయం చేయాలని వేడుకుంది. అయితే ఈ విషయమై ఎసిపితో పాటు బాధిత మహిళ మధ్య ఏం జరిగిందనేది తెలియరాలేదు. బాధిత మహిళ మాత్రం ఎసిపి శ్యాంసుందర్ తనపట్ల అనుచితంగా ప్రవర్తించాడని, సెల్‌ఫోన్‌లో అసభ్యకరంగా మెసేజ్‌లు పంపాడని, ఒంటరిగా రమ్మని వీడియో కాల్ చేశాడని దక్షిణ మండల డిసిపి కిర ణ్ కారే సహా ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బాధిత మహిళకు ఎసిపికి మధ్య జరిగి న వివాదం అటుంచితే ఆ మహిళకు ఎసిపి శ్యాంసుందర్ నిజంగానే సెల్‌ఫోన్లో అసభ్యకరంగా మెసేజ్‌లు పంపినా, అను చితంగా మాట్లాడుతూ వీడియో కాల్ చేసినట్లు ఆధారాలు వుంటే ఆయనపై చర్య లు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనిపై ఒకటి,రెండు రోజుల్లో నిర్ణయం వెలువడే వీలుంది. మరోవైపు ఎసిపి శ్యాంసుందర్ మాత్రం తాను అమాయ కుడినని, తనపై ఆ మహిళ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఖండించారు.



### తెలంగాణ దశదిశను మార్చనున్న

# గ్లోబల్ సమ్మిట్

### ప్రపంచ ఉన్నత నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ

### గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌తో తెలంగాణ రాష్ట్రం దశ దిశ మారుతుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీర్‌ఖాన్‌పేట్‌లో జరుగుతున్న సమ్మిట్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రపంచ స్థాయి సమ్మేళనంతో ప్రపంచ నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ చేరుతుందని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్ల పాలన, 2047 లక్ష్యంగా సాగుతున్న ప్రణాళికలు తది తరాలకు ఊతమిచ్చేలా పెట్టుబడులు రానున్నాయని అన్నారు ఇప్పటికే దేశ విదే శాలకు చెందిన 150 మంది అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్‌లో పాల్గొన బోతున్నారని చెప్పారు రెండు రోజులపాటు జరిగే ఈ సమ్మేళనం కోసం విశేష రీతిలో ఏర్పాట్లు జరిగాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు

# పొగమంచుతో డివైడర్ ఢీకొని ఇద్దరు మృతి

### మరో ఇద్దరికి తీవ్రగాయాలు

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఆదివారం స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుకునేందుకు కారులో బయలుదేరిన నలుగురు యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలకు గురయ్యారు. లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటన ఎస్సై యుగేందర్ కథనం ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన శ్రీపతి వెంకటరెడ్డి కుమారుడు అశ్రిత్‌రెడ్డి (22), చెంగిచెర్లకు చెందిన సురేష్ కుమారుడు బాలాజీ మణికంఠ శివసాయిపటేల్ (22), శ్రీకాంత్, రాహుల్ స్నేహితులు. వీరు నలుగురు కలిసి కారులో మల్కాజ్‌గిరి నుంచి ఉప్పల్ వైపు క్రికెట్ ఆడేందుకు క్రికెట్ కిట్లతో కలిసి తెల్లవారుజామున ఐదున్నరప్రాంతంలో వెళుతున్నారు. ఈ క్రమంలో లాలాపేట్ మౌలాలి ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే పొగ మంచు కారణంగా కారు నడుపుతున్న యువకుడికి ఏమి కనిపించలేదు. దీంతో వేగంగా ఉన్న కారుతో డివైడర్‌ను వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా తీవ్ర గాయాలకు గురైన అశ్రిత్‌రెడ్డి, శివసాయిపటేల్ ఘటనాస్థలంలోనే మృతి చెందారు. వెనుక వైపు కూర్చున్న శ్రీకాంత్, రాహుల్‌కు తీవ్రగాయా లయ్యాయి. దీంతో స్థానికులతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన ఇద్దరిని గాంధీ ఆసుపత్రికి తరలించగా గాయాలకు గురైన శ్రీకాంత్, రాహుల్‌ను ఇతర హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




అశ్రిత్‌రెడ్డి(ఫైల్), శివసాయిపటేల్ (ఫైల్)

# ఇచ్చిన హామీలపై చర్చకు సిద్ధమా?

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్

### రైజింగ్ తెలంగాణ కాదు.. సింకింగ్ తెలంగాణ: ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), డిసెంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా వంచిస్తున్న కాంగ్రెస్‌ను గద్దె దింపేవరకు బిజెపి పోరాటం ఆగదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ప్రజావంచన పాలనను నిరసిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిధులుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డికె అరుణ, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహే శ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, ఎంఎల్‌సిలు సి.అంజిరెడ్డి, మల్కా కొమరయ్య, కర్ణాటక ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ధర్నానుద్దేసించి రామచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం తెలంగాణ భూములను వేలంవేసే పాలసీతో ముందుకు సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లఘుచర్ల వంటి ప్రాంతాల్లో ఫార్మాసిటీ పేరిట రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ కేవలం మత రాజకీయాలు చేస్తోందని, హిందూ దేవీదేవతలను పదే పదే అవమానిస్తూ, కోట్లాది హిందూ మనోభావాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ తన పదేండ్ల పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చిందని, బీఆర్ఎస్ పట్ల విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే, గులాబీ జెండా పోయి కాంగ్రెస్ జెండా వచ్చింది తప్ప దోపిడీలో, అవినీతిలో చివరకు పార్టీ ఫిరాయింపులలో కూడా ఏ విధమైన మార్పు రాలేదని విమర్శించారు. అనేక హామీలతో, అభయహస్తాలతో, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఏ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. పోలీసులను పెట్టుకుని, గ్రామాల్లో సభలు పెట్టుకుని తిరగటం కాదని, ఇచ్చిన హామీల అమలు మీద చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎంపి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు కొత్తగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ అంటూ గ్లోబల్ సమ్మిట్ అనే కొత్త నాటకం మొదలు పెట్టారని విమర్శించారు. ఇది రైజింగ్ తెలంగాణ కాదని, మాఫియాల చేతిలో చిక్కుకున్న సింకింగ్ తెలంగాణ అని ధ్వజమెత్తారు. డికె అరుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధిని చూసి సర్పంచులను గెలిపియ్యమంటున్నారు కానీ, గ్రామాల్లో అభివృద్ధి కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతోందని స్పష్టం చేశారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేక రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో వచ్చేది బీజేపీ పాలనేనని ధీమా వ్యక్తం చేశారు.



ఆదివారం ధర్నా కార్యక్రమంలో రెండేళ్ల ప్రజావంచన పాలనలో కాంగ్రెస్ వైఫల్యాల చిట్టాను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపి లక్ష్మణ్ తదితరులు

# గ్లోబల్ సమ్మిట్‌కు అసాధారణ భద్రత

### విదేశీ ప్రముఖులు వస్తుండడంతో రంగంలోకి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు

### వెయ్యికిపైగా సిసి కెమెరాల ఏర్పాటు.. అడుగడుగునా పోలీసుల మోహరింపు

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** నగర శివార్లలోని కందుకూర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు పోలీసు శాఖ అసాధారణ భద్రతను ఏర్పాటు చేసింది. విదేశీ ప్రముఖులతో పాటు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు వస్తున్న వేళ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వుండేందుకు గ్రే హౌండ్స్‌తో పాటు ఆక్టోపస్ బలగాలను రంగంలో దించా రు. గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో వెయ్యికి పైగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయగా అడుగడుగునా సాయుధ పోలీసులను పహారాగా మొహరించారు. రాష్ట్ర సర్కారు కొత్తగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ గ్లోబల్ సమ్మిట్‌కు పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ అంతర్జాతీయ వేడుక కోసం పోలీసు శాఖ నెల రోజుల నుంచి భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తుండడం తె లిసిందే. రాచకొండ కొత్వాల్ సుధీర్ బాబుతో పాటు ఇతర పౌర విభాగాల ఉన్నతాధికారులు అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండడం విది తమే. బందోబస్తు ఏర్పాట్లతో పాటు మౌలిక వసతుల ఏర్పాట్లను సిఎం రేవంత్ రెడ్డి సహా ఇతర మంత్రులు దగ్గరుండి పర్యవేక్షించడంతో పౌర, పో లీసు ఉన్నతాధికారులు కూడా వారివెంట వున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలతో పాటు పెట్టుబడిదారుల నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ వేదిక ఉపయోగించుకోవాలని భావిస్తున్న తరుణంలో సోమవారం నాటి మొదటి రోజు సదస్సులో అనేక మంది ప్రముఖులు పాల్గొననున్నారు. మధ్యా హ్నం ఒంటి గంటకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దీనిని ప్రారంభించనుండగా సిఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల సిఎంలు, ప్రముఖులు హాజరు కానున్నారు. సమ్మిట్‌లో పాల్గొనాలని ఆయా రంగాలకు చెందిన ప్రముఖులను ప్రభుత్వం ఆహ్వానించడంతో వారంతా సోమవారం రానున్నారని తెలిసింది. వందల సంఖ్యలో ప్రముఖులు, వేల సంఖ్యలో ఇతరులు రానుండడ ంతో బందోబస్తులో ఎక్కడా తేడా రాకుండా పోలీసు శాఖ జాగ్రత్తలు చేబట్టింది. మొత్తం మూడు వేల మంది వరకు పోలీసులను మొహరించగా వెయ్యి మంది వరకు ట్రాఫిక్ నియంత్రణను వినియోగించనున్నారు. హైదరా బాద్ నుంచి కందుకూరు మార్గంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్ష లు విధించారు. గ్లోబల్ సమ్మిట్ సవ్యంగా సాగేందుకు గ్రేహౌండ్స్‌తో పాటు ఆక్టోపస్ బలగాలను రంగంలో దించారు. ఈ సమ్మిట్‌కు దేశ, విదేశీ ప్రముఖులు అనేక మంది రానుండడంతో వారి కోసం అడుగడుగునా పోలీసులను మొహరించారు. వీరంతా శంషాబాద్ విమానాశ్రయం నుంచి రానుండడంతో విమానాశ్ర యంతోపాటు అక్కడి నుంచి కందుకూరు వరకు గల రోడ్డు మార్గంలో పోలీసు బందోబస్తును మరింత పెంచారు. ఈ సమి ్మట్‌కు ఆటంకం కలిగించేందుకు కొందరు కుట్ర పన్నుతున్నట్లు అందిన సమాచారంపై పోలీసు శాఖ అప్రమత్తమయ్యింది. దేశ, విదేశీ ప్రముఖులు రాకపోకలు సాగించే ప్రాంతాలతో పాటు వారి విడిదిచేసే ప్రాంతాలలో అదనను భద్రత కల్పించారు. పోలీసు శాఖ తరపున డిజిపి శివధర్ రెడ్డి స హా ఇతర ఉన్నతాధికారులందరు సోమవారం ఉదయం నుంచి ఫ్యూచర్ సిటీకి తరలిరానున్నారు. సాయంత్రం పొద్దుపోయే వరకు సమ్మిట్ జరగనుం డడంతో అప్పటి వరకు వారంతా అక్కడే వుండనున్నారు. మంగళవారం నాటి సమ్మిట్‌లోనూ ప్రముఖులు పాల్గొన నుండడంతో అప్పటి వరకు బందోబస్తును కొనసాగించనున్నారు. సమ్మిట్ జరగనున్న ప్రాంగణమంతా ఇప్పటికే పోలీసు జాగిలాలచే క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఫైర్ సర్వీస్, వాటర్ వర్క్స్ విభాగాలు ఇప్పటికే అక్కడ మొహరించాయి.



# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోతున్నా..

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025కు హాజరు కాలేకపోతున్నట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పార్లమెంటు సమావేశాలు, ముందస్తుగా షెడ్యూల్ చేయబడిన కార్యక్రమాల నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025 కు హాజరు కాలేకపోతున్నట్లు లేఖలో తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# దక్షిణాదిలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రం

### పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు

### ఆసియా బౌద్ధ దేశాల రాయబారులతో సమావేశం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** దక్షి ణ భారతదేశంలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో బౌద్ధం పరిఢవిల్లిందని తెలంగాణకు ఇంతటి చారిత్రక నేపథ్యం ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆసియా బౌద్ధ దేశాల రాయబారులతో తెలంగాణ పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం సమావేశమయ్యారు. తెలంగాణ బౌద్ధ వారసత్వం, అంతర్జాతీయ పర్యాటక-సాంస్కృతిక భాగస్వామ్యాలపై చర్చించారు. దక్షి ణ భారతదేశంలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఉందని, గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో బౌద్ధం పరిఢవిల్లిందని తెలంగాణకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని మంత్రి వివరించారు. నాగార్జునకొండ, ఫణిగిరి, ధూలికట్ట, నెలకొండపల్లి, కోటిలింగాల వంటి బౌద్ధ కేంద్రాల ప్రాముఖ్యతను రాయబారులకు వివరించారు. నాగార్జునసాగర్‌లో నిర్మాణం జరుగుతున్న బుద్ధవనం బౌద్ధ హెరిటేజ్ థీమ్ పార్క్‌ను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలియజేశారు. బుద్ధుడి జీవిత చరిత్ర, బోధనలు వంటి సమస్త సమాచారంతో కూడిన బుద్ధవనం ప్రపంచ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా భాసిల్లుతుందన్నారు. సర్వజన సంక్షేమం, ప్రేమ, శాంతి, సహజీవనంలతో కూడిన ప్రగతి దిశగా గౌతమ బుద్ధుడి మార్గంలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు బౌద్ధ ధర్మాన్ని పరిచయం చేసే జీవశిల్పంగా నిలిచిపోతుందన్నారు. రాష్ట్రం లోని బౌద్ధ వారసత్వ కేంద్రాల పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వ చేస్తు_న్న కృషిని వారు అభినందిస్తూ, భవిష్యత్‌లో సాంస్కృతిక, పర్యాటక, పెట్టు బడి రంగాలలో సహకారానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. నేటి (సోమ వారం) నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ రైజింగ్ - 2047 గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని మంత్రి జూపల్లి కృష్ణారావు రాయబారులను ఆహ్వానించారు.

# రైతుల ఖాతాల్లో ధాన్యం విక్రయాల డబ్బు జమకు ఆలస్యం

### రూ.12,269 కోట్ల విలువగల ధాన్యం కొనుగోలు

### రైతుల ఖాతాల్లో జమైనది రూ. 9,845 కోట్లు

### ఒపిఎంఎస్ అయినా మిల్లు జనరేట్ కాక ఇబ్బందులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:** పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారుల అసమర్థతతో రాష్ట్రంలో రైతులు ధాన్యం విక్రయించినా డబ్బులు వారి ఖాతాల్లో జమకావడంలేదు. మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటి తీసుకోవడంలో విఫలం కావడంతో ధాన్యం కేటాయింపులు కొద్ది సంఖ్యలో మిల్లులకు భారీగా కేటాయిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8410 కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు 52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి రాగా రూ. 12,269 కోట్ల విలువగలిగిన 47లక్షల మె.ట ధాన్యం ఇప్పటికి కొనుగోలు చేశారు. ఇందులో 24లక్షలమె.ట దొడ్డురకం ధాన్యం 23లక్షల మె ట సన్నధాన్యం ఉంది. కొనుగోలు చేసిన ధాన్యంకు ఇప్పటి వరకు ఎంఎస్‌పి కింద 9845కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రైతుల ఖాతాల్లో రూ.2424కోట్ల రూపాయలు గత వారం రోజులుగా జమకావడంలేదు. మరోవైపు కొనుగోలు కేంద్రాలకు వికయానికి వచ్చిన ఆరులక్షల మె.ట ధాన్యం కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తుండటంతో రైతులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అయినా మిల్లు జనరేట్ కాకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యం మిల్లుకు పంపడమే సవాల్‌గా మారింది. తెలంగాణలో మూడు వేలకు పైగా రైసుమిల్లులు ఉన్నాయి అందులో దాదాపు వెయ్యి వరకు సిఎంఆర్ ఇవ్వని బకాయిదారులు ఉన్నారు.వారికి ధాన్యం కేటాయించడంలేదు. మరోవైపు బ్యాంకు గ్యారెంటీలు తీసుకోవడంలో కూడా అధికారులు విఫలం కావడంతో ధాన్యం సేకరణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కరీంనగర్ జిల్లాలో 127 మిల్లులు ఉంటే అందులో 54 మిల్లులు డిఫాల్టర్ మిల్లు ఉన్నాయి 73 మిల్లులలో కేవలం పదిశాతం మిల్లులు మాత్రమే బ్యాంకు గ్యారెంటీ ఇచ్చినట్లు రైస్‌మిల్లర్లు చర్చించుకొంటున్నారు. వనపర్తి జిల్లాలో 53 మిల్లులు మాత్రమే అరకొర బ్యాంకు గ్యారెంటీలు చెల్లించినప్పటికి ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. ఆ జిల్లాలో 21 మిల్లులకు ధాన్యం కేటాయించకూడదని రాష్ట్ర స్థాయి అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. వనపర్తిలో బ్యాంకు గ్యారెంటీ కింద 10శాతం చొప్పున 47 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం 16కోట్లు మాత్రమే చెల్లించారు. రాష్ట్రంలో నల్లగొండ సూర్యపేట, పెద్దపల్లి, జగిత్యాల, నిర్మల్, మంచిర్యాల వరంగల్ అనేక మహబూబాబాద్ జిల్లాలో అనేక రైస్‌మిల్లులు ధాన్యం కేటాయింపులో 10శాతం బ్యాంకు గ్యారెంటీలు చెల్లించడానికి నిరాకరిస్తున్నారు. రబీసీజన్ ఆరంభం కావడంతో రైతులు ధాన్యం విక్రయాలకు సెంటర్లలో తీవ్రంగా ఇబ్బందులు పడితే మరోవైపు, మిల్లుపాయింట్‌కు ధాన్యం చేరినా ఎంఎస్‌పి రాక రైతులు అనిశ్చితికి గురవుతున్నారు. ఇప్పటి వరకు సన్నాలకు 412 కోట్ల రూపాయలు బోనస్ చెల్లించామని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతుంటే రైతులు మాత్రం గత యాసంగి బోనస్, ఇప్పటి ఖరీఫ్‌సీజన్ బోనస్ ఇంకా రాలేదని ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రీజియన్‌లో కేవలం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ ఖమ్మం (ఎన్ఎస్‌పిఆయకట్టు) ఆదిలాబాద్ జిల్లాలో లక్షట్‌పేట్ జన్నారం ప్రాం తానికి పరిమితైన వరిధాన్యం పంట తొండలు కూడా గుడ్లు పెట్టడానికి సహసం చేయని మెట్టప్రాంతాల్లో దుర్భిక్ష ప్రాంతాల్లో విస్తరించడంతో ధాన్యం దిగుబడి పెరిగింది.




# మా పెళ్లి రద్దు చేసుకున్నాం!

### స్మృతిమంధాన, పలాశ్‌మచ్చల్ ఇన్‌స్టాలో వెల్లడి

ముంబయి, డిసెంబరు 7: భారత స్టార్ మహిళాక్రికెటర్ స్మృతి మంధాన వివాహం రద్దయింది. ఆమే ఈ సమాచారం స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌స్టోరీలోప్రకటించారు. వివాహ సందర్భంగా జరిగిన ముందస్తు వేడుకల్లో స్మృతి తండి అస్వస్థతకు గురికావడం ఆపై రకరకాల పుకార్లు వ్యాపించడంతో పెళ్లిని తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లుప్రకటించారు. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్‌ముచ్చల్‌తో నవంబరు 23న జరగాల్సి న పెళ్లి అనుకోని కారణాలవల్ల వాయిదాపడింది. అయితే పెళ్లిపూర్తిగా రద్దయిందని తాజాగా ఆదివారం ఆమె తెలిపారు. మరోవైపు ఆమెను వివాహమాడాల్సి న పలాశ్ మచ్చల్‌కూడా తన పెళ్లిరద్దుగురించి ఇన్‌స్టా స్టోరీలో వెల్లడించారు. గత కొన్ని వారాలుగా నా జీవితంచుట్టూ చాలా ఊహాగానాలుసాగాయని, ఇలాంటి సమయంలో మాట్లాడటం ఎంతో అవసరమని, నాగురించి అన్న గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తినని కానీ వివాహం రద్దయిందని స్పష్టంచేయాలనుకుంటున్నట్లు ఆమె తెలిపారరు. రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి ముందుకు సాగేందుకు స్పేస్ ఇవ్వాలని అభ్యర్థించారు. దేశాన్ని అత్యున్నతస్థాయిలో ఉంచేందుకు ముందుకు సాగుతానన్నారు. భారత్ తరపున మరిన్ని మ్యాచ్‌లు ఆడిట్రోఫీలు గెలుస్తానని తనకు మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలని స్మృతి తన ఇన్‌స్టా స్టోరీలో చెప్పారు. అలాగే పలాశ్‌కూడా తన జీవితంలో ముందుకువెళ్లాలని నిశ్చయించుకున్నానని, వ్యక్తిగత సంబంధంనుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆధారాలేన్ని వదంతులు సులువుగా నమ్మేవాళ్లనిచూసి తట్టుకోవడంకష్టంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. నాప్రతిష్టకు భంగం కలిగించే తప్పుడు సమాచారం వ్యాప్తిచేసినవారిపై మా లీగల్‌టీమ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్టసమయంలో నాపక్షాన నిలిచినవారికి ధన్యవాదాలని పలాశ్ తన స్టోరీలో చెప్పుకొచ్చారు.

# ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయులకు షాక్!

### గంట ఆలస్యమైతే ఆబ్సెంట్ ఎందుకయ్యారంటూ మెసేజ్!

### ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా మెసేజ్ పంచాలని భావిస్తున్న అధికారులు

### ఇప్పటికే ఎపిలో అమలులో ఉన్న విధానం

### తెలంగాణలోనూ అమలుకు పాఠశాల విద్యాశాఖ యోచన

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఆలస్యంగా వచ్చే వారికి పాఠశాల విద్య శాఖ అధికారులు షాక్ ఇవ్వనున్నారు. గంట ఆలస్యమైతే ఉపాధ్యాయులకి మెసేజ్ వెళ్లనుంది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల అధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలల్లో విద్యార్థులతో పాటు, సిబ్బంది హాజరు కోసం ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎఫ్ఆర్ఎస్ అమలు మూలంగా పాఠశాలలకు రెగ్యులర్‌గా హాజరుకాని విద్యార్థుల పేరెంట్స్‌కి, వారంలో ఎక్కువ రోజులు హాజరు కాని విద్యార్థుల తల్లిదం డ్రులకు తమ పిల్లవాడు పాఠశాలకు హాజరు కాలేదని తెలుపుతూ మెసేజ్‌లను పంపిస్తున్నారు. తాము రెగ్యులర్‌గా స్కూల్ రాకపోతే తల్లిదండ్రులకు మెసేజ్‌లు వెళుతుండటంతో విద్యా ర్థులు క్రమం తప్పకుండా పాఠశాలకి వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పాఠశాలల్లో ఎఫ్‌ఆర్ ఎస్‌ను అమలు చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఇటు విద్యార్థులతో పాటు.. అటు ఉపాధ్యా యుల హాజరు కూడా గణనీయంగా పెరిగింది. విద్యార్థుల హాజరు 70 నుంచి 75 శాతం వరకు ఉంటుండగా.. టీచర్ల అటెండెన్స్ సుమారు 80 నుంచి 85 శాతం వరకు ఉంటుంది. విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోతే వారి తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపిస్తున్నట్టుగానే.. పాఠశాలకు అనుమతి లేకుండా హాజరుకానీ ఉపాధ్యాయులకు కూడా మెసేజ్‌లు పంపించాలనే యోచనలో పాఠశాల విద్య శాఖ అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు పాఠశాలు ప్రారంభమైన తరువాత గంట లోపుగా ఉపాధ్యాయుల హాజరు లేకపోతే.. వెంటనే ఆయా ఉపాధ్యాయులకి సంబంధిత పాఠశాల హెడ్మాష్టర్(హెచ్‌ఎం) ద్వారా గానీ లేకపోతే మండల విద్యాధికారి(ఎంఈవో)గానీ ఎందుకు పాఠశాలకు హాజరుకాలేదని పేర్కొంటూ మెసేజ్ చేయాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. తద్వారా ఆ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు పాఠశాలకు రాకపోవడానకి కారణం సెలవు తీసుకున్నారా? లేకపోతే ఆలస్యంగా వస్తామని అనుమతి తీసుకున్నారా? అదికాకపోతే ఇంకేదైనా కారణం ఉందా? అనేది ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు తనకు వచ్చిన మెసేజ్‌కు ఇచ్చే సమాధానం ఆధారంగా ఉన్నతాధికారులు తెలుసుకునే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు సెలవు తీసుకోకుండా, అనుమతి లేకుండా పాఠశాలకు హాజరుకాకుండా ఉండే పరిస్థితులు ఉంటున్న నేపథ్యంలో పాఠశాల విద్య శాఖ ఉన్నతాధికారులు ఇటువంటి నిర్ణయం తీసుకోన్నుట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 26,417 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా.. వాటిలో సుమారు 1.08 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

వార్త

మీరు నిజాయితీగా ఉండండి. ఈ ప్రపంచంలోని జనాభా నుంచి ఒక దుర్మార్గుడి సంఖ్య తగ్గిందన్న భావన మీకు కలుగుతుంది.

-థామస్ కార్లయిల్

# పొగాకుకు కళ్లెం

సామాజిక రుగ్మతలను రూపుమాపడానికైనా, భయంకరమైన అనారోగ్యకర అలవాట్లను అదుపులో పెట్టేందుకైనా పన్నులు భారమో, జరిమానాల విధింపులతోనో కళ్లెం వేయడం సాధ్యమౌతుందని నమ్ముతుంటాం. ఎటూ కక్కలేక మింగలేక అలవాట్లకు దూరంగా ఉంటారని భావిస్తుంటాము. నిన్న మొన్నటి వరకు ఒక పక్క పొగాకు త్రాగడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదంటూనే, పొగాకును విరివిగా పండించే ప్రాంతాల్లోని రైతుల ఉత్పత్తుల రవాణాకు అన్ని సౌకర్యాలను సమకూర్చిపెట్టడం ప్రభుత్వాలకు ఆనవాయితీగా మారింది. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో దేశంలో కేన్సర్,గుండె, ఊపిరితిత్తుల రోగాల కారణంగా ఏటా 1.35 మిలియన్ మంది మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పొగాకు పండించే రైతులను ప్రత్యేకించి నిరుత్సాహపరచకుండా, అలాఅని ప్రత్యేక ప్రోత్సాహకాలు లేకుండా రైతులు వారంతటవారే ఇతర పంటలకు మారేపరిస్థితి తీసుకురావాలన్నది ప్రభుత్వఆలోచన. ఇలా పొగాకు సాగులో ప్రభుత్వాలు ఎటూ పాలుపోని పరిస్థితులలో సతమతమౌతుంటాయి. ఆ నేపథ్యమే 2018 నుంచి 2022 మధ్య 112లక్షల ఎకరాలకుపైగాభూమిలో పొగాకు సాగు నుండి రైతులు ఇతర పంటలకు మారేలా చేసింది. అందులో భాగంగానే కర్ర విరగకుండా, పాము చావకుండా అన్న ధోరణిలో ప్రభుత్వం పన్ను విధానాల రూపకల్పన చేస్తూ వస్తోంది. కారణాలు ఏవైనా ప్రభుత్వ సంకల్పం మేరకు ప్రజల అనారోగ్యానికి హేతువయ్యే పొగాకు ఉత్పత్తులు పెరగకుండా చూడగలుగుతోంది. దేశంలో పొగాకుపై 60 లక్షల మంది రైతులు రెండు కోట్ల మంది కూలీలు ఆధారపడుతుంటారు. కానీ తాజాగా కేంద్రప్రభుత్వం పొగాకు సంబంధిత ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకం విధిస్తూ సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2020-25ను మూజువాణి ఓటుతో లోక్‌సభలో ఆమోదించింది. సిగరెట్లు, చుట్టలు,హుక్కా, జర్దా నమిలే పొగాకుపై ప్రస్తుతమున్న జిఎస్టీ 28 శాతంతో పాటు పలు విధాలైన సెస్సు ఉంది. ముడి పొగాకుపై 60-70 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధించేందుకు రంగం సిద్ధమైంది. ఈ సెస్సు సిగరెట్లు, చుట్టలపై 25 శాతం వరకు ఉంటుంది. కాదంటే ప్రతి వెయ్యి చుట్టలకు రూ. 5వేలు చొప్పున డ్యూటీ చెల్లించాలి. ఫిల్టర్ సిగరెట్లకు ప్రతి వెయ్యికి రూ.2700 నుంచి 11వేల వరకు సుంకం విధించమన్నారు. నమిలే పొగాకుకు మాత్రం కిలోకి 100 రూపాయలుగా నిర్ణయించారు. పరిహార సెస్సుకు ఈ పెంచిన సుంకాలకూ ముడిపెట్టారు.పరిహార సెస్సు పూర్తయ్యాకనే కొత్త సెస్సు మొదలవుతుంది. కోవిడ్ సమయంలో తగ్గిపోయిన ఆదాయ భర్తీకి రాష్ట్రాలు తీసుకున్న రుణాలు తీరిపోయాక పరిహార సెస్సుకు బదులుగా కొత్త విధానంలో సెస్సు వసూలు తప్పదు.తమకు వచ్చే ఆదాయంలో 41 శాతాన్ని రాష్ట్రాలతో పంచుకుంటామని లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇచ్చిన వివరణ ఇది. గరిష్టంగా 40 శాతం చొప్పున జిఎస్టీ విధానం కొనసాగుతుంది. పొగాకు మీద హెచ్చుపన్నుల ద్వారా పొగాకు వాడకం తగ్గించగలిగితే ఒక విధంగా మంచిదే. పరిహార సెస్సు కాలపరిమితి పూర్తయినందున కొత్త సెస్సులు వడ్డించారా? లేదా పొగాకు ఉత్పత్తుల వినియోగం తగ్గించడం ద్వారా జనానికి ఆరోగ్యకర అలవాట్లు వస్తాయని పొగ తాగకుండా చూడాలన్న దృక్పథంతోనే మరో రూపంలో ఈ సెస్సును భర్తీ చేశారన్నది సుస్పష్టం. ఏదిఏమైనా పొగాకు విరివిగా పండించే ప్రాంతాల్లోని లోక్‌సభ సభ్యులు పన్నుల్లో మార్పులు చేసేటప్పుడు రైతుల ప్రయోజనాలనూ దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. అదే సమయంలో ప్రజారోగ్యం కోసం తీసుకునే నిర్ణయాలను రైతులు సుముఖత వ్యక్తం చేశారని భరోసా ఇవ్వడం విశేషం. పొగాకు సాగును పూర్తిగా రద్దు చేయలేని పరిస్థితుల్లో తగ్గించడానికే ప్రభుత్వాలు కృషి చేస్తుంటాయి. తాజాగా వేసిన సుంకంకూడా ఆ కోవలోకే వస్తుంది. దాంతో ఇక ఆ పన్ను వసూలు చేయాల్సిన ఆవశ్యకత కేంద్రానికి లేకపోయింది.అలా అని ఆ పన్ను వసూలు ఆపేస్తే పొగాకు ఉత్పత్తుల ధరలు బాగా తగ్గిపోతాయి. ఇలాంటి పరిస్థితులు సదరు పన్ను తగ్గితే పొగాకు ఉత్పత్తుల అధిక వినియోగానికి దారి తీస్తుంది. ఒకపక్క పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరం అంటూనే ఆ ఉత్పత్తులకు ధర తగ్గే పరిస్థితి కల్పిస్తే వినియోగదారుల సంఖ్య పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలోనే తగ్గిన సుంకాన్ని మరో రూపంలో పెంచేందుకు కేంద్రం ఉపక్రమించింది. ఇది సెస్సు కాదని, కేవలం ఎక్సైజ్ సుంకమేనని అది కూడా పొగాకు ఉత్పత్తుల ధరల పెంపు వలన వినియోగం ఎప్పటిలానే ఉంటుందని ఆర్థిక మంత్రి అభిప్రాయం. అందుకే ఈ ప్రతిపాదన జరిగింది. ఒకపక్క పొగాకు రైతుకు ప్రోత్సాహం మరోపక్క వినియోగదారుని ఆరోగ్యరక్షణ వీటి విషయంలో సమతుల్యత పాటించడానికే ఈ పన్ను విధానం నిర్ణయింపబడింది.కొత్తగా వేసిన పన్ను బీడీల ధరను పెంచుతుంది. దానివలన వినియోగం తగ్గి పరోక్షంగా దేశంలోని లక్షలాది మంది బీడీ కార్మికులు ఉపాధి కోల్పోతారని ఎంపీలు ఆవేదన వెలిబుచ్చారు. జాతీయ వ్యవసాయ అభివృద్ధి పథకం కింద పంట వైవిధ్యీకరణ కార్యక్రమం కింద 2015 నుండి దేశంలోని పది రాష్ట్రాలు పొగాకు పండించి ఉత్పత్తి చేస్తున్నాయి. పాన్ మసాలా తయారీ యూనిట్‌లపై కూడా సెస్ విధించారు. ఈ విధంగా వసూలు అయ్యే మొత్తం జాతీయ భద్రత కోసమే వినియోగించేందుకు నిర్ణయం.

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



సిసి కోల్టన్

ఇతరులకు సంతోషాన్ని కలిగించకుండా సంతోషాన్ని పొందే అధికారం, ధనాన్ని ఉత్పత్తి చేయకుండా ధనాన్ని వాడుకునే అధికారం మనకు లేదు.



జార్జిబెర్నార్డ్ షా

# ప్రజావాక్కు



## పదో తరగతి పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు మార్చి 16నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేశారు. ఆ ప్రాప్తి మేరకు ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పదో తరగతి విద్యార్థులకు, ప్రణాళిక బద్ధంగా పాఠాలు చెప్పడంపరీక్షలు నిర్వహించడం జరపనున్నారు. పాఠశాల పని దినాల్లో పదవ తరగతి టైం టేబుల్ ఈ 100 రోజులు ప్రణాళికల్లో కంప్లీట్‌గా మార్చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గంటా 50 నిమిషాలు ఒక సబ్జెక్టు చొప్పున నాలుగు సబ్జెక్టులు ఒక రోజులో జరుగుతాయి. మిగతా మూడు సబ్జెక్టులు ఆ రోజులో ఉండవు. అన్ని సబ్జెక్టులు ప్రతిరోజు ప్రతి విద్యార్థి చదవడం జరగడం లేదు. మిగతా తరగతులు అయిన 6 నుండి 9వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు టైం టేబుల్ అస్తవ్యస్తం అవుతుంది.

- వీరగంట భాస్కర్ రావు, విజయవాడ

## మరీ ఇంత దిగజారిపోవాలా!

రోడ్డు మీదపోతున్న వ్యక్తి ఒకడు ఆహారం కోసం చెత్తకుప్పదగ్గరకు వెళ్తున్న కుక్కను చూసి జాలిపడతాడు దాని ముందు ఓ రొట్టె ముక్కను పడేస్తాడు. మరుక్షణం ఎక్కడి నుంచో మూడు నాలుగు కుక్కలు పరిగెత్తుకువసాయి. ఆ రొట్టె ముక్క కోసం ఎగబడతాయి. దాని కోసం నోటి వాటి మధ్యకొట్లాట మొదలవుతుంది. చివరకి వాటిలో ఉన్న ఒక బలమైన కుక్క ఆ రొట్టె ముక్కను నోట కరుచుకుని పోతుంది. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలసందర్భంలో మూడుపార్టీల వారుఇలానే ప్రవర్తించారు. ఉన్న ఒక్క సీటుకోసం విశ్వప్రయత్నం చేశారు.

- రాశి, హైదరాబాద్

## ఓటు చాలా విలువైనది

బిఆర్ఎస్ కారు రెండు సంవత్సరాల నుంచి బయటకి రాక మూలనపడి ఉంది. దాని భాగాలన్నీ తుప్పుపట్టిపోయాయి. ఆ కారు ఇప్పట్లో ఇక ముందుకు కదలదు. అలాంటి కారుకి ఓటు వేస్తే అభివృద్ధి ముందుకి కదలదు. వేసిన ఓటు వేస్ట్ అయిపోతుంది. కనుక ఓటు వేసేటప్పుడు ఆలోచించి వేయాలి.

-మిథునం, హైదరాబాద్

## క్వాంటి టెక్ ప్రపంచానికి నూతన ద్వారం

హైదరాబాద్‌ను క్వాంటమ్ సిటీగా అభివృద్ధి చేసి ప్రపంచ నాయకత్వం వైపు నడిపించాలన్న ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సంకల్పంతెలంగాణ టెక్నాలజీ రంగానికి కొత్త ఊపును తెస్తోంది. ప్రపంచం క్వాంటమ్ కంప్యూటింగ్, అగ్రశ్రేణి సైబర్ సెక్యూరిటీ, డేటా ప్రాసెసింగ్ వంటి అధునాతన రంగాల్లో విప్లవాత్మక మార్పులను చూస్తున్న ఈ సమయంలో, హైదరాబాదును ఆ దిశగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ దృష్టి ఎంతో దూరదృష్టి కలిగిన నిర్ణయం. ఇప్పటికే హైటెక్ సిటీ, బయోటెక్ పార్కులు, స్టార్టప్ కేంద్రాలతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్, అత్యాధునిక పరిశోధనలకు అనువైన మౌలిక వసతులు, నైపుణ్యంకలిగిన మానవ వనరులు కలిగిన నగరం. ఈ నేపథ్యంలో క్వాంటమ్ టెక్నాలజీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక పరిశోధనా కేంద్రాలు, ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో భాగస్వామ్యాలు,పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య అనుసంధానాన్ని పెంపొందించడం కీలకం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## రాష్ట్ర గీతంగా ఆమోదించాలి

తెలంగాణా రాష్ట్రం అందెశ్రీ అందించిన గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ఆమోదించి అమలు పరచింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఒక గీతాన్ని ఓ మంచి కవి చేత రాయించాలి లేదా దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అనేక దేశభక్తి గీతాలు రాసారు. అందులో ఒక దానిని రాష్ట్రానికి అనుకూలంగా ఉండేలా చిన్న చిన్న మార్పులు చేర్పులు చేసి గీతాన్ని శ్రీ చాగంటి కోటేశ్వర రావుగారికి గాని లేక గరికిపాటి వారికి గాని చూపించి అవుననిపిస్తే బాగుంటుంది. రాష్ట్రప్రభుత్వంఆలోచన చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## వృద్ధ నేతలు తప్పుకోవాలి

అపారమైన తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు గల యువత మన దేశంలో ఎంతో మంది ఉన్నారని వీరంతా రాజకీయాల్లోకి వచ్చి చురుకైన పాత్రపోషించాలని అత్యున్నత పదవులను అధిష్టించాలని మాటల్లోను ఉపన్యాసాల్లోను సెలవిస్తున్నారే కానీ చేతలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయి. ఎవరి వయసుకి తగిన పనులు వారు చేస్తేనే బాగుంటుంది. యువతకు కూడాఅవకాశం కల్పించేలా వృద్ధనేతలు ఆలోచించాలి. యువతను ప్రోత్సహించేలా ఉపన్యాసాలు ఇవ్వాలి.


-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

# వ్యవస్థపై అవగాహన తప్పనిసరి!

**గ్రామ ప్రథమ పౌరుడి విధులలో, గ్రామంలో సూపరిపాలన అందించడం, త్రాగునీటి, పారిశుధ్యం, రోడ్లు,విద్యుదీకరణ వంటి కనీస అవసర సేవలనిర్వహణ, గ్రామసభకు అధ్యక్షత వహించి సభలను విజయవంతం చేయడం, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చడం, పన్నుల సేకరణ, నూతన ఆదాయవనరులను సృష్టించడం, గ్రామ అభివృద్ధి పనుల నిర్వహణ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, కేంద్ర, రాష్ట్ర నిధులను గ్రామానికి పన్నులు ఇతరత్రా ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి ఉపయోగించడం, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించి గ్రామంలో శాంతియుత వాతావరణ నెలకొల్పడం, గ్రామీణ వనరులను, నిధులను సమర్థవంతంగా వాడుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం, గ్రామ రికార్డులను, లెక్కలను నిర్వహించడం. గ్రామంలో విద్య, వైద్య సదుపాయాలను పర్యవేక్షించడం, పథకాల అమలులో, అభివృద్ధిలో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులతో సమన్వయంగా ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపాలి.**

బైరబోయిన వెంకటేశ్వర్లు

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సమరం ఊపందుకుంది. ఐనవారి మధ్య జరిగే ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఇటీవల పంచాయితీ ఎన్నికల్లో లక్షలు వెచ్చించి వేలం వేసి ఏకగ్రీవం అవడం, అమెరికా నుండి వచ్చి సర్పంచ్ పదవికి నామినేషన్ వేయడం, ఒకే పంచాయితీలో తల్లి బిడ్డలు, అన్న చెల్లలు, అత్త, కోడళ్లు పోటీ పడడం, పదవీకాలంలో ఎక్కువ ఆస్తులు సంపాదించినట్లైతే అవి పంచాయితీకే అని బాండ్ పేపర్ రాయడం, ఉన్నత ఉద్యోగాలకు రాజీనామా చేసి పంచాయితీ పోటీల్లో పాల్గొనడం వంటి సంఘటనలు చూస్తున్నాం. పదవిమీద వ్యామోహమో, రాజకీయ రంగంలో తొలిఅడుగులు వేయాలనే ఆసక్తేమో కానీ పంచాయితీ ఎన్నికల పరంపర రసవత్తరంగా సాగుతుంది. కానీ అభ్యర్థులు పోటీపడడమే కాకుండా పంచాయితీరాజ్ వ్యవస్థపై, విధులు, నిధులపై సమగ్ర అవగాహన ఉంటేనే గెలిచాక పాలన సుగమం అవుతుందనేది గమనించాలి. అలాగే అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ప్రజలకు కూడా పంచాయితీరాజ్ వ్యవస్థపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామ ప్రథమ పౌరుడి విధులలో, గ్రామంలో సూపరిపాలన అందించడం, త్రాగునీటి, పారిశుధ్యం, రోడ్లు, విద్యుదీకరణ వంటి కనీస అవసర సేవలనిర్వహణ, గ్రామసభకు అధ్యక్షత వహించి సభలను విజయవంతం చేయడం, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చడం, పన్నుల సేకరణ, నూతన ఆదాయవనరులను సృష్టించడం, గ్రామ అభివృద్ధి పనుల నిర్వహణ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, కేంద్ర, రాష్ట్ర నిధులను గ్రామానికి పన్నులు ఇతరత్రా ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి ఉపయోగించడం, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించి గ్రామంలో శాంతియుత వాతావరణ నెలకొల్పడం, గ్రామీణ వనరులను,నిధులను సమర్థవంతంగా వాడుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం, గ్రామ రికార్డులను, లెక్కలను నిర్వహించడం. గ్రామంలో విద్య, వైద్య సదుపాయాలను పర్యవేక్షించడం,పథకాల అమలులో, అభివృద్ధిలో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులతో సమన్వయంగా ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపాలి. కేంద్రం గ్రామ పంచాయతీలకు పథకాల ద్వారా జమ అయిన ఖర్చులలో పారదర్శక ప్రదర్శించడా నికి ప్రవేశపెట్టిన ఇ గ్రామ్ స్వరాజ్ పోర్టల్, మేరి పంచ యాత్ యాప్‌లపై ప్రజల్లో గ్రామ పంచాయితీ నిధుల విషయానికొస్తే గ్రామపంచాయితీలకు నిధులు ప్రధానంగా గ్రామ పంచాయితీ పన్నుల, ఇతర భవనాలు, మార్కెట్ యార్డు, సంతలు అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే స్వీయ ఆదాయం. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులనుండి వస్తాయి. 15వ ఆర్థిక సంఘం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2021-22నుండి 2025-26 వరకు ప్రతి సంవత్సరం రెండు విడుతలుగా (మొదటి విడుత జూన్‌లో, రెండవ విడత అక్టోబర్‌లో) పంచాయితీలకు నిధులను విడుదల చేస్తుంది. వీటిలో 85 శాతం గ్రామాలకు,10 శాతం మండల పంచాయితీలకు,5




శాతం జిల్లా పంచాయితీలకు వాడుకుంటారు. అందులో జీతభత్యాలు గాక 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాల నిర్వహణకు అన్ టైడ్ ఫండ్ రూపంలో అందితే, అత్యవసర అవసరాలకు త్రాగునీటి సరఫరాకు, పారిశుధ్య నిర్వహణకు టైడ్‌ఫండ్ రూపంలో విడుదల చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం15వ ఆర్థిక సంఘం 2021-22నుండి 2025-26 కాలానికి 7201 కోట్లను తెలంగాణ రాష్ట్రానికి కేటాయిస్తే అందులో ఈ ఆర్థిక సంవత్సరానికి 2025-26కుగాను 1477కోట్లుగా కేటాయించింది. రాష్ట్రప్రభుత్వం వార్షిక బడ్జెట్లో నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు అవసరాలకనుగుణంగా విడుదల చేస్తుంది. వీటితో పాటు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, జల్ జీవన మిషన్, మహాత్మ గాంధీ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్, నేషనల్ హెల్త్ మిషన్, ప్రధాన మంత్రి గ్రామీణ్ అవాస్ యోజన వంటి పథకాలతో కొన్ని నిధులు అందుతున్నాయి. భారత ప్రభుత్వ పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ, జాతీయ పంచాయితీ అవార్డులను ఉత్తమ గ్రామాలకు ప్రతి సంవత్సరం ప్రధానం చేస్తుంది.ఇది సూచించిన ముఖ్యమైన అంశాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే గ్రామపంచాయితీలకు ర్యాంకింగ్ ఇస్తుంది. ఇందులో పేదరిక నిర్మూలన, మెరుగైన జీవన విధానం, ఆరోగ్యకర గ్రామ పంచాయితీ , పిల్లల హక్కులు, విద్య, వైద్యం మహిళల రక్షణ, సాధికారత, త్రాగునీటి పారిశుధ్య నిర్వహణ, స్థిరమైన మౌలిక సదుపాయాలు కల్పన, గ్రామ పంచాయితీల సామాజిక సురక్షిత, ప్రజలకు అందించే సుపరిపాలన అనే 9 అంశాలను ప్రామాణికంగా తీసుకుంటూ మెరుగైన ప్రగతిని సాధించిన గ్రామ పంచాయతీలకు జాతీయ పంచాయతీ అవార్డులను ఇస్తారు. పైన పేర్కొన్న అంశాలలో ప్రతి అంశంలో ప్రథమ స్థానంలో నిలిచిన 3 గ్రామ పంచాయతీలకు దీన్దయాల్ ఉపాధ్యాయ పంచాయత్సతత్ వికాస్ పురస్కార్‌ను అందిస్తుంది. పై 9 అంశాలలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన 3 గ్రామ పంచాయితీలకు, 3 మండల పంచాయితీలకు,3 జిల్లా పంచాయితీలకు నానాజీ దేశముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌ను అందిస్తుంది. ఇవేకాక కొన్ని ప్రత్యేక విభాగాలలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి వాడకం, ఎలక్ట్రిక్ వెహికల్స్ వాడకాన్ని ప్రోత్సహిస్తూ పునరుత్పాదక ఇంధన వనరులను వాడి గ్రామాన్ని కర్బన రహితంగా చేయడంలో కృషి చేసిన గ్రామాలకు క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్ అవార్డు, సొంత వనరులతో గ్రామ ఆదాయాన్ని పెంచే గ్రామ పంచాయితీలకు ఆత్మనిర్భన్ పంచాయత్ స్పెషల్ అవార్డు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో సంస్థాగత సహకారం అందించే గ్రామ పంచాయితీలకు గ్రామ్ పంచాయత్ క్షమతా నిర్మాన్ సర్వోత్తమ్ సంతాన్ పురస్కార్ అవార్డులు ప్రతి సంవత్సరం జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం రోజున ప్రధాన చేస్తారు. 2025 సంవత్సరం జాతీయ ప్రత్యేక అవార్డుల విభాగంలో తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలం 'మల్' గ్రామపంచాయతీ 67 లక్షలు వారాంతం జరిగే పశువుల సంత నిర్వహణ ద్వారా,3.75లక్షలు షాపింగ్‌కాంప్లెక్స్ అద్దెల ద్వారా, విద్యుదీకరణ, పారిశుధ్య పన్నుల ద్వారా మొత్తంగా 3200 జనాభాకు తలసరి ఆదాయంగా సుమారు 2954 రూపాయలు స్వీయ ఆదాయాన్ని సమకూర్చి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తూ ఆత్మనిర్భన్ పంచాయత్ స్పెషల్ అవార్డు 2025కు ఎంపికైంది. ఇదే స్ఫూర్తితో ఎన్నికల్లో గెలుపు కోసం పోటీ పడిన్నట్టుగానే గెలిచిన తరువాత తమ పంచాయితీలను ఉత్తమంగా తీర్చిదిద్ది దేశంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడంలో పోటీ పడాలి. ప్రజలు కూడా డబ్బు, మందు వంటి తాత్కాలిక ప్రయోజనాలకు ఆకర్షణ కాకుండా ఐదు సంవత్సరాలు గ్రామ భవిష్యత్తుకు విధులు సక్రమంగా నిర్వర్తించే, నిధులను సమర్థంగా ఉపయోగించే, గ్రామ సమస్యలపై పోరాడే అర్హత గల నాయకత్వాన్ని ఎన్నుకోవాలనే ఆలోచన చేయాలి. అప్పుడే దేశానికి సంపూర్ణ గ్రామీణ స్వరాజ్యం దక్కుతుంది. ●

# పిల్లలపై సాంకేతిక ఉపకరణాల ప్రభావం

డాక్టర్ వి.వి.ఎస్.వి నరసింహం

మా నవ జన్మను ప్రసాదించిన తల్లిదండ్రులు నిత్యంపూజ్యనీయులు. ప్రతీ వ్యక్తికి తల్లిదండ్రులే దైవ స్వరూపాలు. మనల్ని కంటికి రెప్పలా కాపాడుతూ మన ప్రగతికి పరితపిస్తూ, అవిశ్రాంతంగా పనిచేస్తుంటారు. మన అభ్యున్నతి కోసం వారు తమ సమయాన్ని, శ్రమను ధారపోస్తారు. పిల్లలు సంతోషం కోసం ఎన్నో త్యాగాలు చేయడం వారికి పరిపాటి. వారు కోరుకునేది కేవలం మన అభ్యున్నతి మాత్రమే. ప్రతీ వ్యక్తి ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. నేటి తరం సాంకేతికంగా ముందుకెళుతోంది. అదే సమయంలో మారుతున్న సమాజ పోకడలు, సాంకేతిక విస్తృతి పెను సవాళ్లను విసురుతోంది. నిర్మల మనస్సుతో సమాజంలోకి అడుగుపెడుతున్న బుడతలు తమకు తెలియకుండానే విషవలయంలో చిక్కుకుంటున్నారు. మంచి, చెడులను తెలుసుకునే వయస్సులోనే చెడువైపు ఆకర్షితులైపోతున్నారు. కుటుంబాలు చిక్కిపోవడం, తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు కూడా దీనికి కారణంగా మారుతున్నాయి. వారు తగినంత సమయం చిన్నారులకు కేటాయించలేని పరిస్థితులు, వృత్తిపరమైన ఇబ్బందులు వారిని కొంత సంకట స్థితిలోకి నెట్టేస్తున్నాయి. అదే సమయంలో చిన్నారులు టెలివిజన్‌లు, సెల్‌ఫోన్‌లకు అలవాటు పడి, మెల్లగా బానిసలుగా మారిపోతున్నారు. ఆట పాటలకు స్థలం లేకపోవడం, స్నేహితుల సంఖ్య తగ్గిపోవడంతో వీరు తమకు తెలియకుండానే ఎలక్ట్రానిక్ వస్తువుల వలయంలో చిక్కిపోతున్నారు. అదే సమయంలో ఇంటర్నెట్ వినియోగం పెరగడం, ప్రతీ ఇంటిలో స్మార్ట్ ఉపకరణాలు పెరగడం కొంత మేలు చేస్తున్నా తెలియకుండానే ఎంతో విషాన్ని చిన్నారులలో నింపేస్తున్నాయి. కుటుంబంతో సంబంధం లేనంతగా చిన్నారులు వీడియో గేమ్‌లకు అలవాటు పడటం ఇటీవల అధికంగా కనిపిస్తోంది. ఇటువంటి వ్యక్తులలో మానవ సంబంధాలు పూర్తిగా మందగించడం, వివరీత ధోరణులు, క్రోధ ప్రవృత్తి పెరిగిపోతున్నాయి. మరొకవైపు చిన్నారులు తమకు తెలియకుండానే తమ వయసుకు మించిన, చూడకూడని అంశాలను చూడటం, తెలుసుకోవడం జరుగుతోంది. వీటిలో వారి




ప్రమేయం లేకుండానే సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ వీడియోలు, రీల్స్‌రూపంలో వారిని ఈ విష ప్రపంచంలోకి లాగేస్తున్నాయి. నెమ్మదిగా అవి తమ కంటెంట్ డోస్‌ని పెంచుతూ వారిని పూర్తిగా వీటికి బానిసలుగా మార్చుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లో తాము చూసిన విషయాలు బయట చేయాలనే తపన, ఆలోచనలు చిన్నారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీరు ప్రపంచాన్ని పూర్తిగా తెలుసుకునే సమయంలో వారు తెలియకుండా చెడు మార్గంలోఅడుగులు వేగంగా వేసేస్తున్నారు. వీరిని నిరంతరం గమనించి, మార్గ నిర్దేశం చేయాల్సిన తల్లిదండ్రులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నావెనక్కి తీసుకురాలేని నష్టం నేటితరం చిన్నారుల విషయంలో జరిగిపోతోంది. ప్రాథమిక పాఠశాలస్థాయి విద్యార్థులలో సైతం ఇటీవల ఇటువంటి అడల్ట్ కంటెంట్‌కి సంబంధించిన అంశాలను వీక్షించడం, తరచూ వాటిని చూడటం పరిపాటిగా మారిపోతోంది. ఇదివారి మానసిక పరిస్థితిని ప్రభావితం చేయడం, విద్యలో దృష్టి సారించలేక పోవడం వంటి విపరీత చర్యలకు కారణంగా మారిపోతోంది. చిన్నారులను నిరంతరం గమనిస్తూ వారి సమస్యలను వింటూ, వారికి సూచనలు అందించే పెద్దతరం ఎంతోఅవసరం. అటువంటి పెద్ద తరం మన ఇంటిలో లేనప్పుడు తల్లతండ్రులే తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా నడచుకోవాలి. భార్యభర్తలిద్దరూ నిత్యం తమపిల్లలతో కొంత సమయంగడపడం, వారి ఆలోచనలు,ఆకాంక్షలు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అదే సమయంలో వారు చెడు ఆలోచనలు, ధోరణులదిశగా అడుగులు వేయకుండావారికి సున్నితంగా మార్గనిర్దేశం చేయాలి. అప్పటికే వారు చెడుమార్గంలో అడుగులు వేసినా పెద్ద మనసుతో అర్థంచేసుకుని, వారిని సక్రమ మార్గంలో నడిపించాలి.చిన్నారులు సైతం ఒక చిన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. తల్లిదండ్రులకు ధైర్యంగా చెప్పగలిగే పనులను మాత్రమే వారుచేయాలి. తల్లిదండ్రులకు చెప్పుకోలేని పనులు ఎప్పుడూ వారుచేయరాదు. ఏదైనా పని చేయాలనిపిస్తే ముందుగా తల్లిదండ్రులకు ఆ విషయంచెప్పి వారి సలహా, సూచనలు తీసుకోవాలి. అప్పుడు ఎటువంటి నష్టం జరగదు. ఏం జరుగుతుందిలే అనే నిర్లక్ష్య ధోరణితో తల్లిదండ్రులకు చెప్పకుండా పరిపక్వత లేని వయసులో మనసు కు నచ్చినది చేసేద్దామని అడుగేస్తే...భవిష్యత్తును చేజేతులా అంధకారంలో నెట్టేసినట్టే. ●

# ప్రైవేటు టీచర్ల బాధలు పట్టించుకోరా?

గోరంట్ల శివరామకృష్ణ

గురువును దైవంగా భావించే సమాజం మనది. విద్యార్థులకు అక్షర భిక్షను పెట్టి వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా మలచే పవిత్రమైన ఉపాధ్యాయులంటే అందుకే అందరికీ ఎనలేని గౌరవం. తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల కంటే 38శాతం ఎక్కువటీచర్లు ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్నారు.అనధికారిక లెక్కల ప్రకారం రెండు తెలుగురాష్ట్రాలలో సుమారు 3లక్షలమంది పైగా ప్రైవేట్ టీచర్లు ఉన్నట్లు తెలుస్తోంది.వీరిలో 60శాతంమంది కనీస ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలకు నోచుకోకుండా బతుకు బండిని నెట్టుకొస్తున్నారంటే నమ్మాల్సిందే. టీచర్ గ్రాడ్యుయేట్ ఎన్నికలు తప్ప మిగిలిన ఏ సందర్భంలోనూ రాష్ట్ర ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, ఏపీ, తెలంగాణలోని ప్రస్తుత ప్రభుత్వాలైనా తమ సమస్యల మీద దృష్టి పెట్టాలని వారంతా కోరుతున్నారు. వినటానికి కాస్త ఇబ్బందిగా ఉన్నా ప్రైవేటు టీచర్ల జీవితాలు ఈ రోజు వెట్టిచాకిరి బానిసలకంటే దౌర్భాగ్యంగా ఉన్నాయి. గత పదేళ్లలో ప్రైవేటు స్కూళ్ల మీద రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టు కోల్పోయింది. వీధికొక స్కూలు వస్తున్నా, వాటిలో అనుమతులున్నవెన్నో తెలియని పరిస్థితి. వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేసే ఈ స్కూళ్లలో రోజంతా నిలబడి పనిచేసే గొంతుపోయేలా పాఠాలు చెప్పే టీచర్లలో సగం మందికి ఉపాధి హామీ కూలీకి దక్కే వేతనం దక్కటం లేదు. వీరిలో చాలామంది ఏళ్ల తరబడి టీచరు నోటిఫికేషన్లు లేక, వయసు దాటిపోయి, సమీపంలోని ప్రైవేటు స్కూల్స్‌లో పని చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాలను పోషించుకుంటున్న వారు కొందరైతే.. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న గౌరవంతో రాజీపడుతూ బతికేవారు మరికొందరు. ప్రైవేటు స్కూళ్లలో టీచర్లకు మార్చి నెల వచ్చిందంటే నరకం గుర్తుకు వస్తుంది. స్కూలు సమయం తర్వాత వీరు విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను ఒప్పించి, అడ్మిషన్లు చేయించాలి. మేనేజ్‌మెంట్ వారు చెప్పినన్ని అడ్మిషన్లు చేయని టీచర్లకు వచ్చే ఏడాది ఉద్యోగం లేనట్లే. ఎలాగూ ఏప్రిల్, మే వేతనాలు ఇవ్వరు గనుక.. మరో మార్గం లేక టీచర్లు ఇంటింటికీ తిరగాల్సి వస్తోంది. ఒంటిపూట బడుల రోజుల్లో ఎర్రటి ఎండల్లో వీరిని అడ్మిషన్ల కోసం పంపే మేనేజ్‌మెంట్లు వీరి వేతన పెంపుదగ్గరకు వచ్చేసరికి



మీ తరగతిలో పిల్లలకు మంచి మార్కులు రాలేదు అంటూ గొణగటం మామూలే. మన సమాజంలో ఏ సంఘం లేకుండా.. ఎవరికి వారే అన్నట్లు పనిచేసే ఉద్యోగులు ఎవరైనా ఉన్నారంటే అది ప్రైవేటు టీచర్లే. కాబట్టి తమ సమస్యలపై వీరు కలిసి కట్టుగా పోరాటం చేయలేకపోతున్నారు. ప్రయివేటు టీచర్స్ ఎవరైనా సంఘం పెట్టినట్టు తెలిసినా, తమ పాఠశాలలో పని చేసే టీచర్లు అందులో చేరినా వారి ఉద్యోగాన్ని తొలగించటమే కాకుండా, వారికిమరే ప్రైవేటుస్కూల్లో ఉద్యోగం రాకుండా యాజమాన్యాలు చేయటం ఇక్కడచాలా కామన్‌గా జరిగే వ్యవహారం. కనుక పోరుబాట పట్టి కుటుంబాన్ని పస్తులుంచలేక వీరంతా ఏసంఘంలోనూ చేరేందుకు ముందుకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రైవేటు స్కూల్స్‌లో నెలకు ఒక సెలవు కంటే ఎక్కువ పెడితే వేతనం కట్ చేయటం కామన్. నెలలో వచ్చే 4 ఆదివారాలు పోనూ ఒక సెలవు మాత్రమే ఉండే ఈ స్కూళ్లలో అంతకంటే ఎక్కువ సెలవులు పెరిగితే శాలరీకోసిపారేస్తారు. చాలా స్కూళ్లలో ఆదివారానికి ముందు, తర్వాతి రోజు సెలవుపెడితే.. రెండు రోజుల జీతం కట్. అనారోగ్యం గానీ అత్యవసరంగా సెలవు కోరితే ఇచ్చే అవకాశం బహు తక్కువ. గ్రామం, మండలం స్థాయిలో ఉన్న ప్రైవేటు స్కూళ్లలో రోజుకు 9 గంటలపాటు పనిచేసే టీచర్లలో సగం మంది వేతనాలు రూ. 9 నుంచి 12 వేల మధ్యనే ఉన్నాయి. ఇక పదో తరగతి పిల్లలకు బోధించే టీచర్లు రాత్రి 8 గంటల వరకు బడిలో ఉండాల్సిందే. దీనికి అదనంగా చెల్లించేది ఏమీ ఉండదు. స్కూలు యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర 12 నెలల ఫీజులు వసూలు చేస్తారు. కానీ టీచర్లకు మాత్రం పది నెలలకే జీతం అందుతుంది. ఏప్రిల్, మే నెలలకూ వేతనం ఇచ్చే స్కూళ్లుమొత్తం తెలంగాణలో కేవలం 5శాతం మాత్రమేనంటే నమ్మాల్సిందే. తెలంగాణలోని వందలో 20 శాతం స్కూళ్లలో టీచర్లకి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా లేవు. వీరికి నేరుగా వేతనాన్ని నగదు రూపంలో అందిస్తున్నారు. దీనివల్ల వీరికి ప్రభుత్వ పరంగా అందే వైద్యసదుపాయం, మెటర్నిటీ లీవ్ వంటివి ఏమీ అందవు. ఇక కరోనా సమయంలో ప్రైవేటు టీచర్లు పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. గత పదేళ్లలోప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు మరింతగా ప్రైవేటు టీచర్ల కష్టాన్ని దోచుకుంటున్నాయి. కళ్లముందు ఇంత జరుగుతున్నా,విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు.ఎమ్మెల్సీ ఎన్నికల వేళ తప్ప రాజకీయ పార్టీలు ప్రైవేటు టీచర్ల సమస్యల్ని ప్రస్తావించకపోవటం దురదృష్టకరం. ఇకనైనా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు తగినచర్యలు తీసుకుని, ప్రైవేటుస్కూళ్ల యాజమాన్యాలను కట్టడి చేయటంతోబాటు ఇక్కడ పనిచేసే టీచర్ల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. ●

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'వందేమాతరా'నికి 150యేళ్లు

## నేడు లోక్‌సభలో ప్రత్యేక చర్చ, పాల్గొననున్న ప్రధాని మోడీ
## రేపు రాజ్యసభలో చర్చించనున్న సభ్యులు
## 'సర్'పై కూడా రేపు దిగువ సభలో విస్తృత చర్చ

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగనుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ చర్చను ప్రారంభిం చనున్నారు. దేశభక్తి గీతానికి సంబంధించిన అనేక అంశాలను మోడీ ప్రస్తావించనున్నారు.



బంకిం చంద్ర చటర్జీ రాసిన 'వందేమాతరం' గీతం 1875 నవంబరు 7న సాహిత్య పత్రిక బంగదర్శన్‌లో మొదటగా ప్రచురించబడింది.

ఇది స్వాతంత్ర్య పోరాటానికి చేసిన కృషి, దాని చారిత్రక ప్రాముఖ్యత, ప్రస్తుత ఔచిత్యాన్ని కూడా ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రధా నంగా ప్రస్తావించే అవకాశముంది. రాజ్యసభలో వందేమాతరంపై చర్చను మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించే అవకాశముంది. వందేమాతరం చర్చకు సంబంధించిన షెడ్యూల్ ప్రకారం లోక్‌సభలో మొత్తం 10 గంటల్లో ఎన్‌డిఏ సభ్యులకు మూడు గంటలు కేటాయించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందుకు రాజ్యసభ సెక్రటేరి యట్ పార్లమెంటు లోపల 'వందేమాతరం', జైహింద్ వంటి వ్యక్తీకరణలను ఉపయోగిం చకుండా ఉండాలన్న నోట్‌పై అధికార, విపక్ష సభ్యుల మధ్య రాజకీయ ఘర్షణ చోటుచేసు కుంది. అలాగే ఇటీవల ప్రధాని మోడీ, వందే మాతరం గీతానికి సంబంధించిన కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు. ప్రధానంగా 1937లో ఫైజాబాద్‌లో జరిగిన పార్టీ సమావేశంలో కాంగ్రెస్ అసలు పాట నుండి ముఖ్యమైన చరణాలను తొలగించిందని మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ నిర్ణయం విభజనకు బీజాలు నాటిం దని, జాతీయ గీతాన్ని ముక్కలుగా చేసిందని ప్రధాని మోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే, ఈ నిర్ణయం రవీంద్రనాథ్ ఠాగూర్ సలహా మేరకు జరిగిందని, ఇతర వర్గాలు, విశ్వా సాల సభ్యుల భావాలను కాంగ్రెస్ గౌరవించింది, గౌరవిస్తోందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీ ఆరోపణలు తిప్పికొట్టారు. ఈ నేపథ్యంలో 'వందేమాతరం'పై పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



## బాబ్రీ తరహా మసీదు నిర్మాణానికి బెంగాల్‌లో శంకుస్థాపన

**ముర్షిదాబాద్,డిసెంబరు 7:** టీఎంసీనుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ముర్షీదాబాద్‌లో బాబ్రీ మసీదు తరహాలో కట్టడం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బెంగాల్‌లో బాబ్రీ మసీదు శంకుస్థాపన వ్యవహా రంపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పోలరైజేషన్‌కు పాల్పడుతోందని, బాబర్ పేరుతో ఎలాంటి కట్ట డాన్నయినా భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. అయితే బీజేపీ వాదనను హుమయూన్ కబీర్ తోసిపుచ్చారు. మసీదు నిర్మాణం తన హక్కు అని, తాము రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏమీ చేయడం లేదని చెప్పారు. ఎవరైనా మందిరం, చర్చి నిర్మించుకోవచ్చని, తాను మసీదు నిర్మి స్తున్నానని చెప్పారు. రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణం చేపడతామని, అందులో ఒక ఆసుపత్రి, గెస్ట్ హౌస్, మీటింగ్ హాల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా బాబ్రీ మసీదు రెప్లికాను నిర్మిస్తామని అందులో పలు సంక్షేమసంస్థలు కూడా ఉంటాయని ముస్లిం సంస్థ ఒకటి ప్రకటించింది. ఎప్పుడు, ఎక్కడ, ఎలా నిర్మింస్తామన్న వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని సంస్థప్రతినిధి తెలిపారు.

## పనివేళలు ముగిసాక.. ఆఫీస్ కాల్స్ స్పందించకుండా ఉండేందుకు ప్రైవేటు బిల్లు

### లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎన్సీపీ పవార్ ఎంపి సుప్రియా సూలే

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించి, వారికి మెరుగైన జీవితాన్ని అందించే లక్ష్యంతో లోక్‌సభలో ఒక కొత్త ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. పనివేళలు ముగిసిన తర్వాత, సెలవు రోజుల్లో వచ్చే ఆఫీస్ ఫోన్ కాల్స్, ఈమెయిల్స్‌కు స్పందించకుండా ఉండే హక్కును ఉద్యోగులకు చట్టబద్ధంగా కల్పించా లనేది ఈ బిల్లు ప్రతిపాదన. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) ఎంపీ సుప్రియా సూలే లోక్‌సభలో రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు, 2025ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఉద్యోగుల హక్కులను పరిరక్షించేందుకు



ప్రత్యేకంగా ఒక ఉద్యోగుల సంక్షేమ అథారిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న పని ఒత్తిడిని తగ్గించి, ఉద్యోగులకు మెరుగైన పనిజీవిత సమతుల్యతను కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని సుప్రియా సూలే తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఇదే తరహాలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి మరో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. భారతదేశంలో 51 శాతం మంది ఉద్యోగులు వారానికి 49 గంటలకు పైగా పనిచేస్తున్నారని, 78 శాతం మంది తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను పరిమితం చేయ డం, మానసిక ఆరోగ్యానికి మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించాలని ఆయన తన బిల్లు ద్వారా కోరారు. అయితే, ఈ బిల్లులు ప్రైవేట్ మెంబర్ బిల్లులు కావడం గమనార్హం. మంత్రులు కాకుండా ఇతర ఎంపీలు ప్రవేశపెట్టే బిల్లులను ప్రైవేట్ మెంబర్ బిల్లులు అంటారు. సాధార ణంగా పార్లమెంటులో ఇలాంటి బిల్లులు చట్టరూపం దాల్చడం చాలా అరుదు. ప్రభుత్వం ఇచ్చే సమాధానం తర్వాత చాలావరకు వీటిని ఉపసంహరించుకుంటారు.



## మొసాద్‌కు కొత్తచీఫ్ రోమన్ గోఫ్‌మాన్

**జెరూసలెం, డిసెంబరు 7:** ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన నిఘా సంస్థ ఇజ్రాయెల్ మెసాద్‌కు కొత్తచీఫ్ వచ్చారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గతనెల 4న తన సైనిక కార్యదర్శిని ఆదేశ నిఘా సంస్థ మొసద్ తదుపరి అధిపతిగా ఎంపికచేసారు. ఈ కొత్త అధిపతి ఎప్పుడూ నిఘా విబాగంలో లేరు. ఆయనకు ఎలాంటి నిఘా నేపథ్యంకూడా లేదు. ఈ అధిపతిపేరు మేజర్‌జనరల్ రోమన్ గోఫ్‌మాన్. గూఢచారిసంస్థ మొస్సాద్ అధిపతిగా గోఫ్‌మన్‌ను నియమించాలనే నిర్ణయాన్ని ఇజ్రాయెల్ పిఎంఒ ప్రకటించింది. ప్రస్తుత మొసాద్‌చీఫ్ డేవిడ్ బార్నియా స్థానంలో ఆయనను నియమిస్తారని వెల్లడించారు. డేవిడ్ బార్నియా ఐదేళ్ల ఎదవీకాలం జూన్ 2026లో ముగుస్తుంది. మొసాద్‌చీఫ్‌గా గోఫ్‌మన్‌పేరు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్‌సైన్యం దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లా ఆయుధనిల్వ స్థావరాలపైదాడులుచేసింది. బెలారస్‌లో 1976 లో జన్మించిన గోఫ్‌మన్ 14 ఏళ్ల వయసలో ఇజ్రాయెల్ వచ్చాడు. తర్వాత 1995లో ఇజ్రా యెల్‌సైన్యం ఆర్మర్డ్ కార్ప్స్‌లో చేరి సుదీర్ఘ కాలంగా సైనిక జీవితం కొనసాగిస్తున్నారు. 2023 అక్టోబరు ఏడున ఇజ్రాయెల్‌పై హమాస్‌దాడి షురు చేసినపుడు గోఫ్‌మన్ ఇజ్రాయెల్ జాతీయ పదాతిదళ శిక్షణాకేంద్రం కమాండర్‌గా ఉన్నారు. గాజా సరిహద్దుకు సమీ పంలోని దక్షిణ ఇజ్రాయెల్‌నగరమైన స్టెరోట్‌లో హమాస్ ఉగ్రవాదులతోజరిగిన ఘర్షణలో తీవ్రగాయాలపాలయ్యారు. తర్వాత ఏప్రిల్ 2024లో నెతన్యాహు మంత్రివర్గంలో చేరారు. ఇజ్రాయెల్‌మజత జియోనిస్ట్ ఉద్యమ సభ్యుడు డేవిడ్‌ఐ దేశీయభద్రతా సంస్థకు అధిపతిగా నియమించారు. నెతన్యాహు మరో సారి జాతీ యవాద అభిప్రాయాలకు దగ్గరగా ఉండే వ్యక్తినే ఇజ్రాయెల్ యొక్క అతిపెద్ద నిఘా సంస్థకు అధిపతిగా నియమించుకున్నారు.



## సరిహద్దు రహదారులు.. జాతీయ భద్రతకు జీవనాధారాలు
### రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**లేహ్, డిసెంబరు 7:** 'సరిహద్దు రహదారులు.. జా తీయ జీవనాధారాలు' అని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. అత్యవసర సమ యాల్లో సత్వరం స్పందించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో రూ. 5,000 కోట్లతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్‌ఒ) నిర్మించిన 125 ప్రాజెక్టులను ఆదివారం ఆయన జాతికి అంకితం చేశారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పడానికి ఈ ప్రాజెక్టులే ఉదాహరణలని అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతాలపై లద్దాఖ్, జమ్మూ, కశ్మీర్‌తోపాటు సరిహద్దు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మిజోరంలలో వ్యూహాత్మకంగా 28 రహదారులు, 93 వంతెనలు, మరో నా లుగు ఇతర ప్రాజెక్టులను బిఆర్‌ఒ నిర్మించింది. ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని లేహ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లా డారు. మన సైనికుల శౌర్యం,ధైర్యం మనందికీ స్ఫూర్తి అని, దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ఈ ప్రాజెక్టులు అంకితమని అన్నారు. రోడ్డు నెట్‌వర్క్, రియల్‌టైమ్ కమ్యూనికేషన్, ఉపగ్రహ ఆధారిత నిఘా తదితర సౌకర్యాలు మన సైనికులు మరింత వేగంగా, సమర్థంగా పని చేసేందుకు దోహదపడుతున్నాయని పేర్కొ న్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా నూతన సాంకేతికను వినియోగించి, సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసినందుకు 'బిఆర్‌ఒ'ను రాజ్ నాథ్‌సింగ్ అభినందించారు. సాయుధ బలగా లతోపాటు బిఆర్‌ఒ సిబ్బంది, సరిహద్దు ప్రాం తాల పౌరులు జాతీయ భద్రతలో భాగస్వాముల వుతున్నారని కితాబిచ్చారు. ఇదే స్ఫూర్తి కొన సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లద్దా ఖ్‌లోని దర్బుక్-శ్యోక్-దౌలత్ బేగ్ ఓల్డి మధ్య 920మీటర్ల పొడవున నిర్మించిన సొరంగం గురించి రాజ్‌నాథ్‌సింగ్ ప్రత్యేకంగా ప్రస్తావిం చారు. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని కొని యా డారు. వాతావరణపరంగా ఎలాంటి క్లిష్టపరిస్థి తులు ఎదురైనా రవాణాకు ఎలాంటి అంతరా యం ఏర్పడకుండా దీనిని నిర్మించినట్లు చెప్పా రు. అంతేకాకుండా హిమపాతాల సమయం లోనూ సైన్యం ఆయుధాలు రవాణా చేసేందుకు ఇదివ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందన్నారు.

## కోల్‌కతాలో సామూహిక గీతా పారాయణం: లక్షలాది మంది హాజరు

**కోల్‌కతా, డిసెంబరు 7:** పశ్చిమ బెంగాల్ రాజ ధాని కోల్‌కతా ఆదివారం శ్రీకృష్ణ నామస్మరణ, శంఖ నాదాలతో మార్మోగింది. చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సామూహిక గీతా పారాయణానికి లక్షలాది మంది హాజరయ్యారు. 'సనాతన సంస్కృతి సంసద్' అనే సంస్థ 'ఐదు లక్షల స్వరాలతో గీతా పారాయణం' పేరిట ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. బెంగాల్‌తో పాటు పరిసర రాష్ట్రాల ప్రజలు, వివిధ మఠాలకు చెందిన సాధువులు తదితరులు పెద్దఎత్తున తర లివచ్చారు. దేశంలోనే ఇది అతిపెద్ద సామూహిక గీతా పారాయణమని భావిస్తున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనందబోస్, కేంద్రమంత్రి సుకాంత మజుందార్ తదితరులు పాల్గొని భగవద్గీత శ్లోకాలు పఠించారు. తర్వాత శాంతి, అహింసల గురించి



మాట్లాడారు. రాష్ట్ర ఆధ్యాత్మిక వారసత్వాన్ని మరోసారి గుర్తు చేసేందుకు, పవిత్ర గ్రంథాల ద్వారా సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించేం దుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వా హకులు తెలిపారు. రద్దీ నిర్వహణ, భద్రత, అత్యవసర వైద్యసేవల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి 6.5 లక్షల మందికిపైగా హాజరైనట్లు బిజెపి ప్రతినిధి అమిత్ మాలవీయ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

## మళ్లీ బద్దలయిన కిలవేయ అగ్నిపర్వతం

**హవాయి, డిసెంబరు 7:** అగ్రరాజ్యం అమెరికాకు చెందిన హవాయి ద్వీపంలో అత్యంత క్రియాశీల అగ్నిపర్వతాల్లో ఒకటైన కిలవేయ మరోసారి విస్ఫోటనం చెందింది. అగ్నిపర్వతం నుంచి పెద్ద ఎత్తున లావా ఉబికివస్తోంది. వెయ్యి అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతోంది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం అగ్నిపర్వతం బద్దలైనట్టు అధికారులు తెలిపారు. హవాయి జాతీయ ఉద్యానవనం లోపల ఉన్న కాల్డెరాలోనే లావా నిలిచి పోయిందని స్పష్టం చేశారు. అయినప్పటికీ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు కిలవేయ అగ్నిప ర్వతం 38 సార్లు విస్ఫోటనం చెందింది.



# గోవా నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం

### 25కు చేరిన మృతుల సంఖ్య
### రాష్ట్రపతి, ప్రధాని మోడీ దిగ్భ్రాంతి
### ఒక్కొక్కరికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా
### ప్రమాదం కాదు మర్డర్: రాహుల్‌గాంధీ




**పనాజీ, డిసెంబరు 7:** గోవాలో ఓ నైట్‌క్లబ్‌లో చెలరేగిన అగ్నికీలల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బందితో సహా 25 మంది మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తినష్టం సంభవించింది. గోవా రాజధాని పనాజీకి 25కిలోమీటర్ల దూరంలోని అర్పోరా గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. ఉదయం ఘటనా స్థలాన్ని సందర్శించిన బాధితులను పరామర్శించారు. నైట్‌క్లబ్ మేనేజర్‌ను అరెస్టు చేశారని, యజ మానిపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని, ఘటనపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశిం చినట్లు సిఎం ప్రమోద్ సావంత్ తెలిపారు. గవర్నర్ పి.అశోక్ గజపతిరాజు ఆదివారం ఉదయం ఆస్పత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందిం చాలని వైద్యులకు సూచించారు.
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం, మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుం బాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సిఎం ప్రమోద్ సావంత్‌కు ప్రధాని మోడీ ఫోన్ చేసి, ఘటనపై ఆరా తీశారు.
గోవా నైట్‌క్లబ్ ప్రమాదంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. దీనిని 'భద్రతా పరంగా నేరపూరిత వైఫల్యం' అని అభివర్ణించారు. ఈ విషాద ఘటన 'ప్రమా దం కాదు, హత్య' అని నొక్కిచెప్పారు. సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.



## జనవరిలో భారత్‌కు జెలెన్‌స్కీ
### ఆయన న్యూఢిల్లీ పర్యటనపై ప్రపంచ దేశాల ఆసక్తి

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ జనవరిలో భారత్ పర్య టనకు వస్తున్నారు. అయితే, తేదీలపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల కావలసి ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4-5తేదీల్లో న్యూఢిల్లీ పర్యటనను ముగించుకొని వెళ్లారు. ఈ నేపథ్యంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పర్యటనపై ప్రపంచ దేశాలు ఆసక్తి నెలకొంది. భారత విదేశాంగ అధికారుల కథనం ప్రకారం, రాబోయే జనవరిలో ఉక్రెయిన్ అధ్య క్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ భారత్ సందర్శనను షెడ్యూల్ చేయడానికి చర్యలు తీసుకుంటోంది. తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చి వెళ్లినం దున, ఉక్రెయిన్ అధ్యక్షుడి పర్యటనకు సం బంధించి షెడ్యూల్ ఖరారుపై భారత విదేశాంగ శాఖ జెలెన్‌స్కీ కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికార వర్గాలు వివరించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన నేపథ్యంలో ఇరుదేశాల అధినేతలు భారత్ పర్యటనపై ప్రపంచ దేశాలు ఆసక్తి కనబరచడం విశేషం.

## ఇండియా భర్తపై పాకిస్థాన్ భార్య ప్రధాని మోడీకి ఫిర్యాదు




**ఇస్లామాబాద్, డిసెంబరు 7:** తన భర్త తనను పాకిస్థాన్‌లో వదిలేసి, రహస్యంగా ఢిల్లీలో మరో పెళ్లికి సిద్ధమవుతున్నాడని ఓ పాకిస్థానీ మహిళ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలంటూ ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. కరాచీకి చెందిన నికితా నాగ్‌దేవ్ అనే మహిళ, తన భర్త విక్రమ్ నాగ్‌దేవ్‌పై ఈ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇండోర్‌లో దీర్ఘకాలిక వీసాపై నివసిస్తున్న పాకిస్థాన్ మూలాలున్న విక్రమ్ నాగ్‌దేవ్‌తో ఆమెకు 2020 జనవరి 26న కరాచీలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. పెళ్లైన నెల తర్వాత, ఫిబ్రవరి 26న ఆమెను భారత్‌కు తీసుకొచ్చారు. అయితే, కొన్ని నెలలకే వీసాలో సాంకేతిక సమస్య ఉందని చెప్పి, 2020 జూలై 9న అటారీ సరిహద్దు వద్ద తనను బలవంతంగా పాకిస్థాన్‌కు పంపించేశాడని ఆమె ఆరోపించారు. అప్పటి నుంచి తనను తిరిగి భా రత్‌కు పిలిపించుకోవడానికి విక్రమ్ నిరాకరిస్తు న్నాడని ఆమె వాపోయారు. పెళ్లై అత్తారింటికి వచ్చిన కొద్ది రోజులకే వారి ప్రవర్తనలో మార్పు వచ్చిందని నికిత తెలిపారు. తన భర్తకు తన బంధువుల్లో ఒకరితో వివాహేతర సంబంధం ఉందని తెలిసిందని, ఈ విషయం మామగారికి చెబితే, అబ్బాయిలకు ఇలాంటివి సహజం, ఏమీ చేయలేం అని అన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ రోజు నాకు న్యాయం జరగకపోతే, న్యాయవ్యవస్థపై మహిళలకు నమ్మకం పోతుంది. దయచేసి నాకు అండగా నిలవండని ఆమె కరాచీ నుంచి విడుదల చేసిన వీడియోలో వేడుకున్నారు. తన భర్త ఢిల్లీకి చెందిన మరో మహిళను పెళ్లి చేసుకోబోతున్నాడని తెలియడంతో నికిత 2025 జనవరి 27న లి ఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కేసు మధ్యప్రదేశ్ హైకోర్టుచే అధికారం పొందిన సింధీ పంచ్ మధ్యవర్తిత్వ, న్యాయ సలహా కేంద్రం ముందుకు వచ్చింది. విచారణ అనంతరం మధ్యవర్తిత్వం విఫలమైంది. భార్యాభర్తలిద్దరూ భారత పౌరులు కానందున, ఈ కేసు పాకిస్థాన్ పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ, విక్రమ్‌ను పాకిస్థాన్‌కు బహిష్కరించాలని ఆ కేంద్రం 2025 ఏప్రిల్ 30న సిఫార్సు చేసింది. గతంలో 2025 మే నెలలో ఇండోర్ సోషల్ పంచాయితీ కూడా విక్రమ్‌ను దేశం విడిచి పంపాలని సిఫార్సు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇండోర్ కలెక్టర్ ఆశిష్ సింగ్ ఈ విషయంపై విచారణకు ఆదేశించినట్లు ధృవీక రించారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



## సిఎం అభ్యర్థిగా ప్రకటిస్తే క్రియాశీల రాజకీయాల్లోకి సిద్ధూ

**చండీఘడ్, డిసెంబరు 7:** మాజీ క్రికెటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూ తిరిగి రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. రానున్న అసెం బ్లీ ఎన్నికల్లో పంజాబ్ కాంగ్రెస్ ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటారని సిద్ధూ సతీమణి నవ్‌జోత్ కౌర్ సిద్ధూ పేర్కొన్నారు. ఏ పార్టీకి చెల్లించేందుకు తమ వద్ద నిధులు లేవని నవ్ జోత్ కౌర్ వెల్లడించారు. తాము అధికారంలోకి వస్తే మాత్రం పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామని చెప్పారు. మేం ఎప్పుడూ పం జాబ్, పంజాబియత్ కోసం గళం విప్పుతామని, ముఖ్యమంత్రి సీట్లో కూర్చోవడానికి రూ.500 కోట్లు చెల్లించే స్థోమత లేదని వ్యాఖ్యానించారు.

## పూరీ జగన్నాథుడికి 60వేల ఎకరాల సొంత భూమి



**పూరి, డిసెంబరు 7:** ఒడిశా రాష్ట్రంలోని పూరి జగన్నాథ ఆలయానికి రాష్ట్రంలో 60,426 ఎకరాల భూమి ఉండగా, మరో ఆరు రాష్ట్రాల్లో దాదాపు 400 ఎకరాల భూమి ఉందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శనివారం శాసనసభలో వెల్లడించారు. బీజేడీ ఎమ్మెల్యే సుదర్శన్ హరిపాల్ శాసనసభలో అడిగిన ఒక లి ఖితపూర్వక ప్రశ్నకు సమాధా నంగా మంత్రి ఈ వివరాలు తెలియజేశారు. పూరిలోని ఈ 12వ శతాబ్దపు ఆలయాన్ని శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1956 ప్రకారం న్యాయశాఖ నిర్వహిస్తుంది. ఒడిశాలోని 24 జిల్లాల్లో జగన్నాథుని పేరు మీద 60,426.94 ఎకరాల భూమి ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో 322.93 ఎకరాలు, మహారాష్ట్ర లో28.21 ఎకరాలు, మధ్యప్రదేశ్‌లో 25.11 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్ 17.02 ఎకరాలు, ఛత్తీస్‌గఢ్ 1.7 ఎకరాలు, బీహార్‌లో 0.27 ఎకరాలతో కలుపు కుని ఇతర ఆర రాష్ట్రాలలో మరో 395.25 ఎకరాల ఆలయ భూమి ఉందని ఆయన పేర్కొ న్నారు. ప్రస్తుతం 38,061.792 ఎకరాలకు సంబంధించిన సవరించిన భూమి రికార్డులు పూరిలోని శ్రీ జగన్నాథ ఆలయ అధికారుల వద్ద ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆలయ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నట్లు అనేక కేసులు వెలుగులోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఆక్రమణలో ఉన్న 169 ఎకరాల భూమిని తిరిగి పొందేందుకు శ్రీ జగన్నాథ ఆలయ చట్టం కింద మొత్తం 974 కేసులు నమోదు చేసినట్లు ఆయన సభకు తెలియజేశారు.


## సంక్షిప్తంగా..

### రూ.8వేల చిరుద్యోగికి రూ.13 కోట్ల జిఎస్టీ బకాయి నోటీసులు



**చెన్నై, డిసెంబరు 7:** నెలకు రూ.8వేల జీతానికి పనిచేసే ఓమహిళకు రూ.13 కోట్ల జీఎస్టీ బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు రావడం తమిళనాడులో కలకలంరేపింది.చిరుద్యోగినైన తనకు జీఎస్టీ నోటీసులు రావడం. అది కూడా ఏకంగా 13కోట్లు కట్టాలని అందులో పేర్కొనడంతో సదరు మహిళ నివ్వెరపోయింది. జీతం డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లినపుడు ఈ విషయం బయటపడింది. తమిళనాడులోని వెల్లూర్‌జిల్లాలో చోటుచేసుకుంది ఘటన. వెల్లూర్ జిల్లా లోని గుడియతమ్ ఏరియాలోని నగల్ ప్రాంతానికి చెందిన మహాలింగం కార్ డ్రైవర్ ఆయన భార్య యశోద ప్రైవేట్ షూ కంపెనీలో పనిచేస్తోంది. షూ కంపెనీనుంచి నెలకు రూ.8వేలు జీతంగా అం దుకుంటోంది. ఇటీవల జీతం డబ్బులు డ్రాచేసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా ఆమె ఖాతాఫ్రీజ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఏం జరిగిందని ఆరా తీయగా యశోద జీఎస్టీ బకాయిపడిందని తేలింది.

### చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడి మృతి




**కోయంబత్తూరు, డిసెంబరు 7:** తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా వాల్పారైలోని తేయాకు తోటలో చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. గత ఎనిమిది నెలల్లో ఈ ప్రాంతంలో చిరుత దాడిలో చిన్నారులు మరణించడం ఇది మూడోసారి కావడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, అటవీ శాఖ అధికారుల వివరాల ప్రకారం వాల్పారైలోని అయ్యర్పాడి తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న అస్సాం వలస కార్మికుడి కుమారుడైన సైఫుల్ (5) తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో సమీపంలోని తేయాకు పొదల నుంచి ఆకస్మాత్తుగా దూసుకొచ్చిన చిరుతపులి బాలుడిని పట్టుకుని తోటలోకి లాక్కెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న తోట కార్మికులు, అటవీ శాఖ సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపటి తర్వాత తోట లోపలి భాగంలో సైఫుల్ మృతదేహాన్ని గుర్తించారు. చిరుత దాడి చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి.

### మైనర్‌పై అత్యాచారం కేసు: న్యూజిలాండ్‌లో భారతీయుడికి ఏడేళ్ల జైలు




**వెల్లింగ్టన్, డిసెంబరు 7:** న్యూజిలాండ్‌లో భారత సంతతికి చెందిన సత్వీందర్ సింగ్ అనే క్యాబ్ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలుశిక్ష పడింది. ఇతడు 2023లో ఓ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు రుజువు కావడంతో అధికారులు నిందితుడికి జైలుశిక్ష విధిం చారు.అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం సత్వీందర్‌సింగ్ అనే క్యాబ్ డ్రైవర్ 11 సంవత్సరాలుగా న్యూజిలాండ్‌లో ఉంటూ క్యాబ్ నడుపుతున్నాడు. 2023లో ఒకరోజు రాత్రి మైనర్ ప్రయాణికురాలు క్యాబ్‌ను బుక్ చేసుకుంది. ఈ క్రమంలో సత్వీందర్‌సింగ్ జిపిఎస్‌ను ఆఫ్ చేసి.. కారును దారి మళ్లించాడు. అక్కడ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బాధితురాలిని ఆమె స్నేహితుల ఇంటి దగ్గరవదిలేశాడు. సిసికెమెరాల ఆధారాంగా సత్వీందర్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. ఈ కేసుపై తాజాగా అక్కడి న్యాయస్థానం విచారణ జరిపి ఏడేళ్లకుపైగా జైలుశిక్ష విధించింది.

### డివైడర్‌ను ఢీకొట్టి గాల్లోకి లేచిన మెర్సిడిస్



**బుచారెస్ట్, డిసెంబరు 7:** కారులో వేగంగా వెళుతుండగా డ్రైవర్ స్పృహ కోల్పోవడంతో డివైడర్ ను ఢీ కొట్టి కారు గాల్లోకి లేచింది. ఎదురుగా వస్తున్న బస్సు, కార్ల పైనుంచి వెళ్లి ఓ పోల్ ను ఢీ కొట్టింది. సినిమా సన్నివేశాన్ని తలపించే ఈ సంఘటన రొమేనియాలో చోటుచేసుకుంది. రోడ్డు పక్కనే ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డు కాగా ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రొమేనియాలోని ఒరాడియా సిటీలో 55 ఏళ్ల వ్యక్తి తన మెర్సిడస్ కారులో వెళుతుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. మధుమేహంతో బాధపడుతుండడంతో సడెన్ గా స్పృహ కోల్పోయాడు. దీంతో కారు అదుపుతప్పి రాంగ్ రూట్ లోకి వెళ్లింది. డివైడర్ ను ఢీ కొట్టి గాల్లోకి లేచింది. ఎదురుగా వస్తున్న ఓ బస్సు, దాని వెనకే ఉన్న రెండు కార్ల పైనుంచి వెళ్లి ఓ పోల్ ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ ను ఎమర్జెన్సీ సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

### తేజ్‌ప్రతాప్ యాదవ్ విద్యుత్ బకాయిలు రూ.3 లక్షలు



**పాట్నా, డిసెంబరు 7:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కుటుంబ కలహాల నేప థ్యంలో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపించింది. తేజ్ ప్రతాప్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు రూ.3.6 లక్షలు దాటిందని కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం తేజ్‌ప్రతాప్ ప్రభుత్వ నివాసంలో ఉంటున్నారు. అయితే పట్నాలో ఆయనకు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి చివరిసారిగా 2022 జూలైలో కరెంటు బిల్లు చెల్లించారు. గత మూడేళ్లుగా దీనికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయి. జరిమానాలతో కలిపి ఇప్పుడా మొత్తం కరెంటు బిల్లు రూ.3.61 లక్షలకు చేరింది.

# సాగు ఆధారంగా యూరియా

## ఇకపై పంట వేసిన భూమికే పంపిణీ

## ప్రత్యేక యాప్‌కు రూపకల్పన

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, 7, ప్రభాతవార్త :** యాసంగి సీజన్ యూరియా పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత వానకాలం సాగు సమయంలో యూరియా కొరతతో రైతులు పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సాగు విస్తీర్ణం ఆధారంగానే యూరియా పంపిణీ చేయనుంది. దీనికోసం ప్రత్యేక యాప్ అభివృద్ధి చేసింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు సాంకేతికతను వినియోగించనుంది. అలానే యాసంగి సీజన్‌కు సంబంధించి కేంద్రం నుంచి యూరియా సరఫరాను వేగవంతం చేయాలని కోరు తోంది. వానాకాలం సాగు సమయంలో తెలంగాణలో యూరియా కోసం రైతుల ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బస్తా యూరియా కోసం గంటల కొద్ది కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిల్చున్నారు. యూరియా కొరతపై ఇటు విపక్షాల నుంచే కాక ప్రజలు కూడా ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి యూరియా కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు గాను తెలంగాణ వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకోవడానికి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఈ సారి నుంచి సాగు విస్తీర్ణం ప్రకారమే యూరియా పంపిణీ చేయనున్నారు. అంటే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు అనే వివరాల ఆధారంగానే యూరియా పంపిణీ జరగబోతుంది. దీనికోసం రైతుల పట్టాదారు పాస్‌బుక్కుల నుంచి వివరాలు సేకరించి.. ఎంత యూరియా అవసరమో లెక్కలు తేల్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే పొలం విస్తీర్ణం కంటే ఎక్కువ యూరియా తీసుకోకుండా ప్రత్యేక యాప్‌ని అభివృద్ధి చేస్తున్నారు. గత నెల నుంచి ఆధార్ లింకుతో ఈపాస్ యంత్రాల ద్వారా యూరియా, ఇతర మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరమో అంతే తీసుకునేలా చర్యలు చేపట్టారు. దీని వల్ల అధికారులను తప్పుదోవ పట్టించి బ్లాక్‌లో అమ్మడం కోసం ఎక్కువ యూరియా తీసుకుంటే దొరికిపోతారు. దీని వల్ల బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయవచ్చని భావిస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు 10.40 లక్షల టన్నుల యూరియా నిల్వలు అవసరమని కేంద్రానికి లేఖ రాసింది. ఈ నెలాఖరు వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరింది. అయితే, ఇప్పటివరకు రెండు నెలలకు సంబంధించిన యూరియా నిల్వల్లో సగం మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని వ్యవసాయ శాఖ తెలిపింది. అక్టోబర్‌కు సంబంధించి 37 వేల టన్నులు, నవంబర్ నెలకు సంబంధించిన 25 వేల టన్నుల యూరియా రాష్ట్రానికి చేరింది. రాష్ట్రంలో అక్టోబర్ నుండి ఇప్పటివరకు 3.10 లక్షల టన్నులు సరఫరా జరిగింది. ఇప్పటికే మండల వ్యవసాయ శాఖ అధికారులు పంటలు వేసిన రైతులు ఏమేరకు యూరియా వాడకం చేస్తారో పట్టాపాసు బుక్ వివరాలు ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు అధికారులు వివరాల ప్రకారం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశారు. కేంద్రం మిగతా యూరియా కోటాను త్వరగా పంపాలని కోరుతున్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో సత్సంగ్ విహార్ 15వ వార్షికోత్సవంలో భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# సత్సంగ్ మహోత్సవానికి దక్షిణాదిలోనూ విశేష ఆదరణ

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (ముషీరాబాద్), డిసెంబరు 7, ప్రభాతవార్త:** సత్సంగ్ మహోత్సవం బెంగాల్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్‌ల్లోనే కాకుండా దక్షిణ భారతదేశంలోనూ విశేష ఆదరణ పొందుతోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కొనియాడారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో సత్సంగ్ విహార్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఠాకూర్ అనుకూల్ చంద్రవర్యుల 138వ జయంతి వార్షికోత్సవం, హైదరాబాద్ సత్సంగ్ విహార్ 15వ వార్షికోత్సవం సందర్భంగా కృప సరజ్ఞానీ మహోత్సవ్ 2025ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై గవర్నర్ మాట్లాడుతూ ఠాకూర్ అనుకూల్ చంద్రవర్యులు కారణ జన్ములని, ఆయనది గొప్పదివ్యమైన వ్యక్తిత్వమని కొనియాడారు. సత్సంగ్ విహార్ భారతీయ సాత్వికతను, ఆలోచనలను ప్రచారం చేస్తుందని, ప్రపంచ దేశా లలో సత్సంగ్ విస్తరించి, భారతదేశ గొప్పతనాన్ని ప్రచారం చేయటం అభినం దనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బసుత్కర్ జగదీశ్వర్‌రావు, ఆర్థోపెడిక్ వైద్యబృంద సభ్యులు డాక్టర్ కెజె రెడ్డి, సత్సంగ్ విహార్ హైదరాబాద్ సెక్రటరీ ఎ.గిద్వానితోపాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరాలు, ప్రార్ధ నలు, దివ్య సందేశాలు, ఠాకూర్ అనుకూల్ చంద్రవర్యుల జీవితానికి సంబంధించిన అంశాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

# రైతులకు ఆమోదనీయం కాని విత్తన చట్టం

## రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** కేంద్రం తెస్తున్న విత్తన చట్టం రైతులకు ఆమోదయోగ్యంగా లేదని తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ఈ విత్తన చట్టం మల్టీనేషనల్ విత్తన కంపెనీలు కోసమే అన్నట్లుగా ఉందని విమర్శించారు. కేంద్రం తెస్తున్న విత్తన చట్టంలో మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. రైతు కమిషన్ కార్యాలయంలో కేంద్రం తీసుకొస్తున్న విత్తన చట్టం ముసాయిదాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే విత్తనోత్పత్తి కి తెలంగాణ కేంద్రంగా ఉందన్నారు. ప్రపంచదేశాలకు తెలంగాణ విత్తనం ఎగుమతి అవుతుందని చెప్పారు. తెలంగాణలో విత్తన కంపెనీల తీరు కూడా బాగాలేదని సీడ్స్ కంపెనీలు కూడా వారి లోపాలను సవరించుకోవాలన్నారు. రైతుకు నష్టం లేకుండా చట్టం ఉండాలని, దానికి కంపెనీలు కూడా చెబుతున్నాయన్నారు. ఆర్గనైజర్ల వ్యవస్థతో రైతులకు కంపెనీలకు కూడా నష్టమేనని నిర్ధారణకు వచ్చాయని వివరించారు. కానీ లక్షలాది మంది రైతుల వద్దకు నేరుగా కంపెనీ వెళ్లలేని పరిస్థితుల్లో ఈ ఆర్గనైజర్లు వచ్చారని తెలిపారు. నకిలీ విత్తనం విషయంలో రైతులకు నష్ట పరిహారం అందించాలని స్పష్టం చేశారు. కేంద్రం తెస్తున్న చట్టంలో క్లారిటీ లేదని వ్యాఖ్యానించారు. రైతులు కోర్టులను ఆశ్రయించాలంటే వారికి ఎప్పుడు న్యాయం జరుగుతుందో తెలియని విధంగా ఉందన్నారు. విత్తన కంపెనీలకు అనుమతులు ఇవ్వడం, ధర నిర్ధారణ అంత రాష్ట్ర పరిధిలో ఉండాలని కేంద్రాన్ని కోరారు.



# సాయి ఈశ్వరాచారి కుటుంబానికి అండగా ఉంటాం

## బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర చారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

ఆదివారం బిసి రిజర్వేషన్ల కొరకు ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారి కుటుంబాన్ని మంత్రి పొన్నం పరామర్శిం చారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ ఇతర ముఖ్య నేతలు ఈశ్వర చారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సాయి ఈశ్వర్ మృతి బాధాకరమన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

# గ్లోబల్ సమ్మిట్‌ను స్వాగతిస్తున్నాం

## కిషన్‌రెడ్డి హాజరవుతారు: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** గ్లోబల్ సమ్మిట్ పేరిట ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడాన్ని భారతీయ జనతా పార్టీ పక్షాన స్వాగతిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. సోమవారం గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని, తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందాలని బిజెపి పార్టీ ఆకాంక్షి స్తుందని వెల్లడించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అన్ని రాష్ట్రాలు సమగ్రాభివృద్ధి అయ్యేందుకు అవసరమైన ప్రణాళికలను కేంద్రం రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాల

# రామగుండం థర్మల్ మూసివేత

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త :** దాదాపు ఐదు దశాబ్దాలుగా తెలంగాణకు సేవలందించిన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ మూసివేశారు. రాష్ట్రంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగుండం థర్మల్ స్టేషన్‌ను అధికారులు పూర్తిగా మూసివేశారు. 1971 అక్టోబర్‌లో యుఎస్‌ఎఐడి సహకారంతో స్థాపించిన తొలి థర్మల్ స్టేషన్‌గా రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ ప్లాంట్ మొత్తం 18743.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది.

రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిన ఈ ప్లాంట్ జీవితకాలం ముగిసిందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరువు ప్రభావిత జిల్లాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు ఈ యూనిట్ నుంచి విద్యుత్ సరఫరా చేసేవారు. నాలుగు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా సేవలు అందించిన ఈ థర్మల్ స్టేషన్ తాజాగా మూతపడటంతో చారిత్రక ఘట్టంగా నిలిచింది.

# విత్తన చట్టం ముసాయిదాపై 13 సవరణలు

## అగ్రికల్చర్ 'వర్సిటీ విసి జానయ్య

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** విత్తన చట్టం 2025 ముసాయిదాపై కేంద్రానికి పలు సవరణలు పంపినట్లు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జానయ్య తెలిపారు. దీనికి సంబంధించి విశ్వవిద్యాలయం సూచించిన 13 సవరణలను కేంద్రానికి పంపించినట్లు చెప్పారు. ఈ సవరణలకు సంబంధించిన తెలుగు, ఇంగ్లీష్ ప్రతులను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ చట్టంలోని వివిధ అంశాలను పరిశీలిస్తే రైతాంగ ప్రయోజనాలను కాపాడే విధంగా లేదనే భావన వ్యక్తమవుతోందన్నారు. అంతేకాకుండా వ్యవసాయం, రైతు సంక్షేమ బాధ్యత రాజ్యాంగ పరంగా పూర్తిగా రాష్ట్రాలది అయినందున ఈ చట్టం ద్వారా రాష్ట్రాల అధికారాలను హక్కులను హరించే విధంగా ఉందనే మరో అభిప్రాయం వెల్లువెత్తుతుందని తెలిపారు. దీంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రైతు నాయకులు, అధికారులు, శాస్త్రవేత్తలతో ఈ చట్టంలోని వివిధ అంశాలపై మేధోమథనం చేసి తిరిగి రాష్ట్ర స్థాయిలో ఒక విస్తృత సంప్రదింపుల సమావేశంలో ఈ చట్టంలో పొందుపరచిన అంశాల వారీగా కూలంకశంగా చర్చించడం జరిగిందని వెల్లడించారు. రైతుల ప్రయోజనాల కాపాడేందుకు అన్ని వర్గాల వారు తమ అభిప్రాయాలు పంచుకోవడంతో వచ్చే 50 యేళ్లపాటు జరిగే నష్టాన్ని నివారించవచ్చన్నారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రితో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ వ్యవసాయ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, వివిధ రైతు సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, విత్తన పరిశ్రమ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు సూచించిన సవరణలు అదనపు ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకోవాలని కేంద్రానికి సిఫార్సు చేసినట్లు విసి జానయ్య పేర్కొన్నారు.

# 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సమీపం లోని వీరాంజనేయ ట్రేడర్స్‌పై ఆదివారం హైదరాబాద్ సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్టీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికా రులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం నిల్వలను అధికారులు గుర్తించారు. ఇద్దరు వ్యక్తులు ఆటోలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, చిగురుమామిడి పరిసర ప్రాంతాల్లో నుంచి ఇంటింటికి తిరిగి కిలో రూ.12 చొప్పున రేషన్ బియ్యం సేకరించి మిల్లుకు తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. గత రాత్రి నుంచి నిఘా వేసి పట్టుకున్నామని అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో డ్రైవర్‌ను అదుపులో తీసుకు న్నామని చెప్పారు. 300 క్వింటాళ్లకుపైన రేషన్ బియ్యం ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆటో డ్రైవర్‌తో పాటు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

# సిపిఎల్‌లో పోలీసు శాఖ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** అంబర్‌పేట్‌లోని సెంట్రల్ పోలీసు లైన్స్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన నూతన పెట్రోల్ బంక్‌ను డిజిపి శివధర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. పోలీసు శాఖతో పాటు సాధారణ ప్రజానికానికి ఉపయోగపడేవిధంగా ఏర్పాటైన ఈ పెట్రోల్ బంక్‌ను నాలుగు నెలల్లో నిర్మించడం అభినందనీయమని డిజిపి ఈ సందర్భంగా తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ పెట్రోల్ బంక్ వల్ల పోలీసు విభాగానికి అదనపు ఆదాయం స మకూరుతుందని ఆయన అన్నారు. ఈ పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం పి అండ్ ఎల్ రమేష్ చేసిన కృషిని డిజిపి కొనియాడారు. కాగా దీంతో పాటు అంబర్‌పేట్‌లో నూతన పోలీసు రవాణా శాఖ భవనానికి కూడా డిజిపి శంకుస్థాపన చేశారు. 59 కోట్ల రూపాయలతో ఈ భవనం నిర్మిస్తున్నారు. ఈ భవనంలో పోలీసు రవాణా విభాగంతో పాటు మరమ్మతుల విభాగం కూడా వుంటుందని డిజిపి తెలిపారు. దీంతో పాటు అంబర్‌పేట్ సిపిఎల్‌లో కొత్తగా నర్మించిన పోలీసు రవాణా శాఖ సముదాయాన్ని కూడా డిజిపి శివధర్ రెడ్డి ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో సిటీ కొత్వాల్ సజ్జన్నార్, పి అండ్ ఎల్ ఐజి రమేష్, పిటిఓ ఎస్పి రాజేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కమీషన్లమయంగా కాంగ్రెస్ సర్కార్

## ఫుట్‌బాల్ ఆడటానికి రేవంత్ సిఎం అయ్యారా?

## నిజామాబాద్ ఎంపి అర్వింద్ విమర్శలు

**హైదరబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కమీషన్లమయంగా మారిపోయిందని బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. టోకెన్‌కు ఇంత అని కమీషన్ పెట్టి బహిరంగంగానే వసూలు చేస్తున్నారని విమర్శలు చేశారు. దోచుకుందాం అనే తరహాలో రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు ఆదివారం ఢిల్లీలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై అర్వింద్ ఛార్జ్ షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌కు ప్రజలకు మంచి చేయాలనే కనీస ఉద్దేశం లేదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు అధికారం లాటరీలో అదృష్టంగా తలుపు తట్టడంతో దోచుకుందాం అనే తరహాలో రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంవల్ల గత రెండేళ్లలో 790 మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. రెండు లక్షల రుణమాఫీ సరిగా చేయలేదని ఆవేదన చెందారు. ఎన్నికలు వచ్చినప్పుడే రైతు భరోసా అంటున్నారనీ ఆయన అన్నారు. ఫుట్‌బాల్ ఆడడానికి రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడా?. కేంద్రం నుంచి నిధులు వస్తున్న వాటిని సరిగా వినియోగించడం లేదని ఆరోపించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బాగోగులు పట్టించుకోవడం లేదు. ఫుడ్ పాయిజన్ విద్యార్థులందరూ ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 50శాతం ఖాళీలు ఉన్నాయనీ దీనితో వైద్యం లభించని పరిస్థితి నెలకొందని అన్నారు. రెండేళ్లు పూర్తి చేసుకున్నందుకు కాంగ్రెస్, రేవంత్‌రెడ్డికి కంగ్రాట్యులేషన్స్ తెలిపారు. ఈ రెండు సంవత్సరాల్లో బాగా సంపాదించుకున్నారని ఆరోపణలు చేశారు. చాలా పద్ధతిగా అవినీతి జరిగిందని, మంత్రులు వాళ్ల బంధువులు, రేవంత్ బంధువులు బాగా సంపాదించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రజా వంచన చేసిందని ఆక్షేపించారు. ఇచ్చిన ఒక్క హామీని కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు ఎంపీ అరవింద్. హిందూ దేవుళ్లపై రేవంత్‌రెడ్డికి ఎందుకంత కోపమని ధర్మపురి నిలదీశారు. కాంగ్రెస్ అంటే ముస్లింలని రేవంత్‌రెడ్డి అన్నారని ఆరోపించారు. కెసిఆర్, కెటిఆర్‌లను ఎందుకు జైల్లో వేయడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బిజెపిలో మేమంతా ఒక్కటి గానే ఉన్నామనీమా మధ్య సఖ్యత ఉందనీ తెలంగాణ బిజెపి నాయకుల మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవనీ ఆయన వివరించారు బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు నాకు పెద్దన్న లాంటి వారనీ ఆయన నాయకత్వంలో పని చేస్తూనే ఉన్నామని రాష్ట్రంలో పార్టీ సంస్థాగతంగా బలపడుతుందనీ చెప్పారు వచ్చే ఎన్నికల్లో మేము అధికారంలోకి వస్తామనీ అరవింద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రపంచంలోనే అతి పెద్దస్కామ్ 'హిల్ట్-పి పాలసీ'

## మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబరు 7, ప్రభాతవార్త:** భారతదేశ చరిత్రలోనే కాదు ప్రపంచంలోనే అతి పెద్ద స్కామ్ తెలంగాణలో హిల్ట్-పి పాలసీ పేరుతో జరుగుతోందని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సోషల్ ఫౌండేషన్ (టిఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో హిల్ట్‌పి ఎవరి కోసం? ఇందుకోసం? పేరుతో రౌండ్ టేబు ల్ సమావేశం అధ్యక్షుడు ఓ.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఇష్టం వచ్చినట్లు తమకు నచ్చినవారికి కట్టబెడుతున్నారని విమర్శించారు.

5లక్షల కోట్ల ప్రజల ఆస్తిని 440 మంది పంచుకోవాలని చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగస్వాములైన వారిని ఎవ్వరినీ వదలమన్నారు. న్యాయ పోరాటం చేస్తాం, భూములను కాపాడుతామన్నారు. భూ దోపిడీకి పాల్పడే వారిని తాము వచ్చాక జైలుకు పంపుతామని.. ప్రజా అవసరాల కోసమే ఇండస్ట్రీయల్ భూములు వినియోగించాలని సూచించారు. హైదరాబాద్ ప్రజలనే కాదు, తెలంగాణ ప్రజలను మోసం చేయడానికే ఈ హిల్ట్ పి పాలసీ అని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. పారిశ్రామిక భూములను ఒక పథకం ప్రకారం తక్కువ ధరకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి

ల్యాండ్ మార్క్ ఇన్సెటివ్ కాదు.. ల్యాండ్ స్కామ్ ఇన్సెటివ్ ఇది అని విమర్శించారు. దొంగలు, దొంగలు భూములు పంచుకోవడమే ఈ ల్యాండ్ స్కామ్ ఇన్సెటివ్ అని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీలో పెద్ద కుట్ర కోణం ఉందని అన్నారు.

40 ఏళ్ల క్రితం ప్రభుత్వం నాచారం ఇండస్ట్రియల్ ఏరియాను 700 ఎకరాలతో నిర్మించిందని పేర్కొన్నారు. అయితే పొల్యూషన్ చేసే కంపెనీలను తరలించాలనే సాకుతో ప్రభుత్వం పొల్యూషన్ చేయని కంపెనీలను కూడా తరలించాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. దోపిడీ దొంగల్లా భూముల కోసం హిల్ట్ పాలసీ అమలు చేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ సామాజిక ఆర్థిక విశ్లేషకులు పాపారావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ మాజీ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు గోవర్ధన్, రచయిత్రి గోగుశ్యామల, వ్యాపారవేత్త యుగంధర్ రావు, పాత్రికేయులు రమణకుమార్, ప్రభాకర్, బైండ్ల విజయ కుమార్, తదితరులు హాజరై ప్రసంగించారు.

# రంగనాయకసాగర్‌లోని నీళ్లు కాళేశ్వరం జలాలని నిరూపిస్తావా?

## హరీశ్‌రావును ప్రశ్నించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రంగనాయక సాగర్‌లో ఉన్న నీళ్ల కాళేశ్వరం బ్యారేజీల నుంచి ఎత్తిపోసినవే అని నిరూపిస్తావా అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సవాల్ చేశారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ హరీష్ రావు సిఎం ను రంగనాయక్ సాగర్ వేస్తాను మునిగితే కాళేశ్వరం ఉన్నట్లు మునగపోతే లేన్నట్లు అని అనడం నీ స్థాయికి తగదని ధ్వజమెత్తారు. అందుకే మా ముఖ్యమంత్రి హరీష్‌రావును ఆరడుగులు పెరిగావు కాని చటాక్ ధమాక్ లేదని ఎత్తిచూపుతారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు రెండేళ్ల క్రితమే నీకు, నీ మామకు , నీ బామ్మర్ధి కి బండ కట్టి కాళేశ్వరంలో వేశారని అపహాస్యం చేశారు.

మీరెప్పుడో కూలిన కూలేశ్వరంలో మునిగిపోయారని విమర్శించారు. మీ పార్టీ కూడా అప్పుడే కాళేశ్వరంలో సమాధి అయిపోయిందనీ కాళేశ్వరం పాపం మమ్మల్ని గోదావరి లో కలిపేసిందనీ అన్నారు. నీ పిల్లల మీద ఒట్టేసి చెప్పు మేడిగడ్డ కు పర్రెలు పాయలేదా..? అని ప్రశ్నించారు. అన్నారం సిపేజిలో రాలేదా..? కాళేశ్వరంలో మూడు బ్యారేజీలు రెండేళ్ల నుంచి చుక్కనీళ్లైనా ఎత్తిపోశారా? అని ఆయన నిలదీశారు. జనం ఛీ కొట్టినా ఇంకా హరీష్ రావు కు ఏ మాత్రం సిగ్గు రావడం లేదని చీత్కరించారు. జూబ్లీహిల్స్ లో బండకేసి బాదినా ఇంకా బుద్ధిరావడం లేదని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో మీ పార్టీ పత్తా లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. అనేక గ్రామాల్లో పోటీ మా పార్టీ అభ్యర్థుల మధ్యే ఉంది తప్ప బిఆర్ఎస్ ఎక్కడా కనిపించడం లేదని అన్నారు నాలుగు రోజులు ఆగు రాష్ట్రంలో నీ జెండా కూడా కనిపించదని చెప్పారు. మా ముఖ్యమంత్రి పైన నోరుపారేసుకుంటే నీకు తగిన శాస్త్రి చేస్తాం జాగ్రత్త అనిహెచ్చరించారు.

# బిసిలు ఐక్యంగా ఉంటే భవిష్యత్‌లో బిసి సిఎం

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** బిసి లందరూ ఏకమైతే రాబోయే రోజుల్లో బిసి ముఖ్యమంత్రి అవుతాడని తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో ఆదివారం జరిగిన పద్మశాలి విద్యార్థి వసతి గృహ సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవము కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఈరవత్రి అనిల్ హాజరైనారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మీరందరూ కాంగ్రెస్ పార్టీకి సహకారం చేయాలని కోరారు. నిజామాబాద్ గ్రామీణ ప్రాంతంలో 22వందల గజాల భూమి అందివ్వడానికి క్యాబినెట్ లో చర్చించి మంజూరు అయ్యే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. చేనేత రంగానికి ఊతమిచ్చేందుకు, ప్రభుత్వ శాఖలు, సంస్థలకు అవసరమైన వస్త్రాలను తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్స్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారానే సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. దీని ద్వారా కార్మికులకు నిరంతర ఉపాధి లభిస్తుందనీ అన్నారు. ఈ ప్రత్యేక పథకాలతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాధారణ సంక్షేమ పథకాలు కూడా పద్మశాలి వర్గంలోని అర్హులైన వారికి అందుబాటులో తీసుకువచ్చామనీ వివరించారు. దాన్ని మీరు సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు. మహాలక్ష్మి పథకం ద్వారామహిళలకు 2,500 ఆర్థిక సహాయం నెలనెల చేస్తున్నామని తెలిపారు రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రయోజనాలు అందిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిరాశ్రయులైన వారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే గృహనిర్మాణ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఈ పథకం కింద ఆసుపత్రులలో రూ10 లక్షల వరకు ఉచిత వైద్యం అందించబడుతుందని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూపద్మశాలి సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పద్మశాలి యువత విద్య వైపు మొగ్గు చూపాలని కోరారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలి వర్గంతో పాటు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలన, ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని చెప్పారు. అర్హులైన వ్యక్తిగత చేనేత కార్మికులకు ఏప్రిల్ 1, 2017 నుండి మార్చి 31, 2024 మధ్య తీసుకున్న బ్యాంకు రుణాలలో గరిష్టంగా ఒక లక్ష రూపాయలు వరకు మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. ఈ పథకం అమలుకు రూ.33 కోట్లు మంజూరు చేశామని ఆయన అన్నారు. నేతన్నకు భరోసా ఈ పథకం కింద చేనేత కార్మికులకు, అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకాలు అందించబడతాయనీ హామి ఇచ్చారు.

# సింగరేణి గ్రీన్‌ఎనర్జీ లిమిటెడ్

## సింగరేణి గ్లోబల్ లిమిటెడ్

## అనుబంధ పేర్ల రిజర్వు

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా గ్రీన్ ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ రంగంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో రెండు కొత్త అనుబంధ సంస్థల ఏర్పాటుకు పేర్లను రిజర్వు చేయిం చింది. దేశ విదేశాల్లో చేపట్టనున్న సోలార్ విద్యుత్తు తదితర పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్ల నిర్వహణ కోసం సింగరేణి గ్రీన్ ఎనర్జీ కంపెనీ లిమిటెడ్ అనే పేరుతో ఒక అనుబంధ సంస్థ పేరును, అలాగే విదేశాలలో ఖనిజాల తవ్వకం ముఖ్యంగా కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ తదితర వ్యాపారాల నిర్వహణ కోసం సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ అనే పేరుతో మరొక అనుబంధ సంస్థ రిజర్వు చేయించడం జరిగింది. గత నెలలో ఈ రెండు అనుబంధ కంపెనీల పేర్ల కోసం మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ కు అనుబంధంగా ఉన్న రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ లో దరఖాస్తు చేయగా ఇటీవల ఈ రెండు పేర్ల రిజర్వేషన్ కు అనుమతిని మంజూరు చేస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు ఒక లేఖ ద్వారా తెలియజేశారు. కాగా ఈ రెండు కొత్త అనుబంధ సంస్థల ఏర్పాటుపై కేంద్ర బొగ్గు శాఖ కూడా సానుకూలంగా స్పందించింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అండర్ సెక్రెటరీ ప్రదీప్ రాజ్ నయన్ సింగరేణి సంస్థకు లేఖ రాస్తూ రెండు అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసుకుంటున్న విషయాన్ని గుర్తిస్తున్నామని, ఆ సంస్థలు లాభదాయకంగా వ్యాపారాలు కొనసాగించాలని సూచిస్తున్నట్లు పేర్కొన్నారు.

# 'గోవిందకోటి'పై మరింత విస్తృత ప్రచారం

## కోటినామాలు రాస్తే విఐపి బ్రేక్ దర్శనం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందూ ధర్మాన్ని చిన్నతనంనుండే యువతలో అవగాహన కల్పించడంతోబాటు భక్తిభావం పెంపొందించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. రామకోటి తరహాలో 25ఏళ్ళలోపు యువత "గోవిందకోటి"రాస్తే ఆ భక్తుడితోబాటు ,వారి కుటుంబసభ్యులు ఐదుగురికి విఐపి బ్రేక్ దర్శనం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఈ విధానం 2023 సెప్టెంబర్‌లో అప్పటి టిటిడి



బోర్డు కూడా మంచి నిర్ణయం తీసు కుంది. ఈ నిర్ణయాన్ని అమలుచేస్తూ అప్పట్లోనే టిటిడి ప్రత్యేక పుస్తకాలు ముద్రించి భక్తులకు అందు బాటులోకి తీసుకు వచ్చింది. ఆ తరువాత 2024 మేలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, టిటిడి నూతన ట్రస్టుబోర్డు ఏర్పాటుతో కొద్దిరోజులు ఈ విషయంపై తర్జనభర్జనలు పడ్డారు. చివరకు హిందూ సనాతన ధర్మవ్యాప్తికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న "గోవిందకోటి" రాయ డం వల్ల యువతలో భక్తిభావం పెంపొందిం పజేసేందుకు అవకాశం కల్పించేలా ఉంటుందని భావించారు. 25ఏళ్ళ లోపు యువత "గోవిం దకోటి"రాస్తే వారి కుటుంబస భ్యు లకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించనున్నారు. 10,01,116 సార్లు గోవిందనామాలు రాసిన భక్తు లకుస్వామి వారి దర్శనం కల్పించేలా చూస్తున్నారు.

# పరకామణి కేసు రాజీలో సూత్రధారులు టిటిడి పెద్దలేనా?

**తిరుపతి,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు కానుకలు లెక్కించే పరకామణి నుండి విదేశీ కరెన్సీ చోరీ కేసు, తదనంతరం లోక్‌అదాలత్‌లో రాజీజరగడం వంటి కీలక పరిణామాల వెనుక గత టిటిడి పెద్దలు ఉన్నారనే బలమైన ఆరోపణలు ఇప్పుడు గుప్పుమంటున్నాయి. ఇందుకు శనివారం ముద్దాయి రవికుమార్ స్వయంగా ఈ కేసుపై నోరువిప్పి మహాపాపం చేశానని, పెద్దతప్పేనని వీడియో విడుదల చేయడం సంచలనంగా మారింది. ఇప్పటివరకు అన్ని కోణాల్లో అందరినీ విచారణ చేసిన సిఐడి పూర్తిస్థాయిలో దర్యాప్తు వివరాలను హైకోర్టు ధర్మాసనంకు సమర్పిం చింది. ఈ నివేదికల్లో ఎలాంటి వివరాలు ఇచ్చా రనేది అందరిలోనూ ఆందోళనకరమైన అంశం. సిఐడి అధికారులు దర్యాప్తుచేపట్టిన 26రోజుల వరకు అటు రవికుమార్‌గానీ ఇటు కొందరు రాజకీయనేతలు వ్యాఖ్యలు చేయలేదు. కేసు చివరిదశకు చేరుకోవడంతో ఇప్పుడు ఏం జరగనుందనే ఆందోళనతో స్వయం వ్యాఖ్యలు ఎవరికీ నష్టం కలిగిస్తాయనేది మాత్రం చర్చమొ దలైంది. పరకామణిలో చోరీ జరగడం తదనం తరం చోటుచేసుకున్న పూర్తి పరిణామాలపై మాజీ టిటిడి పెద్దలతోబాటు టిటిడి మాజీ ఉన్నతాధికారిని, కొందరు పోలీస్ అధికారులను విచారణ చేశారు.ఈ తతంగం మొత్తం గత పెద్దల ఆదేశాలతోనే జరిగిందనేది టిటిడి వర్గాల్లో వాదనలు. రవికుమార్‌కు సంబంధించిన ఆస్తులు ,వాటి అంచనాలు వంటి విషయాలను సిఐడి రాబట్టింది.72వేల రూపాయలు విలువైన దేవుని సొమ్మునుచోరీ చేస్తే 14కోట్ల రూపాయలు విలు వైన ఆస్తులను నేరస్తుడి నుండి వేంకటేశ్వ రస్వా మికివిరాళంగా స్వీకరించడం ఆషామాషీకాదనేది ఇప్పుడు చర్చకు దారితీసింది. మరీ ఈ కేసులో తదుపరి హైకోర్టు ధర్మాసనం ఆదేశాల మేరకు ఏంజరగనుందనేది ఉత్కంఠగా మారింది.



పిఎబిఆర్ కుడికాలువకు గండిపడటంతో నీట మునిగిన పంట పొలాలు

# పిఎబిఆర్ కుడికాలువకు భారీ గండి

**ఉరవకొండ, డిసెంబరు 7 ప్రభాతవార్త:** ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం జల్లిపల్లి గ్రామంవద్ద పిఎబిఆర్ కుడి కాలువకు 4.20 కిలో మీటరువద్ద భారీ గండి పడింది. ఆదివారం తెల్లవారు జామున దాదాపు 2 గంటల సమయంలో కాలువ 20 మీటర్ల మేర తెగిపోవడంతో పక్కనేగల దాదాపు 40 ఎకరాల్లో పంట పొలాల్లోని పంటలు నీటి ఉద్ధృతికి కొట్టుకుపోగా, మరిన్ని పొలాలు నీట మునిగాయి. ఫలితంగా దాదాపు కోటి రూపాయలు మేర రైతులకు ఆస్తినష్టం సంభవించింది. ఇదివరకే ఒకటి రెండు సార్లు గండిపడిన చోటే మరోకమారు గండి పడటం విశేషంగా చెప్పాలి. వివరాల్లోకి వెళితే... కూడేరు మండలంలోని 42 చెరువులను నింపడానికిగాను పిఎబిఆర్ కుడి కాలువకు దాదాపు వారం రోజుల క్రితం నుండి నీటిని విడుదల చేస్తున్నట్లు సమాచారం. అయితే కాలుకు నీటిని విడుదల చేసే గేటు తప్పుపట్టి పోవడంతో దాని నిర్వహణ కష్టతరంగా మారినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కాలువకు భారీ గండి పడింది. దీంతో కాలువ దాదాపు 20 మీటర్ల మేర కోతకు గురై నీరు మొత్తం కాలువ పక్కనగల బోర్లు, బావుల కింద సాగులోవున్న వరి, వేరుశెనగ, కంది, కొంత మేర మిరప పంట పొలాలను ముంచెత్తింది. ఇదివరకే 20 ఎకరాల్లో వరి పంట కోతలు జరుగగా ఆ పంట మొత్తం కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. నీటి ఉద్ధృతికి పంట భూములు రెండు, మూడు మీటర్ల మేర కోతకు గురై పొలాల్లోకి బంకమట్టి, రాళ్లు గుండ్లు చేరాయి. అంతే కాకుండా బోర్లు మునిగిపోగా పైపులు కొట్టుకుపోయి బావులు పూడిపోయాయి. చేతికందిన పంట నోటి కందకుండా పోయిందని దీంతో దాదాపు కోటి రూపాయల మేర పంట నష్టం జరిగిందని బాధిత రైతులు నరేష్, రామాంజినేయులు, లాలెప్ప, చిన్న ఎర్రిస్వామి, అనీల్ తదితరులు చెబుతున్నారు. కోతకు గురైన పంట పొలాలను బాగు చేసుకోవ డానికి కూడా భారీగా మళ్లీ పెట్టుబడి పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పుడు గండిపడిన చోటే గత ఏడాది కాలువకు గండిపడినా అధికారులు సరైన రీతిలో గండి పూడ్చివేత చేపట్టలేదని కేవలం ఇసుక బస్తాలు అడ్డుపెట్టి చేతులు దులుపుకున్నారని చెబుతున్నారు. నాడే శాశ్వత ప్రాతిపదిక కాలువకు గండి పూడ్చి ఉంటే నేడు మరొకమారు గండిపడేది కాదని అంటున్నారు. కాగా గండి పడిన ప్రదేశాన్ని కూడేరు మండల ఇంచార్జ్ తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా సిబ్బందితో కలిసి పరిశీలించారు. గండి పడటంతో పంటలకు జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనా వేశారు. గండి పూడ్చివేతపై సంబంధితశాఖ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఘటనపై సమగ్ర సమాచారంతో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

**పిఎబిఆర్ కుడి కాలువ గండి పూడ్చేందుకు**

**తక్షణం చర్యలు చేపట్టండి: మంత్రి పయ్యావుల కేశవ్**

గండిని పూడ్చివేయడానికి అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. పిఎబిఆర్ కుడి కాలువకు పడిన గండి విషయం తెలిసిన వెంటనే ఆయన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గండిని పూడ్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని, గండి పడిన ప్రాంతంవద్ద శాండ్ బ్యాగులు ఏర్పాటు చేసి నీరు వృథాగా పోకుండా చూడాలని ఆదేశించారు.

# వచ్చే యేడాది అందుబాటులోకి రానున్న విమాన కార్గో సేవలు

## హ్యాండ్ పద్ధతిలో రూ.11,399 కోట్లతో 419 రోడ్ల అభివృద్ధి

## రెండేళ్ల ప్రగతిని నివేదికలో వెల్లడించిన రోడ్లు భవనాల శాఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారులుభవనాల శాఖ పరిధిలో రెండేళ్ల పురోగతిపై ఓ నివేదికను విడుదల చేసింది. దీనిలో తెలంగాణలో కొత్త విమానాశ్రయాలు, రోప్‌వేలకు మార్గం సుగమమైందని వరంగల్, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాలను ప్రయాణి కులకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వం పేర్కొంది. వచ్చే ఏడాది వరంగల్ విమానాశ్రయం నుంచి కార్గో సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించింది.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047 నేపథ్యంలో రహదారులు భవనాల శాఖ పరిధిలో రెండేళ్ల పురోగతిపై విడుదల చేసిన నివేదికలో ప్రభుత్వం పలు అంశాలను వివరించింది. యాదగిరిగుట్ట, నల్గొండలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్, మంథని రామగిరి కోటకు రోప్‌వేలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవు తున్నాయి. వీటితో పాటు కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో సరకు రవాణాలో వేగం పెరిగి, లాజిస్టిక్ ఖర్చులు తగ్గుతాయని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణ రైజింగ్2047 ప్రణాళికకు అనుగుణంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.60,799 కోట్లతో ప్రకటించిన భారీ ప్రాజెక్టులు అభివృద్ధికి ఊతమిస్తాయని పేర్కొంది. మిర్రర్ స్మార్ట్ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించి నట్లు తెలిపింది. హ్యామ్ పద్ధతిలో 419 రోడ్లను రూ.11,399 కోట్లతో 32 ప్యాకేజీలుగా అభివృద్ధి చేయనున్నామని వెల్లడించింది. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదా రిపై ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లను సరిదిద్దేందుకు రూ.288 కోట్లతో చేపట్టనున్న పనులు ఆమోదం పొందాయి.

సుమారు రూ.10,400 కోట్లతో ఆరు వరుసల రహదారి నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమవుతోంది. ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టుకు రూ.36వేల కోట్ల వ్యయమవుతుందని అంచనా వేస్తున్నాం.

హైదరాబాద్- అమరావతి- మచిలీపట్నం రహదారి ఎలైన్‌మెంట్ నిర్ధారణకు డీపీఆర్ తయారు చేసేందుకు కన్సల్టెంట్ సంస్థ ఎంపికకు టెండర్లు పిలిచినట్లు పేర్కొంది. హైదరాబాద్- శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు రూ.8వేల కోట్లతో కొత్త కారిడార్ నిర్మాణం చేపట్టనున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6,617.86 కోట్ల విలువైన 239 పనులకు అనుమతులు ఇచ్చాం. వీటిలో 1,659 కిలోమీటర్ల రహదారులు, 62 వంతెనలు ఉన్నాయి.

వచ్చే ఏడాది రాష్ట్రంలో జరిగే ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు ద్వారా కీలక రంగాల్లో పెట్టుబడులు సమకూరడంతో పాటు అభివృద్ధికి బాటలు పడతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

రహదారులు భవనాల శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గత రెండేళ్లలో పెద్దఎత్తున పదోన్నతులు కల్పించాం. ఒకే రోజు 118 మంది ఏఈలకు డీఈలుగా, 64 మంది డీఈలకు ఈఈలుగా ప్రమోషన్లు కల్పించామని పేర్కొం ది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా రెండేళ్లలో సుమారు రూ.7 వేల కోట్ల వ్యయంతో కోటి చదరపు అడుగులకుపైగా విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టాం. హై కోర్టు భవన సముదాయం, ఆసుపత్రులు, వైద్య కళాశా లల నిర్మాణాలను కొత్త యేడాదిలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.

# డిప్యూటీ స్పీకర్ నియామకం ఇంకెప్పుడు?

## హౌస్ కమిటీలను వెంటనే నియామకం చేయాలి

## ఎమ్మెల్యేల అనర్హతలపై వెంటనే నిర్ణయం తీసుకోవాలి

## స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** రెండేళ్ల కాలంలో అసెంబ్లీ నిర్వహణలో తీవ్ర మైన వైఫల్యాలు చోటుచేసుకున్నాయని, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని బిఆర్ఎస్ సీనియర్ నేత,సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ లేఖ రాశారు. శాసనసభ పనిదినాలు గణనీయంగా తగ్గిపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. రూల్ 12 ప్రకారం సభా కార్యకలాపాలకు అవసరమైనన్ని రోజులు సభను నిర్వహించాల్సి ఉన్నా, అది జరగడం లేదని పేర్కొన్నారు. అలాగే, సరైన కారణాలు లేకుండా సభను తరచుగా, హఠాత్తుగా వాయిదా వేయడం సభా సమయానికి సంబంధించిన రూల్ 13 తోపాటు వాయిదా పద్ధతులకు సంబంధించిన రూల్ 16 లకు విరుద్ధమని తెలిపారు. సభలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సభ్యులకు ఉన్న ప్రధాన క్వశ్చన్ అవర్, జీరో అవర్ నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘి స్తున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రూల్స్ 38 నుంచి 52, అదేవిధంగా రూల్స్ 53 నుంచి 62 వరకు ఉన్న నిబంధనలను పాటించడం లేదని అన్నారు. సభలో మంత్రుల నుంచి నేరుగా సమాధానం వచ్చే స్టార్డ్ క్వశ్చన్స్ చర్చకు రాకుండా చేస్తు న్నారని, తద్వారా రూల్ 38 కల్పించిన ప్రశ్నల సమయ హక్కును కాలరాస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఒక ప్రశ్నకు సంబంధించి లోతుగా చర్చించేందుకు, ప్రభుత్వం నుండి స్పష్టత తీసుకునేందుకు సభ్యులకు ఉండే సప్లిమెంటరీ క్వశ్చన్స్ అవకాశాన్ని నిరాకరించడం, కుదించడం రూల్ 50 ప్రధాన ఉద్దేశానికి విఘాతం కలిగించడమేనని అన్నారు. ప్రజా సమస్యలను తక్షణమే ప్రస్తావించే జీరో అవర్‌ను కూడా ప్రతిసారి కుదించడం సభా హక్కులను దెబ్బతీయడమేనని స్పష్టం చేశారు.

అంతేకాకుండా అన్ స్టార్డ్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకపోవడం.. రూల్ 39 ప్రకారం వీటికి లి ఖితపూర్వక సమాధానాలు సభలో ప్రవేశపెట్టాలి. అలాగే రూల్ 41 ప్రకారం నిర్ణీత గడువులోగా సభ్యులకు ఆ సమాధానాలు అందజేయాలి. కానీ ఈ నిబంధనలను పాటించకపోవడం వల్ల సభ జవాబుదారీతనం లోపించిందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా అసెంబ్లీలో హౌస్ కమిటీలను ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమని హరీశ్‌రావు అన్నారు.

అసెంబ్లీ నిబంధనల ప్రకారం (రూల్ 196, 198) కమిటీలను కచ్చితంగా నియమిం చాల్సి ఉన్నా, ప్రభుత్వం ఆ పని చేయడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసినా, కమిటీల పని మాత్రం ఆగకూడదని రూల్ 227 స్పష్టంగా చెబుతోందని, కానీ అసలు కమిటీలే లేకపోవడం వల్ల ప్రభుత్వ పనితీరుపై పర్యవేక్షణే లేకుండా పోయిందని ఆయన తెలిపారు.

అలాగే, ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ రాజీనామా చేసినప్పటికీ, ఆ కమిటీని తిరిగి ఏర్పాటు చేయలేదని గుర్తుచేశారు. కమిటీల పని ఎప్పుడూ ఆగకూడదని, సమావేశాలకు సరిపడా సభ్యులు ఉండాలని రూల్స్ 199,201 చెబుతున్నా.. వీటిని పట్టించుకోకపోవడం వల్ల కమిటీల వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ స్పీకర్ నియామకం జరగకపోవడం మరో ప్రధాన ఉల్లంఘన. రూల్ 8 ప్రకారం డిప్యూటీ స్పీకర్‌ను తప్పనిసరిగా ఎన్నుకోవాల్సి ఉంటుంది. సభలో సభ్యుల హక్కులను పరిరక్షి ంచే ప్రివిలేజ్ కమిటీకి డిప్యూటీ స్పీకరే చైర్మన్‌గా వ్యవహరిస్తారు కాబట్టి, ఆ పదవి ఖాళీగా ఉండటం వల్ల కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందన్నారు. ఫలితంగా, సభ్యుల హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అనేక ఫిర్యాదులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, ఇది రూల్ 256 అండ్ 257లకు విరుద్ధమని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోవడమే అత్యంత ఆందోళనకరమైన విషయమని హరీష్‌రావు అసహనం వ్యక్తం చేశారు. శాసనసభ (ఫిరాయింపుల నిరోధక) నిబంధనలు1986, ముఖ్యంగా రూల్స్ 3 నుండి 7 ప్రకారం.. విచారణ జరిపి, నోటీసులు జారీ చేసి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా.. తీసుకోకపోవడం శోచనీయం. ఇది రాజ్యాంగం లోని ఆర్టికల్ 191(2) కు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు. గతంలో మణిపూర్ రాష్ట్రానికి చెందిన కైశం మేఘచంద్ర సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# 13 యేళ్లు దాటిన వాహనాల ఫిట్‌నెస్ ఫీజు తగ్గించకుంటే రవాణా బంద్

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం 13 ఏళ్ళు దాటిన వాహనాలకు టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులను పెంచుతూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ నిలిపివేయాలని ఏపీ లారీ యాజమానుల సంఘం డిమాండ్ చేసింది. లేదంటే ఈ నెల9 తేది అర్ధరాత్రి నుంచి రైల్వే షెడ్లు, షిప్ యార్డుల్లో గూడ్స్ రవాణా నిలిపివేయాలని నిర్ణయించింది. 13 ఏళ్ళు దాటిన వాహనాల ఫిట్‌నెస్ ఫీజు కేంద్రం భారీగానే పెంచిందని లారీ యాజమానుల సంఘం నాయకులు వెల్ల డించారు. పాత వాహనాలపై టెస్టింగ్, ఫిట్ నెస్ ఛార్జీలు ఇంత అధిక మొత్తంలో పెంచడం సరికాదన్నారు. ఈ నోటిఫికేషన్ నిలిపివేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. సీఎం వెంటనే ఈ విషయంలో తక్షణం ఒక నిర్ణయం రెండు రోజుల్లో తీసుకోవాలని, లేని పక్షంలో గూడ్స్ వాహనాలకు వీఎల్‌టీడీలు అవసరం లేదన్నారు. మాపై భారం పడకుండా కేంద్రం, రాష్ట్రం చూడాలన్నారు. ఈ విషయం సీఎం సానుకూల రీతిలో స్పందిస్తారని భావిస్తున్నట్లు లారీ యాజ మాన్య సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేసారు.

# కోర్టు ధిక్కార కేసు..'సుప్రీం'ను ఆశ్రయించనున్న ఎయు మాజీ విసి

**విజయవాడ, డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు దిక్కార కేసులో సుప్రీం కోర్టుకు అప్పిల్‌కు వెళ్ళాలని ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వ ఉపసంచాలకులు ప్రసాదరెడ్డి ఆశ్రయిం చనున్నారు. న్యాయవాదుల సమాచారాన్ని అనుసరించి ఆయన హైకోర్టు అప్పిల్‌కు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదుల సహకారంతో ప్రయత్నిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించినందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి (వీసీ) ప్రసాదరెడ్డిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టుధిక్కరణ కేసులో ఆయనకు నెలరోజుల సాధారణ జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధించింది. కోర్టు ఉత్తర్వులు అంటే ప్రసాదరెడ్డికి లెక్కలేదని, విచారణ సందర్భంగా సొంత తెలివితేటలు వాడుతూ, మొండి వైఖరి అవలంబించారని తీవ్రంగా ఆక్షేపించింది. కోర్టు ఆదేశాలను వరుసగా ఉల్లంఘించారని, ఇలాంటి వ్యవహార శైలి న్యాయ పరిపాలనకు తీవ్ర నష్టమని తెలిపింది. కోర్టు ఆదేశాలు అంటే ఆయనకు గౌరవం తక్కువ అని వెల్లడించింది. వీసీ బాధ్యతల నుంచి వైదొలిగేంత వరకు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని పేర్కొంది. కొత్త వీసీ వచ్చాక కోర్టు ఉత్తర్వులను అమలు చేశారని తెలిపింది. ఇలాంటి వ్యక్తిపై కనికరం చూపితే న్యాయవ్యవస్థకు నష్టమని వ్యాఖ్యానించింది. జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించాక ప్రసాదరెడ్డి తరఫు న్యాయవాది అప్పీల్ దాఖలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును సస్పెండ్ చేయాలని కోరారు. అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తూ 6 వారాలు సస్పెండ్ చేశారు. అప్పీల్ దాఖలు చేయకపోయినా, దాఖలు చేసిన అప్పీల్లో స్టే రాకపోయినా ఈనెల 22న సాయంత్రం 5 గంటలలోపు హైకోర్టు రిజిస్ట్రార్ వద్ద లొంగిపోవాలని ప్రసాదరెడ్డిని ఆదేశించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

ఏయూ సైన్స్, టెక్నాలజీ కళాశాల బోటనీ విభాగంలో బోధనా సిబ్బందిగా నూకన్నదొర 2006 జులైలో నియమితులు అయ్యారు. ఆ తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒప్పందం పద్ధతి పై కొనసాగారు. 17 ఏళ్ల పాటు సేవలు అందించారు. నూకన్నదొరను విధుల నుంచి తొలగిస్తూ ఏయూ వీసీ 2022 నవంబర్ 18న ఉత్తర్వులు ఇచ్చారు. 2022 మే నుంచి చెల్లించాల్సిన జీతం బకాయిలను నిలిపేశారు. తనను విధుల నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ నూకన్నదొర 2023లో హైకోర్టులో పిటిషన్ వేశారు. 2023 మార్చి 7న విచారణ జరిపిన న్యాయమూర్తి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పిటిషనర్‌ను కొనసాగించాలని నిర్దిష్ట కాలానికి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో అప్పటి వీసీ ప్రసాదరెడ్డిపై నూకన్నదొర హైకోర్టులో కోర్టుధిక్కరణ కేసు దాఖలు చేశారు. ఇటీవల ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి ఉద్దేశపూర్వకంగా ప్రసాదరెడ్డి కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని తేల్చారు. జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఈ ఏడాది నవంబర్ 20న తీర్పు ఇచ్చారు. తీర్పు ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది. ఒకసారి కోర్టు ఉత్తర్వులు ఇచ్చాక దానిని యథాతథంగా అమలు చేయడమే అధికారుల విధి అని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ఉత్తర్వులు చట్ట విరుద్ధంగా ఉన్నాయని భావిస్తే అప్పీల్ దాఖలు చేసుకోవచ్చని, అంతే తప్ప కోర్టు ఉత్తర్వులకు విభిన్న అర్థం చెప్పడానికి వీల్లేదన్నారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సరైనవా? కాదా? అనే విషయాన్ని కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో తేల్చలేరని, ఆ ఉత్తర్వులకు కట్టుబడి వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఈ పరిణామాల నడుమ ప్రసాదరెడ్డి సుప్రీం కోర్టుకు అప్పిల్ దాఖలు చేస్తున్నారు.

# నిధులు లేవు, సంక్షేమమూ లేదు..

## రెండేళ్లుగా స్తంభించిన పథకాల అమలు

## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తును ఆదుకోవాలని డా. కె.వి.రమణాచారి

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రెండు సంవత్సరాలు గా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కార్యకలాపాలు స్తంభించి పోయి బ్రాహ్మణులంతా విలవిలలాడి పోతున్నారని, కేవలం ఆర్థిక వనరులేకాక ఎలాంటి కార్యకలా పాలు జరగక అసలు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఉన్నట్లా... లేనట్లానని తెలంగాణ బ్రాహ్మణులు, బ్రాహ్మణ సంఘాలు అయోమయంలో కొట్టుమిట్టాడు తున్నాయని పరిషత్తు మాజీ చైర్మన్, విశ్రాంత ఐఎఎస్ డా. కె.వి.రమణాచారి అన్నారు.



తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కట్టుబడుతూ 2017 ఫిబ్రవరి 1న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగిందని, 2023 సంవత్సరాంతం వరకు మూడుపూవులు ఆరుకాయలుగా వర్ధిల్లిందని ఆయన గుర్తుచేశారు. వివిధ బ్రాహ్మణ సంఘాలవారు ముఖ్య మంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రిని, ఏకైక బ్రాహ్మణ మంత్రి డి.శ్రీధర్‌బాబును కలిసి వందలసార్లు విన్నవించు కున్నా ఫలితం శూన్య మని వాపోయారు. గత రెండేళ్లుగా పరిషత్తుకు కమిటీ లేక, అధ్యక్షుడుని నియమించక కార్య కలాపాలన్నీ స్తంభించి పోవడంతో పరిషత్తు ఉనికి కోల్పోయింద న్నా రు. గత ఐదారేళ్లుగా పరిషత్తు వల్ల ఒనగూరిన ప్రయో జనాలు దృష్టిలో పెట్టుకుని గత రెండేళ్లుగా ఎలాంటి ఆర్థిక సహకారం లేనందువల్ల పరిషత్తు నామా వశిష్టమైందని విచా రాన్ని వ్యక్తపరిచారు. వివిధ బ్రాహ్మణ సంఘాల అభ్యర్థనమేరకు కంటి తుడుపుగా దాదాపు రెండునెలలక్రితం 28కోట్లు విడుదల చేశారని ప్రభుత్వ పెద్దలు పేర్కొంటున్నా అది ఏమూలకూ సరిపోదని రమణాచారి పెదవి విరిచారు.

వివేకానంద విదేశీ పథకం కింద 300 పైచిలుకు విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తులు పెట్టుకుంటే వాటిని చూసే నాథుడేలేడు... ఎలాంటి చర్యలూ లేవన్నారు. ప్రభుత్వం సహకరిస్తుందన్న నమ్మకంతో కొంతమంది విదేశాలకూ వెళ్లి అలోలక్షణాని ఆక్రోశిస్తున్నారని అన్నారు. బెస్ట్ పథకం కింద 12 లక్షల లబ్ధిపొందే కార్యకలా పాలన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, దాదాపు 2వేల దరఖాస్తులు రెండేళ్లుగా దిక్కుమొక్కూ లేకుండా ఉన్నాయన్నారు.

ఆఖరికి కంచికామకోటి పీఠాధిపతి శంకర జయేంద్ర సరస్వతి స్వామివారి ఆధ్వర్యంలో వందమంది విద్యార్థులతో బ్రాహ్మణ సదనంలో నిర్వహించ బడుతున్న సంప్రదాయ పాఠశాలలో వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని చెప్పారు. ఇప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మరోసారి విన్నపమేమంటే వచ్చే సంవత్సరం జనవరి 26వ తేదీలోగా పరిషత్తు గురించి పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్త వివిధ బ్రాహ్మణ సంఘాలతో కలిసి సచివా లయంలో ముఖ్యమంత్రి కలుసుకోవాలని ఇటీవల జరిగిన బ్రాహ్మణుల సదస్సులో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

ఇప్పటికైనా బ్రాహ్మణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధవహించి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుంటారని ఆశిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు పూర్వా ధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి పేర్కొన్నా రు. ఒక వైపు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లపాలన పూర్త యిన సందర్భంగా నిర్వహించుకొంటున్న ఈ విజ యోత్సవం సందర్భంలోనైనా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కార్యకలాపాలను యదావిధిగా పునః ప్రా రంభిస్తామని ముఖ్యమంత్రి ప్రకటిస్తారని తనతో పాటు బ్రాహ్మణులు ఆశిస్తున్నట్లు తెలిపారు.

# మమత ఓటమే లక్ష్యంగా వచ్చే ఎన్నికల్లో పనిచేస్తాం

## ఒవైసీ మజ్లిస్‌తో కలిసి రాష్ట్రంలో అన్నింటా పోటీలో ఉంటాం!




**కోల్‌కతా, డిసెంబరు 7:** పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో బాబ్రీ మసీదు తరహాలో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన టీఎంసీ సస్పెండెడ్ ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ని వచ్చేఏడాది ఎన్నికల్లో నాలుగోసారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి రాకుండా చేస్తామని హెచ్చరించారు. తృణమూల్ ముస్లిం ఓటు బ్యాంకు ముగిసిపోతుందని అన్నారు. పిక్చర్ అభి బాకీ హై అంటూ కామెంట్స్ చేశారు. బెల్డాంగాలో ప్రతిపాదిత బాబ్రీ మసీదుకు కబీర్ శంకుస్థాపన చేశారు. ఆయన నుంచి బాబ్రీ మసీదు ప్రకటన వెలువడగానే పార్టీ నుంచి కబీర్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు టీఎంసీ ప్రకటించింది. కాగా, డిసెంబర్ 22న కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు కబీర్ తాజాగా ప్రకటించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఏఐఎంఐఎం పార్టీతో పొత్తుకు ప్రయత్నిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది జరుగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను 135 చోట్ల తమ అభ్యర్థులను నిలబెడతామని కబీర్ తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ పార్టీ గేమ్ ఛేంజర్ కానుందని చెప్పారు. ముస్లింల కోసం తమ పార్టీ పనిచేస్తుందని, ఐఏఎంఐఎంతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని, ఆ పార్టీతో టచ్‌లో ఉన్నామని తెలిపారు. కాగా, దీనిపై ఏఐఎంఐఎం కానీ, ఒవైసీ కానీ ఇంకా స్పందించలేదు. బెంగాల్‌లో బీజేపీని అధికారంలోకి రానీయమని, టీఎంసీ సైతం వచ్చే ఏడాది ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని కబీర్ చెప్పారు. బాబ్రీ మసీదు తరహాలో మసీదు నిర్మాణంపై మాట్లా డుతూ, దేశంలోని పలు పారిశ్రామిక సంస్థలు తనకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇండియాలోని ముస్లింల వద్ద చాలా నిధులున్నాయని, బాబ్రీ నిర్మాణానికి వారు సాయం అందించనున్నారని చెప్పారు. మసీదు నిర్మాణం మత ఉద్రిక్తతలను పెంచే ప్రయత్నంగా బీజేపీ విమర్శిస్తుండగా, తాము సెక్యులర్ సిద్ధాంతాలను విశ్వసిస్తామని కబీర్ తెలిపారు. కబీర్ ఫౌండేషన్ బాబ్రీ మసీదు ఈవెంట్‌కు 8 లక్షల మంది హాజరైనట్టు ఆయన చెప్పారు. ఇటుకలు, నగదు రూపంలో విరాళాలు వెల్లువెత్తుతున్నట్టు వెల్లడిం చారు. పశ్చి మబెంగాల్‌లో మమతా బెనర్జీ టీఎంసీకి ముస్లింలు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నారు. మరోవైపు రాష్ట్రంలో బలంగా వేళ్లూనుకోవాలని బీజేపీ పట్టుదలగా ఉంది. 2021 ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనంత బలీయమైన శక్తిగా బీజేపీ నిలిచింది. అయితే ప్రతికూలతలు ఉన్నప్పటికీ 2021 ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో తృణమూల్ గెలిచింది.

# ఎపిలో రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగాచిరుధాన్యాలు

**విజయవాడ,డిసెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక పౌరసరఫరాల శాఖ దుకా ణాలద్వారా తృణధాన్యాలను ఉచితంగా అందిం చనున్నది., ప్రజల ఆరోగ్యం, మారు తున్న ఆహార అలవాట్లను దృష్టిలో పెట్టుకుని పేద ప్రజలకు పోషక విలువలు కలిగిన తృణ ధాన్యాలను ఉచితంగానే సరఫరా చేస్తోంది. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డుదారులకు రాగులు, రాగిపిండిని ప్యాకెట్ల రూపంలో పంపిణీ చేసింది. ఇప్పుడు మళ్లీ టిడిపికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ సరుకుల్లో తృణ ధాన్యాలను అందించాలని నిర్ణయించింది. రేషన్‌దుకాణాల ద్వారా ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో జొన్నల పంపిణీని ప్రారంభించింది. ప్రతి మనిషికి ఐదు కేజీల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది.

ఈ రేషన్లో కొంతమేర బియ్యానికి బదులుగా గరిష్ఠంగా మూడు కేజీలవరకు రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ప్రతి నెలా 20కేజీల రేషన్ బియ్యం తీసుకునే కుటుంబం.. ఇప్పుడు రెండు కేజీల రాగులు మాత్రమేకావాలనుకుంటే..ఆ మేరకు బియ్యాన్ని మినహాయించుకుని మిగిలిన 18కేజీల బియ్యాన్ని, రెండు కేజీల రాగులను అందిస్తారు. జాతీయ ఆహార భద్రత పథ కంలోభాగంగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా రాష్ట్రంలో పీడీఎస్ అవసరాలకు సరి పడా రాగులు,జొన్నలను కేటాయించేది. ఇప్పుడు కేంద్రం కేటాయించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే టెండరు ప్రక్రియ ద్వారా సేకరించి ఉచితంగా సరఫరా చేస్తోంది.



# ఆఫ్రికన్ దేశం బెనిన్‌లో సైనిక తిరుగుబాటు!

**పోర్టోనోవో (బెనిన్), డిసెంబరు 7:** పశ్చిమాఫ్రికాలోని అనేక దేశాల్లో తిరుగుబాట్లు సర్వసాధారణం అయ్యాయి. ఇప్పుడు ఈజాబితాలో మరో ఆఫ్రికన్‌దేశం బెనిన్‌కూడాచేరింది. ఆదివారం దేశ సైనికుల బృందం అకస్మాత్తుగా అధికారిక టివిఛానెల్‌లోప్రత్యక్షం అయి ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మిలిటరీ కమిటీ ఫర్ రీఫౌండేషన్ అని ఆ సైనిక బృందం తమనుతాము చెప్పుకుంటూ దేశ అధ్యక్షుడిని, అన్ని రాజ్యాంగ సంస్థలను తొలగిస్తున్నట్లుప్రకటించింది. సైన్యం దేశానికి కొత్త అధిపతిగా లెఫ్టినెంట్ కల్నల్ పాస్కల్ టిగ్రిని నియమించింది. 1960లో ఫ్రాన్స్‌నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి బెనిన్ అనేక తిరుగుబాట్లను చవిచూసింది. వాస్తవానికి ఈ దేశంలో 1991నుంచి రాజకీయ స్థిరత్వం నెలకొంది. అధ్యక్షుడు ప్యాట్రిస్ టాలోన్ 2016 నుంచి అధికారంలో ఉన్నారు. ఆయన వచ్చే ఏడాది ఏప్రిల్‌లోపదవీవిరమణచేస్తారు. ప్రస్తుతం ఆయన వారసుడు మాజీ ఆర్థికమంత్రి రొమువాల్డ్ వడాగ్ని ఎన్నికల్లో ముందంజలో ఉన్నారు. ప్రతిపక్ష అభ్యర్థి రెనాడ్ అగ్బోజో తగినంత మద్దతు లేకపోవడంతో ఎన్నికల సంఘం ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది. గతనెలలోనే పార్లమెంటు అధ్యక్షపదవీకాలాన్ని ఐదునుంచి ఏడు సంవత్సరాలకు పొడిగించింది. అయితే బెనిన్‌లో జరిగిన తాజా తిరుగు బాటురాజకీయాల్లో ఒక ప్రధాన మలుపు అని రాజకీయ విశ్లేషకుల అంచనా. గతవారం కూడా గినియా బిస్సావులో సైనిక అధికార మార్పిడి జరిగింది.

# మీర్‌చౌక్ ఎసిపిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

### విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** పాతబస్తీలోని మీర్‌చౌక్ ఎసిపి శ్యాంసుందర్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ఉన్నతాధికారులు వి చారణకు ఆదేశించారని తెలిసింది. పాతబస్తీలోని నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన ఓ వివాహితకు ఆమె ఇంటి పక్కనే వున్న వారితో కార్ పార్కింగ్ విష యమై కొంతకాలంగా వివాదం వుంది. తన ఇంటిముందు కారును ఆపి, ఇబ్బందులకు గురిచేస్తున్న పొరుగింటి వారిపై సదరు మహిళ మీర్‌చౌక్ పో లీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని ఆమె ఏకంగా ఎసిపి శ్యాంసుందర్‌ను కలిసి న్యాయం చేయాలని వేడుకుంది. అయి తే ఈ విషయమై ఎసిపితో పాటు బాధిత మహిళ మధ్య ఏం జరిగిందనేది తెలియరాలేదు. బాధిత మహిళ మాత్రం ఎసిపి శ్యాంసుందర్ తనపట్ల అనుచితంగా ప్రవర్తించాడని, సెల్‌ఫోన్‌లో అసభ్యకరంగా మెసేజ్‌లు పంపాడని, ఒంటరిగా రమ్మని వీడియో కాల్ చేశాడని దక్షిణ మండల డిసిపి కిర ణ్ కారే సహా ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బాధిత మహిళకు ఎసిపికి మధ్య జరిగి న వివాదం అటుంచితే ఆ మహిళకు ఎసిపి శ్యాంసుందర్ నిజంగానే సెల్‌ఫోన్లో అసభ్యకరంగా మెసేజ్‌లు పంపినా, అను చితంగా మాట్లాడుతూ వీడియో కాల్ చేసినట్లు ఆధారాలు వుంటే ఆయనపై చర్య లు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనిపై ఒకటి,రెండు రోజుల్లో నిర్ణయం వెలు వడే వీలుంది. మరోవైపు ఎసిపి శ్యాంసుందర్ మాత్రం తాను అమాయ కుడి నని, తనపై ఆ మహిళ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఖండించారు.



### తెలంగాణ దశదిశను మార్చనున్న

# గ్లోబల్ సమ్మిట్

### ప్రపంచ ఉన్నత నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ

### గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌తో తెలంగాణ రాష్ట్రం దశ దిశ మారుతుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీర్‌ఖాన్‌పేట్‌లో జరుగుతున్న సమ్మిట్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రపంచ స్థాయి సమ్మేళనంతో ప్రపంచ నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ చేరుతుందని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్ల పాలన, 2047 లక్ష్యంగా సాగుతున్న ప్రణాళికలు తది తరాలకు ఊతమిచ్చేలా పెట్టుబడులు రానున్నాయని అన్నారు ఇప్పటికే దేశ విదే శాలకు చెందిన 150 మంది అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్‌లో పాల్గొన బోతున్నారని చెప్పారు రెండు రోజులపాటు జరిగే ఈ సమ్మేళనం కోసం విశేష రీతిలో ఏర్పాట్లు జరిగాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు

# పొగమంచుతో డివైడర్ ఢీకొని ఇద్దరు మృతి

### మరో ఇద్దరికి తీవ్రగాయాలు

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఆదివారం స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుకునేందుకు కారులో బయలుదేరిన నలుగురు యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలకు గురయ్యారు. లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటన ఎస్సై యుగేందర్ కథనం ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన శ్రీపతి వెంక టరెడ్డి కుమారుడు అశ్రిత్‌రెడ్డి (22), చెంగిచెర్లకు చెందిన సురేష్ కుమారుడు బాలాజీ మణికంఠ శివసాయిపటేల్ (22), శ్రీకాంత్, రాహుల్ స్నేహితులు. వీరు నలుగురు కలిసి కారులో మల్కాజ్‌గిరి నుంచి ఉప్పల్ వైపు క్రికెట్ ఆడేందుకు క్రికెట్ కిట్లతో కలిసి తెల్లవారుజామున ఐదున్నరప్రాంతంలో వెళుతున్నారు. ఈ క్రమంలో లాలాపేట్ మౌలాలి ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే పొగ మంచు కారణం గా కారు నడుపుతున్న యువకుడికి ఏమి కనిపించలేదు. దీంతో వేగంగా ఉన్న కారుతో డివైడర్‌ను వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా తీవ్ర గాయాలకు గురైన అశ్రిత్‌రెడ్డి, శివసాయిపటేల్ ఘటనాస్థలంలోనే మృతి చెందారు. వెనుక వైపు కూర్చున్న శ్రీకాంత్, రాహుల్‌కు తీవ్రగాయా లయ్యాయి. దీంతో స్థానికులతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన ఇద్దరిని గాంధీ ఆసుపత్రికి తరలించగా గాయాలకు గురైన శ్రీకాంత్, రాహుల్‌ను ఇతర హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




అశ్రిత్‌రెడ్డి(ఫైల్), శివసాయిపటేల్ (ఫైల్)

# ఇచ్చిన హామీలపై చర్చకు సిద్ధమా?

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్

### రైజింగ్ తెలంగాణ కాదు.. సింకింగ్ తెలంగాణ: ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), డిసెంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా వంచిస్తున్న కాంగ్రెస్‌ను గద్దె దింపేవరకు బిజెపి పోరాటం ఆగదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ప్రజావంచన పాలనను నిరసిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డికె అరుణ, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహే శ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ఎంఎల్‌సిలు సి.అంజిరెడ్డి, మల్కా కొమరయ్య, కర్ణాటక ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ధర్నానుద్దేసించి రామచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం తెలంగాణ భూములను వేలంవేసే పాలసీతో ముందుకు సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లఘుచర్ల వంటి ప్రాంతాల్లో ఫార్మాసిటీ పేరిట రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ కేవలం మత రాజకీయాలు చేస్తోందని, హిందూ దేవీదేవతలను పదే పదే అవమానిస్తూ, కోట్లాది హిందూ మనోభావాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను బీఆర్‌ఎస్ తన పదేండ్ల పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చిందని, బీఆర్‌ఎస్ పట్ల విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే, గులాబీ జెండా పోయి కాంగ్రెస్ జెండా వచ్చింది తప్ప దోపిడీలో, అవినీతిలో చివరకు పార్టీ ఫిరాయింపులలో కూడా ఏ విధమైన మార్పు రాలేదని విమర్శించారు. అనేక హామీలతో, అభయహస్తాలతో, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఏ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. పోలీసులను పెట్టుకుని, గ్రామాల్లో సభలు పెట్టుకుని తిరగటం కాదని, ఇచ్చిన హామీల అమలు మీద చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

ఎంపి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు కొత్తగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ అంటూ గ్లోబల్ సమ్మిట్ అనే కొత్త నాటకం మొదలు పెట్టారని విమర్శించారు. ఇది రైజింగ్ తెలంగాణ కాదని, మాఫియాల చేతిలో చిక్కుకున్న సింకింగ్ తెలంగాణ అని ధ్వజమెత్తారు. డికె అరుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధిని చూసి సర్పంచులను గెలిపియ్యమంటున్నారు కానీ, గ్రామాల్లో అభివృద్ధి కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతోందని స్పష్టం చేశారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేక రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో వచ్చేది బీజేపీ పాలనేనని ధీమా వ్యక్తం చేశారు.



ఆదివారం ధర్నా కార్యక్రమంలో రెండేళ్ల ప్రజావంచన పాలనలో కాంగ్రెస్ వైఫల్యాల చిట్టాను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపి లక్ష్మణ్ తదితరులు

# గ్లోబల్ సమ్మిట్‌కు అసాధారణ భద్రత

### విదేశీ ప్రముఖులు వస్తుండడంతో రంగంలోకి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు

### వెయ్యికిపైగా సిసి కెమెరాల ఏర్పాటు..

### అడుగడుగునా పోలీసుల మోహరింపు

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** నగర శివార్లలోని కందుకూర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు పోలీసు శాఖ అసాధారణ భద్రతను ఏర్పాటు చేసింది. విదేశీ ప్రముఖులతో పాటు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు వస్తున్న వేళ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వుండేందుకు గ్రే హౌండ్స్‌తో పాటు ఆక్టోపస్ బలగాలను రంగంలో దించా రు. గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో వెయ్యికి పైగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయగా అడుగడుగునా సాయుధ పోలీసులను పహారాగా మొహరించారు. రాష్ట్ర సర్కారు కొత్తగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ గ్లోబల్ సమ్మిట్‌కు పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ అంతర్జాతీయ వేడుక కోసం పోలీసు శాఖ నెల రోజుల నుంచి భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తుండడం తె లిసిందే. రాచకొండ కొత్వాల్ సుధీర్ బాబుతో పాటు ఇతర పౌర విభాగాల ఉన్నతాధికారులు అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండడం విది తమే. బందోబస్తు ఏర్పాట్లతో పాటు మౌలిక వసతుల ఏర్పాట్లను సిఎం రేవంత్ రెడ్డి సహా ఇతర మంత్రులు దగ్గరుండి పర్యవేక్షించడంతో పౌర, పో లీసు ఉన్నతాధికారులు కూడా వారివెంట వున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ పారిశ్రా మికవేత్తలతో పాటు పెట్టు బడిదారుల నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షిం చేందుకు ఈ వేదిక ఉపయోగించుకోవాలని భావిస్తున్న తరుణంలో సోమవారం నాటి మొదటి రోజు సదస్సులో అనేక మంది ప్రముఖులు పాల్గొననున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దీనిని ప్రారంభించనుండగా సిఎం రేవంత్ రెడ్డి సహా మ



ంత్రులు, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల సిఎంలు, ప్రముఖులు హాజరు కానున్నారు. సమ్మిట్‌లో పాల్గొనాలని ఆయా రంగాలకు చెందిన ప్రముఖుల ను ప్రభుత్వం ఆహ్వానించడంతో వారంతా సోమవారం రానున్నారని తెలిసింది. వందల సంఖ్యలో ప్రముఖులు, వేల సంఖ్యలో ఇతరులు రానుండడ ంతో బందోబస్తులో ఎక్కడా తేడా రాకుండా పోలీసు శాఖ జాగ్రత్తలు చేబట్టింది. మొత్తం మూడు వేల మంది వరకు పోలీసులను మోహరించగా వెయ్యి మంది వరకు ట్రాఫిక్ నియంత్రణను వినియోగించనున్నారు . హైదరా బాద్ నుంచి కందుకూరు మార్గంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్ష లు విధించారు. గ్లోబల్ సమ్మిట్ సవ్యంగా సాగేందుకు గ్రేహౌండ్స్‌తో పాటు ఆక్టోపస్ బలగాలను రంగంలో దించారు. ఈ సమ్మిట్‌కు దేశ, విదేశీ ప్రముఖులు అనేక మంది రానుండడంతో వారి కోసం అడుగడుగునా పోలీసులను మోహరిం చారు. వీరంతా శంషాబాద్ విమానాశ్రయం నుంచి రానుండడంతో విమానాశ్ర యంతోపాటు అక్కడి నుంచి కందుకూరు వరకు గల రోడ్డు మార్గంలో పోలీసు బందోబస్తును మరింత పెంచారు. ఈ సమి ్మట్‌కు ఆటంకం కలిగించేందుకు కొందరు కుట్ర పన్నుతున్నట్లు అందిన సమాచారంపై పోలీసు శాఖ అప్రమత్తమయ్యింది. దేశ, విదేశీ ప్రముఖులు రాకపోకలు సాగించే ప్రాంతాలతో పాటు వారి విడిదిచేసే ప్రాంతాలలో అదనను భద్రత కల్పించారు. పోలీసు శాఖ తరపున డిజిపి శివధర్ రెడ్డి స హా ఇతర ఉన్నతాధికారులందరు సోమవారం ఉదయం నుంచి ఫ్యూచర్ సిటీకి తరలిరానున్నారు. సాయంత్రం పొద్దుపోయే వరకు సమ్మిట్ జరగనుం డడంతో అప్పటి వరకు వారంతా అక్కడే వుండనున్నారు. మంగళవారం నాటి సమ్మిట్‌లోనూ ప్రముఖులు పాల్గొన నుండడంతో అప్పటి వరకు బం దోబస్తును కొనసాగించనున్నారు. సమ్మిట్ జరగనున్న ప్రాంగణమంతా ఇప్పటికే పోలీసు జాగిలాలచే క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఫైర్ సర్వీస్, వాటర్ వర్క్స్ విభాగాలు ఇప్పటికే అక్కడ మొ హరించాయి.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోతున్నా..

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025కు హాజరు కాలేకపోతున్నట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పార్లమెంటు సమావేశాలు, ముందస్తుగా షెడ్యూల్ చేయబడిన కార్యక్రమాల నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025 కు హాజరు కాలేకపోతున్నట్లు లేఖలో తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 విజయవంతం కావాలని ఆకాంక్షి స్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# దక్షిణాదిలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రం

### పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు

### ఆసియా బౌద్ధ దేశాల రాయబారులతో సమావేశం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** దక్షి ణ భారతదేశంలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో బౌద్ధం పరిఢవిల్లిందని తెలంగాణకు ఇంతటి చారిత్రక నేపథ్యం ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆసియా బౌద్ధ దేశాల రాయబారులతో తెలంగాణ పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం సమావేశమయ్యారు. తెలంగాణ బౌద్ధ వారసత్వం, అంతర్జాతీయ పర్యాటక-సాంస్కృతిక భాగస్వామ్యాలపై చర్చించారు. దక్షి ణ భారతదేశంలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఉందని, గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో బౌద్ధం పరిఢవిల్లిందని తెలంగాణకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని మంత్రి వివరించారు. నాగార్జునకొండ, ఫణిగిరి, ధూలికట్ట, నెలకొండపల్లి, కోటిలింగాల వంటి బౌద్ధ కేంద్రాల ప్రాముఖ్యతను రాయబారులకు వివరించారు. నాగార్జునసాగర్‌లో నిర్మాణం జరుగుతున్న బుద్ధవనం బౌద్ధ హెరిటేజ్ థీమ్ పార్క్‌ను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలియజేశారు. బుద్ధుడి జీవిత చరిత్ర, బోధనలు వంటి సమస్త సమాచారంతో కూడిన బుద్ధవనం ప్రపంచ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా భాసిల్లుతుందన్నారు. సర్వజన సంక్షేమం, ప్రేమ, శాంతి, సహజీవనంలతో కూడిన ప్రగతి దిశగా గౌతమ బుద్ధుడి మార్గంలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు బౌద్ధ ధర్మాన్ని పరిచయం చేసే జీవశిల్పంగా నిలిచిపోతుందన్నారు. రాష్ట్రం లోని బౌద్ధ వారసత్వ కేంద్రాల పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వ చేసు_న్న కృషిని వారు అభినందిస్తూ, భవిష్యత్‌లో సాంస్కృతిక, పర్యాటక, పెట్టు బడి రంగాలలో సహకారానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. నేటి (సోమ వారం) నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ రైజింగ్ - 2047 గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని మంత్రి జూపల్లి కృష్ణారావు రాయబారులను ఆహ్వానించారు.

# రైతుల ఖాతాల్లో ధాన్యం విక్రయాల డబ్బు జమకు ఆలస్యం

### రూ.12,269 కోట్ల విలువగల ధాన్యం కొనుగోలు

### రైతుల ఖాతాల్లో జమైనది రూ. 9,845 కోట్లు

### ఒపిఎంఎస్ అయినా మిల్లు జనరేట్ కాక ఇబ్బందులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:** పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారుల అసమర్థతతో రాష్ట్రంలో రైతులు ధాన్యం విక్రయించినా డబ్బులు వారి ఖాతాల్లో జమకావడంలేదు. మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటి తీసుకోవడంలో విఫలం కావడంతో ధాన్యం కేటాయింపులు కొద్ది సంఖ్యలో మిల్లులకు భారీగా కేటాయిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8410 కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు 52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి రాగా రూ. 12,269 కోట్ల విలువగలిగిన 47లక్షల మె.ట ధాన్యం ఇప్పటికి కొనుగోలు చేశారు. ఇందులో 24లక్షలమె.ట దొడ్డురకం ధాన్యం 23లక్షల మె ట సన్నధాన్యం ఉంది. కొనుగోలు చేసిన ధాన్యంకు ఇప్పటి వరకు ఎంఎస్‌పి కింద 9845కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రైతుల ఖాతాల్లో రూ.2424కోట్ల రూపాయలు గత వారం రోజులుగా జమకావడంలేదు. మరోవైపు కొనుగోలు కేంద్రాలకు వికయానికి వచ్చిన ఆరులక్షల మె.ట ధాన్యం కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తుండటంతో రైతులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అయినా మిల్లు జనరేట్ కాకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యం మిల్లుకు పంపడమే సవాల్‌గా మారింది. తెలంగాణలో మూడు వేలకు పైగా రైసుమిల్లులు ఉన్నాయి అందులో దాదాపు వెయ్యి వరకు సిఎంఆర్ ఇవ్వని బకాయిదారులు ఉన్నారు.వారికి ధాన్యం కేటాయించడంలేదు. మరోవైపు బ్యాంకు గ్యారెంటీలు తీసుకోవడంలో కూడా అధికారులు విఫలం కావడంతో ధాన్యం సేకరణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కరీంనగర్ జిల్లాలో 127 మిల్లులు ఉంటే అందులో 54 మిల్లులు డిఫాల్టర్ మిల్లు ఉన్నాయి 73 మిల్లులలో కేవలం పదిశాతం మిల్లులు మాత్రమే బ్యాంకు గ్యారెంటీ ఇచ్చినట్లు రైస్‌మిల్లర్లు చర్చించుకొంటున్నారు. వనపర్తి జిల్లాలో 53 మిల్లులు మాత్రమే అరకొర బ్యాంకు గ్యారెంటీలు చెల్లించినప్పటికి ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. ఆ జిల్లాలో 21 మిల్లులకు ధాన్యం కేటాయించకూడదని రాష్ట్ర స్థాయి అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. వనపర్తిలో బ్యాంకు గ్యారెంటీ కింద 10శాతం చొప్పున 47 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం 16కోట్లు మాత్రమే చెల్లించారు. రాష్ట్రంలో నల్లగొండ సూర్యపేట, పెద్దపల్లి, జగిత్యాల, నిర్మల్, మంచిర్యాల వరంగల్ అనేక మహబూబా బాద్ జిల్లాలో అనేక రైస్‌మిల్లులు ధాన్యం కేటాయింపులో 10శాతం బ్యాంకు గ్యారెంటీలు చెల్లించడానికి నిరాకరిస్తున్నారు. రబీసీజన్ ఆరంభం కావడంతో రైతులు ధాన్యం విక్రయాలకు సెంటర్లలో తీవ్రంగా ఇబ్బందులు పడితే మరోవైపు, మిల్లుపాయింట్‌కు ధాన్యం చేరినా ఎంఎస్‌పి రాక రైతులు అనిశ్చితికి గురవుతున్నారు. ఇప్పటి వరకు సన్నాలకు 412 కోట్ల రూపాయలు బోనస్ చెల్లించామని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతుంటే రైతులు మాత్రం గత యాసంగి బోనస్, ఇప్పటి ఖరీఫ్‌సీజన్ బోనస్ ఇంకా రాలేదని ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రీజియన్‌లో కేవలం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ ఖమ్మం (ఎన్ఎస్‌పిఆయకట్టు) ఆదిలాబాద్ జిల్లాలో లక్షట్‌పేట్ జన్నారం ప్రాం తానికి పరిమితైన వరిధాన్యం పంట తొండలు కూడా గుడ్లు పెట్టడానికి సహసం చేయని మెట్టప్రాంతాల్లో దుర్భిక్ష ప్రాంతాల్లో విస్తరించడంతో ధాన్యం దిగుబడి పెరిగింది.

# ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయులకు షాక్!

### గంట ఆలస్యమైతే ఆబ్సెంట్ ఎందుకయ్యారంటూ మెసేజ్!

### ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా మెసేజ్ పంచాలని భావిస్తున్న అధికారులు

### ఇప్పటికే ఎపిలో అమలులో ఉన్న విధానం

### తెలంగాణలోనూ అమలుకు పాఠశాల విద్యాశాఖ యోచన

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఆలస్యంగా వచ్చే వారికి పాఠశాల విద్య శాఖ అధికారులు షాక్ ఇవ్వనున్నారు. గంట ఆలస్యమైతే ఉపాధ్యాయులకి మెసేజ్ వెళ్లనుంది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల అధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలల్లో విద్యార్థులతో పాటు, సిబ్బంది హాజరు కోసం ఫేషియల్ రిక్నగేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎఫ్ఆర్ఎస్ అమలు మూలంగా పాఠశాలలకు రెగ్యులర్‌గా హాజరుకాని విద్యార్థుల పేరెంట్స్‌కి, వారంలో ఎక్కువ రోజులు హాజరు కాని విద్యార్థుల తల్లిదం డ్రులకు తమ పిల్లవాడు పాఠశాలకు హాజరు కాలేదని తెలుపుతూ మెసేజ్‌లను పంపిస్తున్నారు. తాము రెగ్యులర్‌గా స్కూల్ రాకపోతే తల్లిదండ్రులకు మెసేజ్‌లు వెళుతుండటంతో విద్యా ర్థులు క్రమం తప్పకుండా పాఠశాలకి వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పాఠశాలల్లో ఎఫ్ఆర్ ఎస్‌ను అమలు చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఇటు విద్యార్థులతో పాటు.. అటు ఉపాధ్యా యుల హాజరు కూడా గణనీయంగా పెరిగింది. విద్యార్థుల హాజరు 70 నుంచి 75 శాతం వరకు ఉంటుండగా.. టీచర్ల అటెండెన్స్ సుమారు 80 నుంచి 85 శాతం వరకు ఉంటుంది. విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోతే వారి తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపిస్తున్నట్టుగానే.. పాఠశాలకు అనుమతి లేకుండా హాజరుకానీ ఉపాధ్యాయులకు కూడా మెసేజ్‌లు పంపించాలనే యోచనలో పాఠశాల విద్య శాఖ అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు పాఠశాలు ప్రారంభమైన తరువాత గంట లోపుగా ఉపాధ్యాయుల హాజరు లేకపోతే.. వెంటనే ఆయా ఉపాధ్యాయులకి సంబంధిత పాఠశాల హెడ్మాష్టర్(హెచ్ఎం) ద్వారా గానీ లేకపోతే మండల విద్యాధికారి(ఎంఈవో)గానీ ఎందుకు పాఠశాలకు హాజరుకాలేదని పేర్కొంటూ మెసేజ్ చేయాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. తద్వారా ఆ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు పాఠశాలకు రాకపోవడానికి కారణం సెలవు తీసుకున్నారా? లేకపోతే ఆలస్యంగా వస్తామని అనుమతి తీసుకున్నారా? అదికాకపోతే ఇంకేదైనా కారణం ఉందా? అనేది ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు తనకు వచ్చిన మెసేజ్‌కు ఇచ్చే సమాధానం ఆధారంగా ఉన్నతాధికారులు తెలుసుకునే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు సెలవు తీసుకోకుండా, అనుమతి లేకుండా పాఠశాలకు హాజరుకాకుండా ఉండే పరిస్థితులు ఉంటున్న నేపథ్యంలో పాఠశాల విద్య శాఖ ఉన్నతాధికారులు ఇటువంటి నిర్ణయం తీసుకోన్నుట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 26,417 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా.. వాటిలో సుమారు 1.08 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



# మా పెళ్లి రద్దు చేసుకున్నాం!

### స్మృతిమంధాన, పలాశ్‌మచ్చల్ ఇన్‌స్టాలో వెల్లడి

**ముంబయి, డిసెంబరు 7:** భారత స్టార్ మహిళాక్రికెటర్ స్మృతి మంధాన వివాహం రద్దయింది. ఆమే ఈ సమాచారం స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌స్టోరీలోప్రకటించారు. వివాహ సందర్భంగా జరిగిన ముందస్తు వేడుకల్లో స్మృతి త్రండి అస్వస్థతకు గురికావడం ఆపై రకరకాల పుకార్లు వ్యాపించడంతో పెళ్లిని తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లుప్రకటించారు. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్‌ముచ్చల్‌తో నవంబరు 23న జరగాల్సి న పెళ్లి అనుకోని కారణాలవల్ల వాయిదాపడింది. అయితే పెళ్లిపూర్తిగా రద్దయిందని తాజాగా ఆదివారం ఆమె తెలిపారు. మరోవైపు ఆమెను వివాహమాడాల్సి న పలాశ్ మచ్చల్‌కూడా తన పెళ్లిరద్దుగురించి ఇన్‌స్టా స్టోరీలో వెల్లడించారు. గత కొన్ని వారాలుగా నా జీవితంచుట్టూ చాలా ఊహాగానాలుసాగాయని, ఇలాంటి సమయంలో మాట్లాడటం ఎంతో అవసరమని, నాగురించి అన్న గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తినని కానీ వివాహం రద్దయిందని స్పష్టంచేయాలనుకుంటున్నట్లు ఆమె తెలిపారరు. రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి ముందుకు సాగేందుకు స్పేస్ ఇవ్వాలని అభ్యర్థించారు. దేశాన్ని అత్యున్నతస్థాయిలో ఉంచేందుకు ముందుకు సాగు తానన్నారు. భారత్ తరపున మరిన్ని మ్యాచ్‌లు ఆడిట్రోఫీలు గెలుస్తానని తనకు మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలని స్మృతి తన ఇన్‌స్టా స్టోరీలో చెప్పారు. అలాగే పలాశ్‌కూడా తన జీవితంలో ముందుకువెళ్లాలని నిశ్చ యించుకున్నానని, వ్యక్తిగత సంబంధంనుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆధారాలేన్ని వదంతులు సులువుగా నమ్మేవాళ్లనిచూసి తట్టుకోవడంకష్టంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. నాప్రతిష్ఠకు భంగం కలిగించే తప్పుడు సమాచారం వ్యాప్తిచేసినవారిపై మా లీగల్‌టీమ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్టసమయంలో నాపక్షాన నిలిచినవారికి ధన్యవాదాలని పలాశ్ తన స్టోరీలో చెప్పుకొచ్చారు.

# పేద మహిళ .. పెద్ద మనసు




భూముల ధరలు ఆకాశాన్ని అంటుతోన్న రోజులివి. సెంటు భూమిని వదులుకోవడానికీ ఆలోచిస్తారు. అలాంటిది రూ.లక్షలు విలువ చేసేదాన్ని ఎవరైనా వదులుకుంటారా? కానీ ఆత్రం తేతుబాయి ఇచ్చేశారు. అలాగని తనేమీ లక్షాధికారి కాదు..చిన్న గుడిసె ఆమె నివాసం. ఆదిమ గిరిజనులు.. వీళ్లు ఎక్కువగా ఆదిలాబాద్ జిల్లాలోనే కనిపిస్తుంటారు. ఆ తెగకు చెందినవారే లేతుబాయి. ఆదిలాబాద్ జిల్లాలోని జిల్లాలోని దుబ్బగూడ (ఎస్) గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన సాహెజ్ ఈమె ఊరు. ఇటీవల అక్కడి 16 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. కొందరు నిర్మాణ పనులూ చేపట్టారు. కానీ వారిలో 10 మందికి సొంత స్థలం లేకపోవడంతో పనులు ముందుకు సాగేదు. అప్పుడు వాళ్లంతా లేతబాయిని స్థలం కోసం ఆశ్రయించారు. తహసీల్దార్ నుంచి విషయం తెలుసుకున్న ఆమె 'నా ఎకరం భూమి తీసుకోండి. ప్రతిఫలింగా నాకేమీ డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. స్థలాలు లేనివాళ్లందరికీ దానిలో ఇల్లు కట్టించి ఇవ్వండి' అని చెప్పారు. అలా రాయించిన అఫిడవిట్ మీద సంతకం పెట్టి, స్వయంగా తహసీల్దార్‌కి అందించారు. ఆమె చర్య ఎంతోమందిని ఆశ్చర్యానికి గురి చేసింది. నిజానికి లేతుబాయికి పక్కా భవనం లేదు. ఆమె నిసించేదీ చిన్న పూరింట్లో. వ్యవసాయా ధారిత కుటుంబం. ఈమెకు ముగ్గురు అబ్బాయిలు. ఒకరు కూలీపనులు చేస్తూ, మరొకరు తాపీ మేస్త్రీగా ఇంకొకరు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆమె అలా భూమి ఇచ్చినా భర్తకానీ, కొడుకులు కానీ అడ్డు చెప్పలేదట. 'సొంతిల్లు చాలామంది కల. ప్రభుత్వం నుంచి ఆ అవకాశం వచ్చింది. కానీ స్థలం లేదని తోటివాళ్లు ఎక్కడ ఇల్లు కట్టుకోలేరో, తరవాత ఈ కారణంగా ఎక్కడ గొడవలు పడతారోనని భయమేసింది. మా వాళ్లంతా ఐకమత్యంగా ఉండాలనేది నా కోరిక. నేనొక్కదాన్ని కొంత భూమి వదులుకుంటే అందరం ఒకేచోట కలిసి మెలిసి ఉండొచ్చు అనిపించింది. అందుకే నా పేరిట ఉన్న ఎకరం పొలం సంతోషంగా ఇచ్చేశా' అంటోన్న లేతుబాయి పెద్ద మనసుకి జోహార్ చెప్పాల్సిందే! □

# బుగ్గలకు 'సహజ' మెరుపు!



చాలామంది మేకప్ వేసుకునేటప్పుడు చెక్కిళ్లు/బుగ్గలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే మేకప్‌తో కాకుండా సహజసిద్ధంగా కూడా చెక్కిళ్ల అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే..

**బీట్‌రూట్‌తో...** బీట్‌రూట్ రసంలో కొద్దిగా గ్లిజరిన్ కలిపి ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చెక్కిళ్లకు అప్లై చేసుకోవాలి. తర్వాత మృదువుగా మర్దన చేసుకుంటూ ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం ప్రకాశవంతంగా మారడమే కాదు.. చెక్కిళ్లు కూడా గులాబీ రంగులో మెరిసిపోతాయి.



**అరటితో..** బాగా పండిన అరటిపండు తీసుకుని మెత్తగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి రాసుకుని పూర్తిగా ఆరనివ్వాలి. తర్వాత కాస్త గోరువెచ్చగా ఉన్న నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. అరటిపండు చర్మానికి సహజసిద్ధమైన మెరుపును అందిస్తుంది. బుగ్గల్ని ప్రకాశవంతంగా, మృదువుగా మార్చుతుంది.

**నిమ్మ, కీరాదోస రసంతో...** నిమ్మరసం, కీరాదోస రసం కొద్ది మోతాదిలో తీసుకొని బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమంలో కొద్దిగా తేనె, పాలు కూడా కలిపి ముఖానికి అప్లై చేసుకోవాలి. కాసేపు ఆరనిచ్చి శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల చెక్కిళ్లకు కొత్త కళ వస్తుంది.

**పండ్లతో ప్యాక్స్..** సాధారణంగా ఫేషియల్ చేసుకొన్నప్పుడే కాదు. చర్మం మెరుపు కోసం వివిధ ఫేస్‌ప్యాక్స్ కూడా వేసుకుంటుంటారు చాలామంది. అయితే ఇందుకు ఉపయోగించే ఫ్రూట్‌ప్యాక్స్‌లో ఎరుపు రంగులో ఉన్న పండ్లను ఎక్కువగా ఉపయోగిస్తే చెక్కిళ్లకు సహజసిద్ధమైన ఎరుపుదనాన్న తీసుకురావచ్చంటున్నారు నిపుణులు. టామాటోలతో.. రెండు టొమాటోలు తీసుకుని గుజ్జులా చేసి రసం తీసుకోవాలి. ఇందులో కొద్దిగా నీళ్లు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని మృదువుగా మర్దన చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం శుభ్రం చేసుకుంటే ఆశించిన ఫలితాలు పొందచ్చు. □

# శ్రమిస్తే ఎవరైనా విజయం సాధిస్తారు..



తనవాళ్లు, పిల్లలకోసం ప్రతి ఇల్లాలూ వంటింట్లో ఏదో ఒక ప్రయోగాలు చేస్తూనే ఉంటుంది. అందుకు కాజా పద్మావతి మినహాయింపు కాదు. అయితే ఆమె ఆ చిట్కాలను తన కుటుంబానికే పరిమితం చేయలేదు. అందరికీ అందిస్తూ.. వ్యాపారంగానూ మలుచుకున్నారు.

పద్మావతి ది కృష్ణా జిల్లాలోని మల్లవల్లి. పిల్లల ఆరోగ్యం కోసం తపన పడేవారు. వాళ్ల వయసుకు తగ్గ బరువు ఉండటానికి ప్రకృతి వైద్యుల సూచనలతో వివిధ రకాల దినుసులతో రాగి మాల్ట్ తయారు చేశారు. ఇది తన పిల్లలు, ఇంట్లోవాళ్లకి సానుకూల ఫలితాలు ఇవ్వడంతో ఇతరులకీ అందించాలనుకున్నారు. 2005లో రూ.11వేలతో 'సూర్యాహోమ్ ఫుడ్స్' ప్రారంభించారు. రైతుల నుంచి రాగులు, సజ్జ, జొన్న, సోయా, ఉలవలు వంటివి కొని, మొలకెత్తించి పొడులుగా చేసి అమ్మేవారు. మొదట చుట్టుపక్కల వాళ్లే కొనేవారు. స్పందన బాగుండటంతో సూపర్ మార్ట్‌లకీ ఆమె ఉత్పత్తులు చేరాయి. మొలకెత్తిన విత్తనాలను ఎండబెట్టి, విటమిన్లు పోకుండా పొడిచేయడానికి ప్రత్యేక యంత్రాలనీ సమకూర్చుకున్నారు. మొదట చిరుధాన్యాలపైనే దృష్టిపెట్టిన ఈమె తరవాత డ్రైఫ్రూట్స్ సహా 15 రకాల పొడులు తయారుచేశారు. ఇవేకాదు, తులసి, మునగ, అరటి, పుదీనా, దోసకాయ, శొంఠిలతో కారప్పొడులనూ చేస్తూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి నెలకు సుమారు 10 టన్నుల వరకు విక్రయిస్తున్నారు. ఈమె వ్యాపారానికి కొవిడ్ సమయం బాగా సాయపడింది. రోగనిరోధకశక్తి పెరిగేందుకు చాలామంది ప్రధాని, నిపుణుల సూచనమేరకు తృణధాన్యాలు, సోయా, శొంఠి వంటివాటిపై ఆధారపడ్డారు. అలా పద్మావతి ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. చాలామంది తమకోసమే కాదు.. విదేశాల్లోని బంధువులకీ కొరియర్ ద్వారా పంపుతున్నారు. తన పిల్లల ఆరోగ్యం కోసం పాటించిన ఈ ఇంటి చిట్కాలతోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు పద్మావతి. పిల్లల్ని ఇంజినీరింగ్, మెడిసిన్ చదివించారు. ఇప్పుడు వాళ్లు అమెరికాలో స్థిరపడ్డారు. వ్యాపారం మెరుగవ్వడంతో భర్త రవిచంద్రన్ ఉద్యోగాన్ని వదిలి వ్యాపారంలో ఆమెకు సాయపడుతున్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమనీ ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం 20 మందికి ఉపాధినీ కల్పిస్తున్నారు. కష్టాన్ని నమ్ముకొని శ్రమిస్తే ఎవరైనా విజయం సాధించొచ్చు. అంటారీమె. □

# ప్రతిఫలం




మనం ఎప్పుడు కూడ దేవున్ని మన సుఖం కోసం, మన కోరికలు గురించి విన్న వించకూడదు. మనం అందరి కొరకు ప్రార్థనా చేయాలి. ఈరోజుల్లో అందరు హోమాలు, పూజలు, అర్చనలు చేస్తున్నారు. కాని వారు చేస్తున్న పూజలో దేవున్ని ఏమి కోరుకుంటున్నారు. వాళ్ళ గురించి, వాళ్ళ కోరికలు గురించే. వాళ్ళ సమస్యలు నెరవేరాలని అడుగుతున్నారే కాని విశ్వం లో కాని దేశంలో కాని ఎటువంటి ఉపద్రవాలు జరగకూడదు. అందరు ఆయురారోగ్యాలతో ఉండాలి అని ఎవరు కొరరు. ఎవరో ఒకరిద్దరు తప్పా. అటువంటి వారిని వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు.

అందరు సొంత సమస్యలు తీరాలని మొక్కుతూ ఉంటారు. ఇక వారికి ప్రతిఫలం ఎలా వస్తుంది. నీకు ఏమి కావాలో అంతా ఆయనకు తెలుసు. సర్వ జనాల కోసం మనం ప్రార్ధన చేయాలి. ఎందుకంటె భగవంతుడు అత్యంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. అందరి కొరకు ప్రార్ధన చేస్తే, అప్పుడే మన కోరికలు నెరవేరుతాయి. నా కోరిక నెరవేరితే అది చేస్తాను, ఇది చేస్తాను అని అడగటం చాలా తప్పు. దేవున్ని ఎప్పుడు వ్యాపార దృష్టితో చూడకూడదు. అందుకే మన సమస్యలు అలానే ఉంటాయి. కోవెలకు ఎప్పుడు వెళ్లిన మోనంగా మన కోసం కాకుండ ఈ విశ్వం అంతటి కొరకు ప్రార్ధన చేయాలి. అప్పుడే నీకు ప్రతిఫలం వస్తుంది. స్వార్ధపు ఆలోచనలు, కోరికలు, పూజలు ఎన్నటికి నెరవేరవు. అవి కేవలం మన తృప్తి కొరకే. ప్రతిఫలం ఆశించి చేసేది ఎన్నటికీ దక్కదు.

**- కనుమ ఎల్లారెడ్డి.**

# ముగ్గులకు ఆహ్వానం



ధనుర్మాసం అంటే ముగ్గుల మాసంకదా! ఈ నెలంతా ముగ్గులు వేస్తారు. ఈ సందర్భంగా 'చెలి' పేజీలో ముగ్గుల ప్రచురణ కోసం ఆహ్వానం పలుకుతున్నాం. ఆసక్తిగల మహిళలు ముగ్గులు వేసి పంపించగలరు.

**సూచనలు :**

★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు.
★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు. పాతఫొటోలను పంపవద్దు.
★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి.
★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి. ★ ముగ్గులు క్లీయర్‌గా, రంగు లతో కనిపించాలి.
★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

**మా చిరునామా**

ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

# చిటికెలో పరిష్కారం



కొన్ని చిట్కాలు పెద్ద సమస్యలకు కూడా చిటికెలో పరిష్కారం చూపిస్తాయి. అలాంటివాటిల్లో ఇవి కొన్ని..

✦ పార్టీకి వెళ్లే చివరి నిమిషంలో గోళ్లకు రంగు వేసుకోవాలన్న విషయం గుర్తొస్తుంది. అప్పుడే వేస్తే త్వరగా దుస్తులకు అంటుకుంటుంది. అసంపూర్తిగా చెరిగి గోళ్ల అందాన్నీ దెబ్బతీయొచ్చు. అలాకాకుండా ఉండాలంటే.. ఓ గిన్నెలో ఐస్ క్యూబ్స్ వేసి అందులో వేళ్లను పెడితే సరి.

✦ కొత్త చెప్పుల్ని కొన్న వెంటనే వేసుకుంటే కరుస్తాయి. వేళ్ల, మడమల దగ్గర బొబ్బలూ వస్తాయి. ఇలా కాకుండా.. అక్కడ డియోడరెంట్ స్టిక్‌తో రుద్దితే ల్యూబ్రికెంట్‌లా పనిచేస్తుంది. గ్లిజరిన్ కూడా వాడొచ్చు. ఇవి గాయాలు కాకుండా చూస్తాయి.

✦ అర్జంటుగా ఫంక్షన్‌కి వెళ్లాలి. చీరకి అక్కడక్కడా ముడతలు కనిపిస్తు న్నాయి. అలాగని ఐరన్ చేసే సమయం లేదు అనుకుంటే.. హెయిర్ స్ట్రెయిటనర్ వాడి చూడండి. కుచ్చిళ్లు బాగా వస్తాయి.

✦. చీర మీద బ్లవుజు కాస్త వదులుగా ఉందనుకుంటే ట్రాన్స్‌పరెంట్ డబుల్‌సైడ్ టేప్‌ని అతికించండి సౌకర్యం గా ఉం టుంది. జ్యుయెలరీ కదల కుండానూ దీన్ని వాడొచ్చు.

✦. డ్రెస్సుకున్న షో బటన్ ఊడి పడిపోయేలా ఉంది. గట్టిగా కుట్టేద్దామనుకుంటే సుదీదారం అందుబాటులో ఉండదు. అలాంటప్పుడు పారదర్శకంగా ఉండే నెయిల్‌పాలిష్‌ని దారంపై వేస్తే.. ఆ బటన్ ఊడిపడిపోకుండా ఉంటుంది. □

# తెర

## 'కామాఖ్య' ఇంటెన్స్ థ్రిల్లింగ్ ఫస్ట్ లుక్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ శిజుగి లిగిదీ బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీవాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ మంత్రి సీతక్క 'కామాఖ్య' ఫస్ట్ లుక్ లాంచ్ చేసి టీంకు అభినందనలు తెలియజేశారు. ఇంటెన్స్, థ్రిల్లింగ్ గా ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఫస్ట్ లుక్‌కి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్.

## 'ఘంటసాల' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్

ఇది మరో శంకరాభరణం అవుతుందన్న పముఖులు.. టాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు, తన విలక్షణమైన బాణీలతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఘంటసాల వేంకటేశ్వరరావు (ఘంటసాల) బయోపిక్ ఎంతో గ్రాండ్ గా తెరకెక్కింది. సి.హెచ్. రామారావు దర్శకత్వంలో ఘంటసాల ది గ్రేట్ అనే టైటిల్‌తో డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంలో ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని, ఆయన లైఫ్ లోని విభిన్న ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారు. అన్యుక్త్ రామ్ పిక్చర్స్ సమర్పణలో సి.హెచ్. ఫణి నిర్మాణ సారథ్యంలో సి.హెచ్. రామారావు రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కించారు. ఈ సినిమాలో కృష్ణ చైతన్య ఘంటసాలగా, మృదుల ఘంటసాల సావిత్రమ్మగా, చిన్న ఘంటసాలగా తులసి మూవీ ఫేమ్ అతులిత నటించగా.. సుమన్ ముఖ్య పాత్రను పోషించారు. ఈ సినిమా నిర్మాత ఫణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మా సినిమా చూసి ఆదరించాలని కోరుకుంటున్నా. అందరికీ థాంక్స్ అని అన్నారు.



## ఆ పాత్రే తప్ప సావిత్రి కనపడే వారు కాదు



**ముప్పవరపు వెంకయ్య నాయుడు**

మహానటి సావిత్రి 90వ జయంతి సందర్భంగా వారి కుమార్తె విజయ చాముండేశ్వరి ఆధ్వర్యంల సంగమం ఫౌండేషన్ ఛైర్మన్ సంజయ్‌కిషోర్ నిర్వహణలో హైదరాబాద్‌లో సావిత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సావిత్రి ఫొటోలతో అందంగా తీర్చిదిద్దిన వేదిక పై జరిగిన ఈ జయంతి ఉత్సవాన్ని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ మహానటికి మరణం లేదని, నవరస అద్భుత నటనా కౌశలంతో ప్రేక్షకులను మైమరపించేవారని అన్నారు. తన నట జీవితంలో ప్రతి చిత్రంలో కూడా కేవలం పాత్ర మాత్రమే కనిపించేదని, సావిత్రి కనిపించేది కాదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సినీ రంగానికి సావిత్రి అభినయ నట శాస్త్ర గ్రంథమని, సినీ రంగంలో ఎంతోమంది కథానాయికలున్నా మహానటి మాత్రం సావిత్రిగారే అని కొనియాడారు. నటులు, నిర్మాత మురళీమోహన్, తనికెళ్ల భరణి, నన్నపనేని రాజకుమారి, రోజారమణి, శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

## 'శశిరేఖ' లిరికల్ సాంగ్ విడుదల



మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' అనే ఫుల్ కామెడీ ఎంటర్ టైనర్ రాబోతుంది. ఈ సినిమాలో మరో హీరో వెంకటేష్ కనిపించబోతున్న సంగతి తెలిసిందే. 2026 సంక్రాంతికి విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'శశిరేఖ' సాంగ్ లిరికల్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. సోమవారం రిలీజ్ చేయనున్నట్లు తొలుత ప్రకటించినా.. అభిమానుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని ఒక రోజు ముందుగానే తీసుకొచ్చింది. కాగా అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను మధుప్రియతో కలిసి స్వీయ సంగీత దర్శకత్వంలో భీమ్స్ పాడారు. కాగా ఈ సినిమా గురించి మెగాస్టార్ ఆ మధ్య మాట్లాడుతూ, ఈ సినిమా పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని.. ఈ మూవీ కథ తనకు నచ్చిందని చిరు ఆల్ రెడీ చెప్పారు. అన్నట్టు, అనిల్ రావిపూడి చెప్పే సీన్స్ గురించి కూడా మెగాస్టార్ చెబుతూ, సినిమాలో ఆయా సన్నివేశాల గురించి అనిల్ రావిపూడి నాకు చెబుతుంటే కడుపుబ్బా నవ్వుతున్నాను. ఈ సినిమా కచ్చితంగా అభిమానులకు నచ్చుతుంది. అని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. ఇక సాహు గారపాటి, సుస్మిత సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తారని చిరు తెలిపారు.

## నందమూరి కల్యాణ్ చక్రవర్తి రీ ఎంట్రీ



35 ఏళ్ల తర్వాత స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ కొత్తదనం ఉన్న కథలకు ప్రాధాన్యమిస్తూ, విభిన్నమైన కథాంశాలు, అద్భుతమైన క్రియేటివ్, కాస్టింగ్ సెలెక్షన్స్ తో ముందుకు సాగుతోంది. వారి తాజా చిత్రం 'ఛాంపియన్' జీ స్టూడియోస్ సమర్పణలో రూపొందుతున్న పీరియడ్ స్పోర్ట్స్ డ్రామా. అనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిమ్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో కూడా స్వప్న సినిమాస్ తమ ప్రత్యేకతని కొనసాగిస్తోంది. యంగ్ ఛాంప్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ సంచలనం అనశ్వర రాజన్ తెలుగు సినిమాల్లోకి అడుగుపెడుతుంది. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్ ఇచ్చారు. 80వ దశకంలో తన నటనతో ప్రేక్షకులను అలరించిన నందమూరి కల్యాణ్ చక్రవర్తి కం బ్యాక్ ఇస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మెగాస్టార్ చిరంజీవి లంకేశ్వరుడు సినిమాలో ప్రత్యేక పాత్ర చేసిన తర్వాత ఆయన దీర్ఘ విరామం తీసుకున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత ఆయన మళ్లీ తెరపై కనిపించబోతున్నారు. కళ్యాణ్ చక్రవర్తి రియలిస్టిక్, కథకు కీలకమైన రాజి రెడ్డి పాత్రలో కనిపిస్తారు. అతని ప్రజెన్స్ ఈ సినిమా ఎమోషన్స్, డ్రామాకి మరింత డెప్త్‌ని తీసుకురానుంది. ఛాంపియన్ ఈ క్రిస్మస్ డిసెంబర్ 25న గ్రాండ్‌గా విడుదల కానుంది.

## హైలైట్‌గా 'ఈశా' మూవీ



**నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్**

ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని డిసెంబరు 12న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదం ప్రసాద్ సమర్పణలో హేమచ వెంకటేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబరు 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో 'ఈషా' మూవీ హైలైట్స్ తెలిపారు చిత్ర నిర్మాత కేఎల్‌దామోదంప్రసాద్. ప్రొడ్యూసర్‌గా నాకు కొంత గ్యాప్ వచ్చింది. నాగత సినిమా ఫాదర్ చిట్టి ఉమా కార్తీక్ ఆశించినంతగా ఆదరణ పొందలేదు. ఆ సినిమా మంచి కంటెంట్ తో చేసినా ప్రేక్షకులకు రీచ్ కాలేదు. కొందరు టైటిల్ బ్యాడ్ అని చెప్పారు.

అయితే మంచి కథల కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాం. ఆ టైమ్‌లో డైరెక్టర్ శ్రీనివాస్ మన్నె నేను ఒక సబ్జెక్ట్ ఫైనలైజ్ చేసుకుని దాని మీద వర్కవుట్ చేశాం.

# టైటిల్ పోరుకు హైదరాబాద్



**న్యూఢిల్లీ:** క్వాలిఫయర్ 1లో చెన్నై సూపర్ వారియర్స్‌ను 4-2 తేడాతో ఓడించి హైదరాబాద్ రాయల్స్ అద్భుతమైన పునరాగమనం చేసింది. ముంబై స్మాషర్స్ ఎలిమినేటర్‌లో లక్నో లియోపార్డ్స్‌ను ఓడించి, క్వాలిఫయర్ చెన్నైని ఓడించి 2025 ఇండియన్ పికిల్‌బాల్ లీగ్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకుంది. గ్రాండ్ ర్యాలీలు 25 వరకు ఆడగా, ముంబై స్మాషర్స్ తొలి మ్యాచ్‌లో 25-24 తేడాతో క్యాపిటల్ వారియర్స్ గుర్గావ్‌ను ఓడించింది. ఆపై బెంగళూరు బ్లాస్టర్స్‌పై 25-22 తేడాతో సునాయాసంగా విజయం సాధించి ప్లేఆఫ్స్‌లో తమ స్థానాన్ని పదిలం చేసుకుంది. ప్లేస్‌మెంట్ ర్యాలీలో బెంగళూరు 25-21 తేడాతో గుర్గావ్‌ను ఓడించి ఐదవ స్థానంలో నిలిచింది. క్వాలిఫైయర్ 1లో, గ్రాండ్ ఫినాలేకు నేరుగా టికెట్ కోసం చెన్నై సూపర్ వారియర్స్ హైదరాబాద్ రాయల్స్‌తో తలపడింది. పురుషుల సింగిల్స్‌ను 15-11తో గెలుచుకుని, ఆపై హర్ష్ మెహతాతో జతకట్టి 2-0 ఆధిక్యంలో నిలిచి, అదే స్కోరును పునరావృతం చేస్తూ, మిచ్ హార్గ్రీవ్స్ చెన్నైకి ఆదర్శవంతమైన ఆరంభాన్ని అందించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో రూస్ వాన్ రీక్ ్జ మేగాన్ ఫడ్జ్ అజేయంగా నిలిచింది. కిచెన్ లైన్‌ను ఆధిపత్యం చేసి 15-13 తేడాతో ఓటమిని అందించింది. వాన్ రీక్ లీగ్‌లో ఏకైక సింగిల్స్ ఓటమి. హైదరాబాద్ ఆ జోరును మహిళల డబుల్స్‌లోకి తీసుకెళ్లింది. అక్కడ ఫడ్జ్, శ్రేయ చక్రవర్తి చెన్నై జోడీ చివరి ప్రయత్నంగా 15-13తో గెలిచి టైను సమం చేశారు. గ్రాండ్ ర్యాలీలో హైదరాబాద్ జట్టు 21-17 తేడాతో చెన్నై ఆధిక్యాన్ని తారుమారు చేసి ఫైనల్‌కు చేరుకుంది.


## బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో..
# రివాన్ టాప్ 10 ప్రదర్శన



**న్యూఢిల్లీ:** బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ముగిసిన అత్యంత పోటీతత్వ రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్స్‌లో భారతదేశానికి చెందిన రివాన్ దేవ్ ప్రీతమ్ రెండు టాప్10 ప్రదర్శనలను అందించాడు. ఇటీవలే హ్యాట్రిక్ జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిళ్లను పూర్తి చేసిన చెన్నైకి చెందిన 12 ఏళ్ల రివాన్, ప్రీఫైనల్‌లో ఘనమైన డ్రైవ్‌తో ముందుకు వచ్చి పి12 నుండి ప్రారంభించిన తర్వాత ఆరవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో, 72 మంది డ్రైవర్లతో కూడిన రేసులో రివాన్ తొమ్మిదవ స్థానంలో నిలిచాడు. ఈ ప్రక్రియలో, రివాన్ తన ప్రతిభను మాత్రమే కాకుండా, మిడ్‌గ్రిడ్ స్థానాల నుండి ప్రారంభించిన తర్వాత మైదానంలో పోరాడాలనే తన దృఢ సంకల్పాన్ని కూడా ప్రదర్శించాడు. మరో రెండు భారతీయ ఎంట్రీలు, సీనియర్ విభాగంలో బెంగళూరుకు చెందిన ఇషాన్ మాదేష్, జూనియర్ విభాగంలో చెన్నైకి చెందిన ఎషాంత్ వెంగటేసన్ ముందుకు వచ్చినప్పటికీ ఇద్దరూ ఫైనల్స్‌కు అర్హత సాధించలేదు. కాగా రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్స్ ప్రపంచ కార్టింగ్ పోటీలో అత్యంత ఉత్తమమైనదిగా గుర్తింపు పొందింది. బహ్రెయిన్ ఈవెంట్ కోసం, 60 దేశాల నుండి 394 మంది డ్రైవర్లు అర్హత సాధించారు. గత నెలలో ముగిసిన నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో తమ తమ విభాగాలలో ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న తర్వాత మూడు భారతీయ ఎంట్రీలు ఇషాన్ మాదేష్, ఎషాంత్ వెంగటేశన్, రివాన్ దేవ్ ప్రీతం గ్రాండ్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

# గౌహతి మాస్టర్స్.. ఛాంపియన్‌గా సంస్కర్


**న్యూఢిల్లీ:** గౌహతి మాస్టర్స్ 2025, పురుషుల సింగిల్స్ ఛాంపియన్‌గా సంస్కర్ సరస్వత్ నిలిచాడు. ఇదే సమయంలో మహిళల విభాగంలో తన్వీ శర్మ ఓడిపోయింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌ను గెలుచుకుని సంస్కార్ తన తొలి వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ ర్యాంక్‌లో 384వ స్థానంలో ఉన్న సరస్వత్ 21-11, 17-21, 21-13తో కఠినమైన మూడు గేమ్‌ల ఫైనల్‌లో అనుభవజ్ఞుడైన మిథున్ మజునాథ్‌ను




ఓడించాడు. ఆట అంతటా తన ఆధిక్యాన్ని కోల్పోకుండా తన సీనియర్ స్వదేశీయుడిపై ఆధిపత్యం చెలాయించి మొదటి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో 8-2 ఆధిక్యంలో ఉన్న తర్వాత వరుస గేమ్ విజయం సాధించాడు. కాగా టీనేజర్ తన్వి శర్మ, మరోసారి టైటిల్‌కు ఒక విజయం దూరంలో నిలిచింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆమె తన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయింది. చైనీస్ తైపీకి చెందిన తుంగ్ సియోటాంగ్ చేతిలో రెండు గేమ్‌లను కోల్పోయి, రన్నరప్‌గా నిలిచింది. 2024 ఒడిశా మాస్టర్స్ సూపర్ 100, 2025 యుఎస్ ఓపెన్ సూపర్ 300 తర్వాత ప్రస్తుత జూనియర్ ప్రపంచ ఫైనలిస్ట్‌కు ఇది మూడవ రన్నరప్ స్థానం. మరోవైపు యువ పురుషుల డబుల్స్ జోడీ పృథ్వీ రాయ్-సాయి ప్రతీక్ కూడా మలేషియా జంట తాయ్ / కాంగ్ చేతిలో 13-21, 18-21 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచారు.

ఆట






# మినీ వేలంలో ముగ్గురు స్టార్స్‌పైనే ఫోకస్

## భారీ బిడ్లకు ఫ్రాంచైజీలు సిద్ధం

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 మినీ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో ముగుస్తుంది. అయితే ఈసారి ముగ్గురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. మినీ వేలం కోసం 1,355 మంది ఆటగాళ్ల నమోదు చేసుకోగా, మొత్తం 77 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 31 విదేశీ ఆటగాళ్లకు అందుబాటులో ఉన్నాయి. ఐపీఎల్ మినీ వేలంలో అత్యధిక బేస్ ధర రూ. 2 కోట్లు కాగా ఈ విభాగంలో 45 మంది ప్లేయర్లు నమోదు చేసుకున్నారు. అయితే వీరిలో ఇద్దరు భారతీయ ఆటగాళ్లు, ఒక విదేశీ ప్లేయర్ ఉన్నారు. ఆ ఆటగాళ్లు ఎవరంటే ఆల్ రౌండర్ వెంకటేష్ అయ్యర్, స్పిన్నర్ రవి బిష్ణోయ్ మరియు ఆస్ట్రేలియా ప్లేయర్ కామెరాన్ గ్రీన్. గత సీజన్‌లో వెంకటేష్ అయ్యర్ అత్యంత ఖరీదైన ప్లేయర్లలో మూడవ స్థానంలో ఉన్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు అతన్ని రూ.24 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఐపీఎల్ 2025లో అయ్యర్ ప్రదర్శన సాధారణంగా ఉండటంతో ఈసారి వేలానికి ముందే అతన్ని రిలీజ్ చేసింది. దీంతో ఇప్పుడు చాలా జట్లు వెంకటేష్‌ను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య అయ్యర్ కోసం పోటీ తీవ్రంగా ఉండబోతుంది. రవి బిష్ణోయ్ ఐపీఎల్ 2022 నుంచి లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతూ వచ్చాడు. కానీ 2025 ఐపీఎల్‌లో అతని ప్రదర్శన అంచనాలను అందుకోకపోవడంతో రిలీజ్ చేసింది. ఇప్పటివరకు అతను మొత్తం 77 మ్యాచ్‌లు ఆడి 72 వికెట్లు తీసిన యంగ్ లెగ్ స్పిన్నర్. ఇప్పుడు వేలంలో అన్ని జట్లలోనూ రవిపై ఆసక్తి ఉంది. కానీ ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ అతన్ని తప్పకుండా దక్కించుకోవాలని చూస్తోంది. చెన్నైకి మంచి భారత స్పెషలిస్ట్ లెగ్ స్పిన్నర్ అవసరం ఉంది. కాబట్టి రవి బిష్ణోయ్‌ను తమ జట్టులో చేర్చుకోవాలని సీఎస్‌కే బలంగా ప్రయత్నం చేస్తుందని తెలుస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కూడా మినీ వేలంలోకి రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ఆటగాడిని ఆర్సీబీ ముంబై ఇండియన్స్ నుండి రూ.17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. గత సీజన్‌లో అతను గాయం కారణంగా ఆడలేకపోయాడు, కానీ ఈసారి తిరిగి వస్తున్నాడు. గ్రీన్ ఆస్ట్రేలియా ఫ్రంట్‌లైన్ ఆటగాడు, అతని ప్రస్తుత ఫామ్ అద్భుతంగా ఉంది. ఈ క్రమంలో ఇతడిపై రూ.25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చెన్నై, కోల్‌కతా మధ్య ఈ ఆటగాడి కోసం గట్టి పోటీ కనిపించవచ్చు.

## రెండో టెస్టులో..
# ఇంగ్లండ్ ఓటమి
## 2-0తో ఆధిక్యంలో ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** టెస్టులో ఇంగ్లాండ్‌ను ఓడించి, ఆస్ట్రేలియా సిరీస్ ఆధిక్యంలో ఉంది. ఆదివారం జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఎనిమిది వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించి 2025-26 యాషెస్ సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. బ్రిస్బేన్‌లో జరిగిన మ్యాచ్‌లో మైఖేల్ నేసర్ తొలి టెస్ట్‌లో ఐదు వికెట్లు పడగొట్టడంతో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో ఆస్ట్రేలియా 65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించింది. ట్రావిస్ హెడ్ మరియు జేక్ వెదర్‌ల్యాండ్ తొలి వికెట్‌కు 37 పరుగులు జోడించే ప్రయత్నం చేసినా కానీ




డిన్నర్ తర్వాత గస్ అట్కిన్సన్ ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేశాడు. అట్కిన్సన్ తన తదుపరి ఓవర్లో మార్నస్ లాబుస్చాగ్నేను అవుట్ చేశాడు, కానీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తన జట్టును లైన్ దాటించేలా చేశాడు, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ ఓవర్‌లో సిక్స్ కొట్టాడు. 4వ రోజు ప్రారంభంలో, బెన్ స్టోక్స్ మరియు విల్ జాక్స్ విరిగిన ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను స్థిరీకరించారు. ఏడవ వికెట్‌కు 96 పరుగులు జోడించారు. కానీ 35 ఏళ్ల నేజర్, తన మూడవ టెస్ట్ మాత్రమే ఆడుతూ, వరుస ఓవర్లలో రెండు సెట బ్యాటర్లను వెనక్కి పంపి, ఊపును తిరిగి పొందాడు. ఇంగ్లాండ్ చివరి నాలుగు వికెట్లను 17 పరుగులకే కోల్పోయింది, మరియు ఆస్ట్రేలియా వెంటనే విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

## టాప్ ఐదు కార్పొరేట్లలో రూ.72,285 కోట్ల
# ఎంక్యాప్ పెరుగుదల

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** దేశంలో టాప్ పది బిజినెస్ దిగ్గజ కంపెనీల్లో ఐదుసంస్థల మార్కెట్ విలువలు అంటే టర్నోవర్ రూ.72,285 కోట్లు పెరిగాయి. టిసిఎస్, ఇన్ఫోసిస్ కంపెనీలు అతిపెద్ద లాభపడిన సంస్థలుగా నిలిచాయి. భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ సంస్థలులాభాల్లో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ, ఎల్‌అండ్‌టి, ఎల్‌ఐసిలు కొంత కోతకు గురయ్యాయి.




గతవారంలో బిఎస్‌ఇ బెంచ్‌మార్క్ స్వల్పంగా 5.7పాయింట్లు లాభపడితే ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 16.5 పాయింట్లు దిగజారింది. టిసిఎస్ 35,909.52 పాయింట్లు లాభపడి మార్కెట్ విలువలు రూ.11,71,862.37కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ మార్కెట్‌విలువలు 23,404.55కోట్లుపెరిగి మొత్తం రూ.6,71, 366.53 కోట్లకు చేరింది. ఇక బజాజ్‌ఫైనాన్స్‌పరంగా రూ.6720.28 కోట్లు పెరిగి రూ.6,52,396.39 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ రూ.37891.9 కోట్లు పెరిగి రూ.12,01, 832.74 కోట్లకు చేరింది. ఇక ఐసిఐసిఐ బ్యాంకు పరంగా రూ.2458.49 కోట్లు పెరిగి రూ.9,95,184.46 కోట్లకు చేరుకుంది. రిలయన్స్ విలువలు మాత్రం రూ.35,116. 76 కోట్లు క్షీణించి రూ.20,85, 218.71 కోట్లకు చేరింది. ఎల్‌ఐసి విలువలు కూడా రూ.15,559. 49 కోట్లు క్షీణించి 5,50,021. 80 కోట్లకు చేరినట్లు తేలింది. ఇక ఎస్‌బిఐ విలువలు కూడా ఈ వారంలో రూ.7522.96 కోట్లు క్షీణించి రూ,8.96,662.19 కోట్లకు చేరితే హెచ్‌డిఎఫ్‌ఎసి బ్యాంకు రూ.5724.03 కోట్లు క్షీణించి రూ.15,43,019.64 కోట్లకు చేరింది.ఇక ఎల్‌అండ్‌టి మార్కెట్‌విలువలుకూడా రూ.4185.39కోట్లు క్షీణించి రూ.55,55, 459.56 కోట్లకు చేరింది. మార్కెట్ విలువలు క్షీణించినా రిలయన్స్ టాప్‌వన్ గానే నిలిచింది. తర్వాత వరుసగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఎల్‌ఐసిలు నిలిచాయి.

# ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లపైనే ఇన్వెస్టర్ల ఫోకస్!

**ముంబయి, డిసెంబరు7:** అమెరికా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలు ఈ వారం మార్కెట్లను ప్రభావితంచేస్తాయని అంచనా. ఫెడ్‌రిజర్వు పాలకవర్గ కమిటీ ఫెడరల్ ఓపెన్‌మార్కెట్ కమిటీసమావేశం నిర్ణయాలపై ట్రేడర్లు ఎంతో ఆసక్తితో ఉన్నారు. ఈ ప్రభావం దేశీయ ఈక్విటీ మార్కెట్లను ప్రభావితంచేయగలదు. అలాగే గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలు వంటివి సెంటిమెంట్‌పై ప్రభావం చూపిస్తాయని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. గత వారంలో స్టాక్ మార్కెట్లు అంత ఆశాజనకంగా కొనసాగలేదు. సెన్సెక్స్,నిఫ్టీలు దాదాపుగా ఫ్లాట్‌గానే ముగిసాయి. ఈ వారం మార్కెట్లు ఈనెల 12న విడుదలచేసే సిపిఐ గణాంకాలను చూస్తారు. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లనిర్ణయం కూడా కీలకం అవుతుందని రెలిగేర్‌బ్రోకింగ్ ఎస్‌విపి అజిత్‌మిశ్రా వెల్లడించారు. ఇక డాలరుతో




రూపాయి మారకం విలువలు 90 దాటిన క్రమంలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేసే ఛాన్స్‌లు కూడా ఎక్కువగానే ఉంటాయి.

ఈనెల 9,10 తేదీల్లో జరిగే ఎఫ్‌ఒఎంసి సమావేశాలే ఇన్వెస్టర్లు ఎక్కువ ఆసక్తితో గమనిస్తారని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ సీనియర్ టెక్నికల్ అనలిస్టు ప్రవేశ్ గౌర్ తెలిపారు. అలాగే అమెరికా ఆర్థిక గణాంకాలు కూడా ట్రేడర్ల రాడార్‌లో ఉంటుంది. 9వ తేదీ అమెరికా ఉపాధి గణాంకాలు విడుదలచేస్తుంది. అలాగే అమెరికా డాలర్ ట్రెజరీ బాండ్ల రాబడులు కూడా కీలకం అవుతాయి.వీటితోపాటు భారత్ ఆర్థికవృద్ధిగణాంకాలు రిజర్వుబ్యాంకు చేపట్టిన కార్యాచరణలను పరిగణనలోనికి తీసుకుని ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

# స్విస్‌బ్యాంకులో 10వేల ఉద్యోగాలకోత!



**బెర్న్, డిసెంబరు 7:** స్విట్జర్లాండ్‌లో అతిపెద్ద బ్యాంకు అయిన యుబిఎస్ రానున్న మూడేళ్లలో పదివేల ఉద్యోగాలను తొలగించే ప్రణాళికనును పరిశీలిస్తోందని స్విస్‌పత్రిక సోన్‌టాగ్స్ బ్లిక్ వెల్లడించింది. 2023లో క్రెడిట్ స్యూసీ విలీనం తర్వాత ఈభారీ పునర్నిర్మాణప్రక్రియ జరుగుతున్నదని వెల్లడించింది. పాలనావ్యవహారాలను క్రమబద్ధీకరించడంకోసం ఈ కొలువుల కోతలు, విలీనప్రక్రియకు ఎంతో మేలుచేస్తాయని అధికారులు చెపుతు న్నారు. యుబిఎస్ ప్రతినిధులు ఈ పదివేల సంఖ్యను మాత్రం ధృవీకరించడంలేదు. క్రెడిట్‌స్యూయిస్ కొనుగోలు తర్వాత యుబిఎస్ తన కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియలోభాగంగా వీలైనంత తక్కువగా ఉద్యోగ కోతలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు యుబిఎస్ అధికారులు తెలిపారు. 2024 చివరినాటికి యుబిఎస్‌లో సుమారు 1.10 లక్షలమంది ఉద్యోగులు ఉండగా 10వేలమందిని కుదించిన తర్వాత సుమారు 9శాతం తగ్గించింది. ఇప్పటికే సెప్టెంబరు చివరినాటికి ఉద్యోగుల సంఖ్యను బ్యాంకు 1,04,427కి తగ్గించింది. ఈ విలీనం ప్రభావంతో ఇదివరకే సుమారు 15వేల ఉద్యోగాలు తొలగించినట్లు తెలుస్తోంది.

# ఒక్క వారంలోనే రూ.11,820కోట్లు విత్‌డ్రా!

**ముంబయి, డిసెంబరు 7:** విదేశీ ఇన్వెస్టర్లు ఈనెల మొదటివారంలో మార్కెట్ల నుంచి రూ.11,820 కోట్లు విత్‌డ్రాచేసినట్లు గణాంకాలు చెపుతున్నాయి. డాలరుతో రూపాయి మారకం విలు




వలు క్షీణించినకారణంగా భారీ ఎత్తున ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించారు. నవంబరులో కూడా 3765 కోట్లు విత్‌డ్రాచేసారు. అయితే అక్టోబరులో మాత్రం ఎఫ్‌పిఐలు 14,610 కోట్లు పెట్టుబడులుపెట్టారు. మూడునెలలు నిరంతరాయంగా విత్‌డ్రాచేసిన తర్వాత అక్టోబరులో పెట్టుబడులు పెంచారు. సెప్టెంబరులో 23,885కోట్లు, ఆగస్టులో 34,990 కోట్లు, జులైలో 17,700 కోట్లు విత్‌డ్రాచేసినట్లు డిపాజిటరీ డేటా చెపుతోంది. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఈ నెలలోని మొదటివారంలోనే రూ.11,820 కోట్లు విత్‌డ్రాచేసినట్లు ఎన్‌ఎస్‌డిఎల్ వెల్లడించింది.

దీనితో మొత్తం పెట్టుబడులు విత్‌డ్రా ఈ ఏడాదిలో రూ.17.7 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.1.55 లక్షలకోట్లుగా ఉంది. కేవలం కరెన్సీ క్షీణత కారణంగానే ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తున్నట్లు నిపుణులు అంచనా. రూపాయి ఈ ఏడాది ఐదుశాతంవరకూ క్షీణించింది. ఈకాలంలోనే ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త వికె విజయ్‌కుమార్ తెలిపారు. ఎఫ్‌పిఐలు విత్‌డ్రాచేసినా దేశీయ ఇన్వెస్టర్లు మార్కెట్లకు ఊతం ఇస్తున్నారు. దీనికితోడు యుఎస్ భారత్‌ట్రేడ్‌డీల్ ఖరారులో జాప్యంకూడా గ్లోబల్ సెంటిమెంట్‌పై భారం పడుతోంది. దేశీయ ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో రూ.19,783కోట్లు పెట్టుబడులుపెట్టారు.

# మూడు కంపెనీల నుంచి వేక్‌ఫిట్ రూ.186 కోట్లు సమీకరణ



**ముంబయి, డిసెంబరు 7:** హోమ్ అండ్ ఫర్నిషింగ్స్ కంపెనీ వేక్‌ఫిట్ ఇన్నొవేషన్స్ రూ.186 కోట్లను ముగ్గురు ఇన్వెస్టర్లనుంచి సమీకరించింది. సీడ్‌వ్యూ క్యాపిటల్, వైట్‌ఓక్ క్యాపిటల్, ఇన్ఫోఎడ్జ్, టీమ్‌సెక్ అధీనంలోని క్యాపిటల్2బిలనుంచి నిధులుసేకరించింది. పబ్లిక్ ఆఫర్‌కు ముందుగానే కొంత మొత్తం సేకరించుకోగలిగింది. స్టీడ్‌వ్యూ క్యాపిటల్ మారిషస్, వైట్‌ఓక్‌క్యాపిటల్, క్యాపిటల్ 2బిలు సమిష్టిగా 95.57 లక్షల ఈక్విటీ వాటా లను రూ.195 ధర చొప్పున కొనుగోలు చేసాయి. స్టీడ్ వ్యూక్యాపిటల్ రూ.101 కోట్ల విలువైలన షేర్లు కొంటే వైట్‌ఓక్ రూ.72 కోట్లు పెట్టుబడులు పెట్టింది. అలాగే క్యాపిటల్2బి కూడా రూ.13కోట్లు వేక్‌ఫిట్‌లో పెట్టుబడులుపెట్టాయి. కంపెనీలో ఉన్న పీక్ ఫిఫ్టీన్ పార్టనర్స్, రెడ్‌వుడ్‌ట్రస్ట్, వెర్లిన్‌వెస్ట్ ఎస్‌ఎ కంపెనీలనుంచి వీరు కొనుగోలుచేస్తున్నారు. సెకండరీ షేర్ బాలాయింపులు ఈనెల 3,4 తేదీల్లో బదలాయించారు. వేక్‌ఫిట్ ఈనెల ఐదో తేదీనే రూ.580 కోట్లు యాంకర్ ఇన్వెస్టర్లనుంచి సేకరించింది. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్, ప్రుడెన్షియల్ హాంకాంగ్, 360వన్, స్టీవ్యూ క్యాపి టల్, అముంది ఫండ్స్ న్యూసిల్క్‌రోడ్, హెచ్‌డి ఎఫ్‌సి మ్యూచువల్‌ఫండ్; యాక్సిస్ మూచువల్ ఫండ్స్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి.




# దేశ ఆర్థికవ్యవస్థకు ఈ ఐదు రాష్ట్రాలే కీలకం
## జిడిపిలో వీటి వాటా 48శాతం!

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** భారత్ ఆర్థికవ్యవస్థ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుతోంది. దేశ స్థూల జిడిపి సుమారు 4.125 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. అంటే రూ.343 లక్షలకోట్లు అని అర్థం. దీనికితోడు ఆర్‌బిఐనుంచి ఆర్థికరంగ నిపుణులు కూడా 6.6శాతం వృద్ధితో ఉన్నారు. జిడిపి 2025-26లో 8.2శాతానికి విస్తరిస్తుందన్న అంచనాలు కూడా లేకపోలేదు. కేవలం ఐదు రాష్ట్రాలు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్; ఉత్తరప్రదేశ్‌లనుంచి మాత్రమే ఎక్కువ వాటా అందుతోంది. ఈ ఐదు రాష్ట్రాలనుంచే 48శాతం దేశ జిడిపికి అందుతున్నట్లు అంచనా.ఆర్థికవృద్ధికి ఊతంగా ఎక్కువగా ఐటి, ఉత్పత్తిరంగం, సేవలరంగాలే కీలకం. జాతీయ సగటు 6.5శాతం కంటే మరింతగా వృద్ధినమోదుచేసాయి. ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక వృద్ధి, మహారాష్ట్ర ఆర్థిక ఆధిపత్యం వంటివి భారత్ వృద్ధి స్టోరీకి కీలకంగా ఉన్నాయి. 2028-29 నాటికి దేశం ఐదులక్షలకోట్లడాలర్ల ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశంగా మారుతోందని కేంద్ర అర్థగణాంకశాఖ వెల్లడించింది. మహారాష్ట్ర జిఎస్‌డిపి రూ.49.39 లక్షలకోట్లుగా ఉంది. భారత జిడిపిలో 13.5శాతం వాటాతో ఉంది. 2028కల్లా ఈరాష్ట్ర జిడిపి 55 లక్షలకోట్లకు చేరుతుందని అంచనా. అలాగే తమిళనాడు జిఎస్‌డిపి కూడా 35.68 లక్షలకోట్లుగా ఉంది. దేశ జిడిపికి 9శాతం వాటాతో ఉంది. సేవలరంగంనుంచే అత్యధికంగా వెళుతోంది. కర్ణాటక సిలికాన్ వ్యాలీగా ఉన్న కర్ణాటక కూడా దేశ జిడిపిలో 8.2శాతం వాటాతో ఉంది. ఉత్తరప్రదేశ్‌పరంగాచూస్తే రూ.30.70లక్షలకోట్లతో దేశ జిడిపికి 8.2శాతం వాటాను అందిస్తున్నట్లు తేలింది. ఈ ఐదు రాష్ట్రాలే దేశ ఆర్థికవృద్ధికి గ్రోత్ ఇంజిన్లు, పవర్‌హౌస్‌లుగా ఉన్నట్లు ఆర్థిక నిపుణుల అంచనా.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.